www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మధుమేహం, ఊబకాయం ఉంటే.. అమెరికా వీసా కష్టమే!

ఎంబసీలు, కాన్సులేట్లకు కొత్త మార్గదర్శకాలు

గుండె జబ్బులు, శ్వాస సమస్యలు ఉన్నవారికీ ఇబ్బందే

ఎక్కువ వయసున్నా, డిపెండెంట్లకు సమస్యలున్నా ప్రభావం

వారితో అమెరికా ప్రభుత్వంపై భారం పడే

అవకాశం ఉంటుందన్న అమెరికా విదేశాంగ శాఖ

2



వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం: ట్రంప్

శనివారం | 8-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 203 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: తదియ ఉ.7:32, చవితి తె.4:25, నక్షత్రం: మృగశిర రా.10:02 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: శేషం ఉ. 6:59, తె.5:44 మొదలు, దుర్ముహూర్తం: ఉ.6:20-7:50, అమృతఘడియలు: మ.2:09-3:35, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 6:20, సూర్యాస్తమయం: 5:37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



క్రికెటర్ శ్రీచరణికి వీణ బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీచరణికి 2.5 కోట్లు నజరానా

ఇంటి నిర్మాణానికి వెయ్యి చదరపు గజాలు

గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయం

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన శ్రీచరణి

గన్నవరం విమానాశ్రయంలో మహిళా క్రికెటర్‌కు ఘనస్వాగతం

10



విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థినులు

2

వందేమాతరం 'ఆత్మ'ను తొలగించారు



1937లో కీలక చరణాలు తీసేశారు

దేశ విభజనకు అదే బీజం వేసింది

ఈ గేయం స్వాతంత్ర్య సంగ్రామ గొంతుక

జాతి నిర్మాణానికి మహామంత్రం: ప్రధాని మోదీ

బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి 150 ఏళ్లు

ఏడాది పాటు వేడుకలకు ప్రధాని శ్రీకారం

'బనకచర్ల'లో భారీ మార్పులు

నల్లమల సాగర్ వరకే ప్రాజెక్టు పరిమితం

ఇతర రాష్ట్రాల అభ్యంతరాలతోనే?

2 దశల్లో ప్రతిపాదిత పథకం నిర్మాణం

అంచనా వ్యయం రూ.49,550 కోట్లు

పోలవరం కుడి కాలువ గుండా ప్రకాశం బ్యారేజీ ఎగువన

దాములూరు వరకు వరద నీరు తరలింపు

హరిశ్చంద్రపురం వద్ద సాగర్ కుడి కాలువలోకి

అక్కడి నుంచి 3 సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు తరలింపు

పాత ఆర్‌ఎఫ్‌సీ రద్దు.. త్వరలో కొత్త టెండర్లు?



మా పరిధిలోది కాదు

బనకచర్లపై తెలంగాణకు పీపీఏ స్పష్టీకరణ

అనుమతి/తిరస్కరణ అధికారం మాకు లేదు

వాటిని ప్రస్తావిస్తే మేమేమీ చేయలేం: సీఈవో

పోలవరం తొలి దశలో 'భద్రాచలం' ముంపుపై కమిటీ

కేంద్ర నిధులు వచ్చిన వెంటనే ప్రత్యేక ఖాతాలో జమ

ఏపీ ప్రభుత్వానికి సూచన.. డ్యాం పనులపై సంతృప్తి

నేడు ప్రాజెక్టు ప్రాంతానికి అతుల్ జైన్ బృందం

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచనలో పడింది. రూ.81,900 కోట్ల అంచనాతో మూడు దశల్లో దీనిని చేపట్టాలని నిర్ణయించిన రాష్ట్ర జల వనరుల శాఖ.. ఈ ప్రాజెక్టు డిజైన్‌లో భారీ మార్పుచేర్పులకు సిద్ధమవుతోంది. పోలవరం నుంచి వరద జలాల తరలింపును బనకచర్ల వరకు కాకుండా మధ్యలో నల్లమల సాగర్ వరకే పరిమితం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. దీన్ని రూ.49,550 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో చేపట్టాలని భావిస్తోంది. పోలవరం-బనకచర్ల పథకానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించేందుకు ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానిస్తూ గత నెల 11న జలవనరుల శాఖ

మిగతా 13వ పేజీలో...

- ఇప్పుడు ప్రపంచ ఆహారపు అలవాట్లు మారిపోయాయి. ఒకప్పుడు రాగులు, సజ్జలు, జొన్నలు తినేవారు. రూ.2 కేజీ బియ్యంతో రాయలసీమలో అన్నం తినే పరిస్థితి ప్రారంభమైంది. ఈ రోజు వరి అన్నం తినేవారు తగ్గిపోతున్నారు. అందుకు తగినట్టుగా రైతాంగం మారాలి. ఆ మార్పు కోసమే రాయలసీమను ఉద్యాన, కోస్తాంధ్రను ఆక్వాకల్చర్ హబ్‌లుగా చేస్తున్నాం. వాణిజ్య పంటలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇచ్చి, సాగు చేసే పంటల్లో మార్పులు చేసుకోవాలి. - సీఎం చంద్రబాబు



గుంటూరులో ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అన్నదాతకు అండ

ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు 25 వేలకు పెంచాం

వరదలు, విపత్తులలో ఆదుకుంటున్నాం

ధాన్యం కొన్న 24 గంటల్లోనే చెల్లింపు

రాయలసీమలో సబ్సిడీ 'డ్రిప్' పునరుద్ధరణ

అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు సాయం

రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ప్రకృతి సాగుకు అగ్రిటెక్ జోడిస్తే మంచి ఫలితాలు

ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించండి

కాలానికి తగినట్టు పంటల సాగు మారాలి

గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయంపై నిర్లక్ష్యం

ఆచార్య రంగా 125వ జయంతిలో చంద్రబాబు

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, సాగుకు సాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఒకప్పుడు మన రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉండేదన్నారు. ఇప్పుడు అక్కడ శాంపిల్స్ పరీక్షిస్తూ పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉంటే తిరస్కరిస్తున్నారని అన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంతో ముందుకు పోతున్నామని, దీనికి త్వరలోనే అగ్రిటెక్‌ను జోడించి

మిగతా 14వ పేజీలో...

స్పీడ్ పెంచండి

పెట్టుబడుల ప్రతిపాదనలకు తక్షణ ఆమోదం

భూములు తీసుకుని పరిశ్రమలు పెట్టకపోతే అనుమతులు రద్దు

రాష్ట్రంలో 3 మెగాసిటీల అభివృద్ధి

అనకాపల్లి-విజయనగరం వరకూ విశాఖ మెగా సిటీ

ఎస్‌ఐపీబీ సమావేశంలో చంద్రబాబు ఆదేశాలు

12

ఆండ్రాయిడ్ ఫోన్లకు హ్యాకింగ్ ముప్పు!

ఓఎస్ 13, 14, 15, 16లను వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సెర్ట్-ఇన్ సూచన

2

మహిళకు 54 ఏళ్ల జైలు!

తమిళనాడులో బాలుడిపై లైంగిక దాడి కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు







జనసమ్మర్ద ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాల్లో జాడ ఉండొద్దు

2 వారాల్లో ఆ ప్రాంతాల్లో ఫెన్సింగ్ వేయండి

అక్కడి కుక్కల్ని స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించండి

అమలుపై సీఎస్‌లు 3 వారాల్లో నివేదిక ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యానికి గురైన వారి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యాసంస్థలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. వీధి కుక్కలను

మిగతా 2వ పేజీలో...

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య

విమానాలు ఆలస్యం

'ఏఎంఎస్‌ఎస్'లో సమస్య వల్లే: నిపుణులు

పలు ఇతర ఎయిర్‌పోర్టులపైనా ప్రభావం

శంషాబాద్ విమానాశ్రయంలో 60కి పైగా విమానాల రాకపోకలకు అంతరాయం

మాల్‌వేర్ దాడి: 'సీఎన్ఎన్-న్యూస్18'

2

పల్లె పండుగ 2.0



పంచాయతీరాజ్ విభాగం సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్, అధికారులు

సాస్కి నిధులతో పనులు చేపట్టాలి

ప్రజలందరికీ పల్లె రోడ్ల సమాచారం

త్వరలో అందుబాటులోకి జీఆర్ఎంఎస్

పైలట్‌గా అడవితల్లి బాటలకు అనుసంధానం

మార్చి నాటికి కోటి మందికి స్వమిత్వ కార్డులు

జల్‌జీవన్, స్వమిత్వ పనులు నేనే పరిశీలిస్తా

అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పల్లెపండుగ 2.0, అడవి తల్లిబాట పనుల పురోగతి, జల్‌జీవన్ మిషన్, స్వమిత్వ పథకాలపై ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్,

మిగతా 12వ పేజీలో...

చకచకా సన్నాహాలు

విశాఖలో 14,15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

దానికి తగినట్టే భారీగా ఏర్పాట్లు

ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో 8 హాళ్లు

సదస్సు ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి

వేదిక వద్ద సీఎం, కేంద్ర వాణిజ్యమంత్రికి చాంబర్లు

33 దేశాల నుంచి వాణిజ్య మంత్రుల రాక

ఇప్పటికే వెయ్యి మంది ప్రతినిధుల రిజిస్ట్రేషన్

11



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లు

అమరావతి నిర్మాణాలకు కొత్త జోష్

7,500 కోట్ల రుణం మంజూరు చేసిన ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ

12

మద్యం విక్రయాల్లో మరింత పారదర్శకత పెంచేందుకు, నకిలీలను గుర్తించడంతోపాటు అమ్మకాలను పూర్తిస్థాయిలో డిజిటల్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనిలో భాగంగా మద్యం ట్రాకింగ్‌ను మరింత విస్తరించనుంది. ప్రస్తుతం ఎక్సైజ్‌లో డిస్టిలరీ నుంచి మద్యం డిపో వరకు ట్రాకింగ్ విధానం ఉంది. ఇకపై ఆ ట్రాకింగ్‌ను వినియోగదారుడి వరకు తీసుకెళ్లే ప్రయత్నం మొదలుపెట్టింది. తద్వారా నకిలీ మద్యం సహా అక్రమ విక్రయాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది.

ప్రతి సీసాకూ లెక్క!

షాపుల నుంచి వినియోగదారుల వరకు ప్రతి దశలోనూ లిక్కర్ ట్రాకింగ్

మద్యం అమ్మకాల్లో ట్రాక్ అండ్ ట్రేస్..

ప్రస్తుతం డిపోల వరకే ఈ టెక్నాలజీ

త్వరలో పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపులు

రియల్ టైమ్ డేటాపై ఎక్సైజ్ కసరత్తు

అక్రమాలు, నకిలీలకు అడ్డుకట్టే లక్ష్యం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం విక్రయాలు, షాపులు, బార్లలో నిల్వ సహా.. వినియోగదారులు కొనుగోలు చేసే సీసాల వరకు ప్రభుత్వం పక్కాగా వ్యవహరించనుంది. ప్రతి దశలోనూ ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయాలని సంకల్పించింది. ప్రస్తుత విధానంలో మద్యం షాపులు, బార్లు ప్రభుత్వం నుంచి ఎంత మేరకు కొనుగోలు చేస్తున్నాయన్న వివరాలను మాత్రమే తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వినియోగదారులకు ఎంత విక్రయించారు?. షాపులు, బార్లలో ఎంత స్టాకు మిగిలింది?. అనే వివరాలు ప్రభుత్వానికి తెలియడం లేదు. దీని వల్ల నకిలీ మద్యం సహా అక్రమ విక్రయాలను

మిగతా 11వ పేజీలో...

హాజరు నుంచి మినహాయించండి

అవసరమైతే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతాను

స్వయంగా వస్తే భారంగా మారనున్న భద్రతా ఏర్పాట్లు

సీబీఐ ప్రత్యేక కోర్టులో జగన్ పిటిషన్



14

జనసమ్మర్థ ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

(మొదటి పేజీ తరువాయి)



శుక్రవారం సుప్రీంకోర్టు ఆవరణలో వీధి కుక్కలు

పట్టుకుని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసిన తర్వాత కూడా తిరిగి అదే ప్రదేశంలో వదిలి పెట్టరాదని ఆదేశించింది. అలాగే, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై పశువుల విచ్చలవిడి సంచారంపైనా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆలనా పాలనా లేకుండా రోడ్లపై సంచరించే పశువులను తక్షణమే గోశాలలకు తరలించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు, హైవే గస్తీ బృందాలు పకడ్బందీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయండి

దేశవ్యాప్తంగా కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా మారాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని తేల్చి చెప్పింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రజా క్రీడా సముదాయాలు, బస్టాండ్‌లు, డిపోలు, రైల్వేస్టేషన్లను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి వీధి కుక్కలు చొరబడకుండా పకడ్బందీగా ఫెన్సింగ్ లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. స్థానిక మున్సిపాలిటీలు, పంచాయతీలు ఆయా ప్రాంగణాల నుంచి వీధి కుక్కలను తక్షణమే పట్టుకోవాలని చెప్పింది. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించాలని ఆదేశించింది. స్టెరిలైజేషన్ తర్వాత తిరిగి అదే ప్రాంతంలో వదిలి పెట్టకూడదని స్పష్టం చేసింది. వాటిని తప్పకుండా షెల్టర్ హోంలకు తరలించాల్సిందేనని చెప్పింది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇతర ప్రధాన రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు లేదా షెల్టర్ హోంలకు తరలించాలని, వాటికి పునరావాసం కల్పించాలని తెలిపింది. దీనికోసం ప్రత్యేకంగా 'హైవే పెట్రోల్' బృందాలు, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులు నిర్దేశిత జన సమర్థ ప్రాంతాలను తనిఖీ చేసి, అక్కడ కుక్కలు లేవని నిర్ధారించుకోవాలని తెలిపింది. కుక్కలను తొలగిస్తే కొత్త కుక్కలు ఆ ప్రదేశాన్ని ఆక్రమిస్తాయని, ఇది ఏబీసీ నిబంధనలకు విరుద్ధమంటూ లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. తమ ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులదేనని మరోసారి స్పష్టం చేసింది. ఫెన్సింగ్, తనిఖీలపై మూడు వారాల్లోగా, రోడ్లపై పశువుల తొలగింపుపై ఎనిమిది వారాల్లోగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులు సమగ్ర నివేదికలు దాఖలు చేయాలని ఆదేశించింది.

రోజుకు 10 వేల కుక్కకాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గతేడాది సగటున రోజుకు 10వేల మంది కుక్కకాటు బారినపడ్డారు. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. 2025 జనవరి ఒక్క నెలలోనే 4.29 లక్షల మంది వీధి కుక్కల కాటుకు గురయ్యారు. తెలుగు రాష్ట్రాలను పరిశీలిస్తే ఏపీలో 2022లో 1,92,360 కేసులు నమోదైతే 2024 నాటికి ఈ సంఖ్య 2,45,174కు చేరింది. తెలంగాణలో 2022లో 92,924 కేసులు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 1,21,997 కి పెరిగింది. 2022-2024 మధ్యకాలంలో అత్యధికంగా కుక్క కాటు కేసులు నమోదైన టాప్-10 రాష్ట్రాల్లో మహారాష్ట్ర(13.5 లక్షలు) మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ(3.33 లక్షలు) ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. రేబిస్ మరణాల్లో మహారాష్ట్ర (35) మొదటి స్థానంలో ఉండగా తెలంగాణలో ఒక్క రేబిస్ మరణమూ సంభవించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూలై వరకు 87,366 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. దేశ జనాభా 146 కోట్లు ఉండగా, 1.53 కోట్ల వీధి కుక్కలు ఉన్నట్టు ఒక అంచనా.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య.. వందల విమానాలు ఆలస్యం

'ఏఎంఎస్‌ఎస్'లో సమస్యవల్లే: నిపుణులు



శుక్రవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ

శంషాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏ విమానం ఎప్పుడొస్తుందో తెలియదు.. వచ్చిన విమానం ఎప్పుడు బయల్దేరుతుందో తెలియదు.. బోర్డింగ్ పాస్‌లు ఇచ్చే గేట్ల వద్ద వందలాది ప్రయాణికులు.. గంటలకొద్దీ నిరీక్షణ.. నిరీక్షించలేక ప్రయాణికుల్లో అసహనం.. ఇవీ ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం కనిపించిన దృశ్యాలు! రోజుకు 1500కు పైగా విమానాల రాకపోకలతో.. దేశంలోనే అత్యంత రద్దీ కలిగిన విమానాశ్రయంగా పేరొందిన ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)'లో సాంకేతిక సమస్య కారణంగా వందలాది విమానాలు ఆలస్యమయ్యాయి. దేశీ, అంతర్జాతీయ సర్వీసులన్నీ కలిపి 800కు పైగా విమానాలపై ఈ ప్రభావం పడినట్టు సమాచారం. ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్.. ఇలా అన్ని సంస్థలూ తమ విమానాలు ఆలస్యమైనట్టు ప్రకటించాయి. ఈ సమస్య ప్రభావం దేశంలోని ఇతర నగరాల్లోని ఎయిర్‌పోర్టులపైనా తీవ్రంగా పడుతోంది. రాజధాని నుంచి రావాల్సిన విమానాలు ఆలస్యం అవుతుండడంతో.. జైపూర్, లఖ్‌నవూ, ముంబై, వారాణసీ తదితర విమానాశ్రయాల్లోనూ పలు సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆయా విమానాశ్రయాల అధికారులు.. ఈ ఆలస్యం గురించి ప్రయాణికులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో 60కిపైగా సర్వీసులపై ఈ ప్రభావం పడింది.

ఇదీ సమస్య...

విమానాల రాకపోకలకు అత్యంత కీలకమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు సంబంధించి 'ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ (ఏఎంఎస్‌ఎస్'లో సాంకేతిక సమస్య ఏర్పడడమే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఈ గందరగోళానికి కారణమని విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) తెలిపింది. గురువారం సాయంత్రం నుంచీ.. ఈ సమస్య కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు.. విమానాల ప్రణాళికలు ఆటోమేటిగ్గా రావట్లేదు. దీంతో వారు తమకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఫ్లైట్ ప్లాన్స్‌ను మాన్యువల్‌గా సిద్ధం చేయాల్సి వస్తోంది. అందుకు ఎక్కువ సమయం పడుతుండడంతో విమానాలు బయల్దేరడం బాగా ఆలస్యమవుతోంది. ప్రముఖ ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రేడార్24.కామ్' ప్రకారం.. ఈ సమస్య కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 300కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి.

మాల్‌వేరే కారణమా?

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రస్తుత సమస్యకు సాంకేతిక సమస్యలే కారణమని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఏటీసీ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌లో ఎవరో కావాలనే మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టడం వల్లే ఇలా జరిగిందని, ఇది లక్ష్మిత దాడేనని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'సీఎన్‌ఎన్-న్యూస్ 18' వెబ్‌సైట్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ మాల్‌వేర్ సిస్టమ్ ఇంటర్‌ఫేస్‌లను,, రేడార్ సింక్రనైజేషన్ మాడ్యూళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నట్టుగా ఆ వర్గాలు పేర్కొన్నట్టు అందులో వివరించింది. ఇటీవలికాలంలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయకపోవడం, రియల్‌టైమ్ బ్యాకప్ లేకపోవడం వల్ల పరిస్థితి ఇంకా దారుణంగా తయారైనట్టు వెల్లడించింది.

లోకం తీరు



'అహ్మదాబాద్' ప్రమాదానికి పైలెట్‌ను నిందించలేం: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 7: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించి.. పైలెట్‌ను నిందించలేమంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలెట్ సుమిత్ సభర్వాల్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. కేంద్రం, డీజీసీఏలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే ఓ భవనంపై కూలిపోవడంతో ప్రధాన పైలెట్ సుమిత్ సహా 260 మంది మృతి చెందారు. దీనిపై కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపి ప్రమాదానికి కారణాలు తేల్చాలంటూ సుమిత్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్, భారత పైలెట్ల సమాఖ్య సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం.. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ (పుష్కరాజ్) కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. విదేశీ మీడియా నివేదికలపై చింతించాల్సిన అవసరం లేదు. పైలెట్ తప్పిదం కారణంగానే ప్రమాదం జరిగిందని దేశంలో ఎవరూ భావించడం లేదు. ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ మాత్రమే బయటికొచ్చింది' అని పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డీజీసీఏ, ఇతర అధికారులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

మధ్యప్రదేశ్ పోలీసు శిక్షణలో భగవద్గీత పఠనం తప్పనిసరి

భోపాల్, నవంబరు 7: పోలీసు సిబ్బంది సరైన మార్గంలో జీవించాలనే ఉద్దేశంతో తమ శిక్షణా కేంద్రాల్లో భగవద్గీత పఠన కార్యక్రమాలను ప్రారంభించాలని మధ్యప్రదేశ్ పోలీసు శిక్షణ విభాగం నిర్ణయించింది. ఈ మేరకు శిక్షణ విభాగం అదనపు డీజీ రాజాబాబుసింగ్ రాష్ట్రంలోని ఎనిమిది శిక్షణా కేంద్రాలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం 4వేల మంది శిక్షణ పొందుతున్నారు. జూలైలో నూతన బ్యాచ్ ప్రారంభ సందర్భంలోనూ శిక్షణార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా రామచరితమానస్‌ను పఠించాలని రాజాబాబుసింగ్ సూచించారు. శ్రీరాముని జీవిత విలువలను, ఆయన 14 సంవత్సరాల వనవాసాన్ని వర్ణించే ఆ గ్రంథం వారిలో క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. గతంలో గ్వాలియర్ రేంజ్ ఐజీగా ఉన్నప్పుడు కూడా ఆయన ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టి, ఖైదీలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

ఆండ్రాయిడ్ ఫోన్లకు హ్యాకింగ్ ముప్పు!

న్యూఢిల్లీ, నవంబరు 7: దేశంలో ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న కోట్లాది మందికి ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) కీలకమైన భద్రతా హెచ్చరికలు చేసింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్)లో పలు లోపాలను గుర్తించినట్లు పేర్కొంది. తద్వారా సైబర్ నేరగాళ్లు ఫోన్లను హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని, టార్గెట్ చేసుకున్న డివైజ్‌లలో ఆర్బిటరీ కోడ్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆండ్రాయిడ్ 13, 14, 15, 16 ఓఎస్ యూజర్లు హ్యాకింగ్ రిస్క్‌లో ఉన్నారని పేర్కొంది. ఆయా ఓఎస్ వెర్షన్ల ఆండ్రాయిడ్ ఫోన్లను వినియోగిస్తున్న వారు.. వెంటనే ఓఎస్‌ను అప్‌డేట్ చేసుకోవాలని, గూగుల్ తాజాగా రిలీజ్ చేసిన ఆండ్రాయిడ్ సెక్యూరిటీ ప్యాచ్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

బాలుడిపై లైంగిక దాడి.. మహిళకు 54 ఏళ్ల జైలు!

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన మహిళకు పోక్సో కోర్టు 54 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ, సంచలన తీర్పు వెలువరించింది. తేదియూరుకు చెందిన లలిత (38) విడుగర్‌పాళయం పౌష్టికాహార కేంద్రంలో వంటమనిషిగా పని చేస్తూ అక్కడి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థితో సన్నిహితంగా వుండేది. 2021 అక్టోబరు 26న అతన్ని తీసుకుని పరారైంది. లలిత ఆ బాలుడిని వేరే ప్రాంతానికి తీసుకెళ్లి, అతనిపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు అత్యాచారం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోక్సో కేసు నమోదు చేయగా.. తిరువారూర్ పోక్సో కోర్టు న్యాయాధికారి శరత్‌రాజ్ గురువారం తీర్పు వెలువరించారు. లలితకు 54 ఏళ్ల జైలుశిక్ష, రూ.18 వేల జరిమానా విధించారు.

భారత్‌లోనే సుఖోయ్-57ల తయారీ!

న్యూఢిల్లీ/మాస్కో, నవంబరు 7: 'మేక్ ఇన్ ఇండియా'లో మరో ముందడుగు! రష్యాకు చెందిన సుఖోయ్- 57 స్టెల్త్ యుద్ధ విమానాలను దేశీయపద్ధతిలో పెద్దఎత్తున తయారుచేసేందుకు రక్షణశాఖకు చెందిన సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సిద్ధమవుతోంది. దీనిపై త్వరలోనే కీలక ఒప్పందం కుదరవచ్చునన్న సంకేతాలను రష్యా ప్రభుత్వ వర్గాలు అందిస్తున్నాయి. తయారీకి అవసరమైన టెక్నాలజీని, ఇతర సోర్స్ కోడ్‌లను రష్యా బదిలీ చేస్తే, హాల్ వీటిని తయారుచేస్తుంది. రష్యాలోని సుఖోయ్ డిజైన్ బ్యూరో, అక్కడి రక్షణ విభాగాలకు చెందిన నిపుణుల బృందం ఈ ఏడాది సెప్టెంబరులో హాల్‌ను సందర్శించింది. తన పరిశీలనలో భాగంగా బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని ఆ సంస్థ ప్రధాన ఉత్పత్తి యూనిట్లకు వెళ్లింది. సుఖోయ్-57లను స్థానికంగా నిర్మించడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యం, సాంకేతిక సన్నద్ధత హాల్‌కు ఉన్నాయని, ఆ సత్తాను ఇప్పటికే ఆ సంస్థ 50 శాతం సాధించిందని రష్యా ప్రభుత్వానికి ఈ బృందం నివేదించింది. దీంతో రష్యా ప్రభుత్వం సంతృప్తి చెందినట్టు తెలిసింది. త్వరలోనే ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా దీనిపై ఒప్పందం ఖరారు కావచ్చునని నిపుణులు చెబుతున్నారు.

రష్యా సైన్యంలో 44 మంది భారతీయులు

న్యూఢిల్లీ, నవంబరు 7: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైన్యం తరఫున 44 మంది భారతీయులు కూడా పాల్గొంటున్నారని శుక్రవారం భారత విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. వారిని విడుదల చేయాలని ఆ దేశ అధికారులను కోరినట్టు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. వారి పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు రానుండడం, తమ వారిని విడిపించాలని కోరుతూ బాధితుల కుటుంబ సభ్యులు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడంతో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

వందేమాతరం 'ఆత్మ'ను తొలగించారు

1937లో కీలక చరణాలు తీసేశారు.. దేశ విభజనకు అదే బీజం వేసింది: ప్రధాని



వందేమాతరంపై స్మారక స్టాంపును ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 7: జాతీయ గేయం 'వందేమాతరం' స్వాతంత్ర్య సంగ్రామానికి గొంతుకగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్ర్యానంతరం జాతి నిర్మాణానికి మహామంత్రమైందని చెప్పారు. దురదృష్టవశాత్తూ అలాంటి పాట ఆత్మను తొలగించారని.. కీలక చరణాలను తీసివేసి రెండింటినే ఉంచారని కాంగ్రెస్ పార్టీని పరోక్షంగా విమర్శించారు. ఇదే దేశవిభజనకు బీజం వేసిందన్నారు. ఆ విభజన మనస్తత్వం నేటికీ సవాల్ విసురుతోందని తెలిపారు. అక్షయ నవమిని పురస్కరించుకుని 1875 నవంబరు 7న బంకించంద్ర చటర్జీ ఈ గేయాన్ని రాశారు (ఆయన నవల 'ఆనందమఠ్'లో ఉన్న ఈ పాట తొలుత 'బంగదర్శన్' పత్రికలో దర్శనమిచ్చింది). ఈ గేయం 150 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం నుంచి వచ్చే ఏడాది నవంబరు 7 వరకు ఏడాదిపాటు ఉత్సవాలు నిర్వహించనుంది. వాటిని ప్రధాని శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. ఈ మహామంత్రానికి ఎందుకు అన్యాయం చేశారో తెలుసుకోవలసిన అవసరం నేటి తరానికి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. 'వందేమాతరం అన్ని కాలాలకూ ఉపయుక్తం. మన శత్రువులు ఉగ్రవాదం ద్వారా భారత భద్రతపై దాడికి సాహసించినప్పుడు.. నవభారతం పది ఆయుధాలు ధరించిన దుర్గగా రూపాంతరం చెందడాన్ని (ఆపరేషన్ సిందూర్) యావత్ ప్రపంచం చూసింది. వందేమాతరం మనకు సరికొత్త స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని ఇస్తుంది. ఇది పదమే కాదు.. మంత్రం.. శక్తి.. ఓ కల.. సంకల్పం' అని తెలిపారు. బ్రిటిష్‌వారు భారత్‌ను వెనుకబాటుదేశంగా, తక్కువ స్థాయి కలిగిన దేశంగా చిత్రించాలని చూశారని.. కానీ వందేమాతరంలోని మొదటి పంక్తే.. ఈ తప్పుడు ప్రచారాన్ని బదాబదలు చేసిందని చెప్పారు. దేశాన్ని కేవలం భౌగోళిక రాజకీయ సంస్థగా చూసేవారికి.. దేశాన్ని తల్లిగా భావించడం విస్మయం కలిగించవచ్చు. కానీ భారత్ భిన్న దేశం. ఇక్కడ తల్లి బిడ్డకు జన్మనిస్తుంది.. పోషిస్తుంది.. తన పిల్లలు ప్రమాదంలో ఉంటే.. దుర్మార్గాన్ని సంహరిస్తుంది. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరిన తొలి దేశంగా భారత్ ఖ్యాతినార్జించినప్పుడు.. నవభారతం అంతరిక్షంలోని మారుమూలలకూ వెళ్లినప్పుడు.. ప్రతి భారతీయుడూ గర్వంతో వందేమాతరం అని నినదించాడు. మన ఆడపిల్లలు అంతరిక్షం నుంచి క్రీడల వరకు అన్ని రంగాల్లో అగ్రస్థానానికి చేరినప్పుడు.. వారు గగనతలంలో యుద్ధవిమానాలను నడుపుతున్నప్పుడు.. మనందరం వందేమాతరం అని సగర్వంగా అంటున్నాం' అని చెప్పారు.

వందేమాతరాన్ని మోసింది కాంగ్రెస్సే

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఆ ఊసే ఎత్తలేదు: ఖర్గే

భారత జాతి ఆత్మను మేల్కొలిపిన వందేమాతరం గేయాన్ని సగర్వంగా భుజాన వేసుకుని మోసింది కాంగ్రెస్ పార్టీయేనని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మాత్రం దానిని ఆలపించకుండా దూరంగా ఉన్నాయని ఆరోపించారు. జాతీయవాదానికి స్వయంప్రకటిత సంరక్షకులుగా ఇవి తమను తాము ప్రకటించుకుంటాయని.. కానీ ఈ రెండూ ఎప్పుడూ ఆ గేయాన్ని ఆలపించలేదని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. 1896లో కలకత్తాలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహంతుల్లా సయానీ అధ్యక్షతన జరిగిన పార్టీ మహాసభల్లో.. ఠాగూర్ మొదటిసారి వందేమాతరం పాటను ఆలపించారని ఖర్గే తెలిపారు. 1937లో కాంగ్రెస్ పార్టీనే వందేమాతరాన్ని జాతీయ గేయంగా గుర్తించిందన్నారు. "వందేమాతరాన్ని, 'జనగణ మన'ను ఏనాడూ తమ శాఖల్లో గానీ, కార్యాలయాల్లో గానీ పాడని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ.. జాతీయవాదానికి సంరక్షకులుగా చెప్పుకొంటున్నాయి" అని ఎద్దేవాచేశారు.

మోదీ గొప్ప వ్యక్తి, స్నేహితుడు

- వచ్చే ఏడాది భారత్‌కు వెళ్లొచ్చు : ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 7: ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. "మోదీ గొప్ప వ్యక్తి, స్నేహితుడు. ఆయన నాయకత్వం బాగుంది." అని వ్యాఖ్యానించారు. అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో.. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బరువు తగ్గించే ఔషధాల ధరలు దిగివచ్చేలా ట్రంప్ కొత్త ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయి. రష్యా నుంచి భారీగా చమురును కొనుగోలు చేసే ప్రక్రియను ఆయన తగ్గించారు. నన్ను అక్కడకు(భారత్) రావాలని మోదీ కోరుతున్నారు. ఈ విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం. నేను భారత్‌కు వెళ్తా." అని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మరోవైపు, తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్నీ 150 సార్లు పేల్చేయగలమని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా, రష్యాలు అత్యంత రహస్యంగా భూగర్భ అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన అణు నిరాయుధీకరణకు పిలుపునిచ్చారు. మరుక్షణమే.. తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయగలమని హెచ్చరించారు. "అణు నిరాయుధీకరణపై రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లతో మాట్లాడా. ప్రపంచ వ్యాప్తంగా శాంతి విలసిల్లాలని కోరుకుంటున్నా" అని వ్యాఖ్యానించారు. అయితే.. ఆ మరు నిమిషంలోనే.. తాము తక్షణమే అణు పరీక్షలు చేపడతామంటూ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.

చైనా విమాన వాహక యుద్ధనౌక ఫుజియాన్ ప్రారంభం



బీజింగ్, నవంబరు 7: చైనా మూడో విమాన వాహక యుద్ధనౌక ఫుజియాన్‌ను రహస్యంగా ప్రారంభించింది. ఈ ప్రారంభ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరయ్యారు. బుధవారం దక్షిణ చైనాలోని హైనన్ ప్రావిన్స్‌లో ఉన్న సాన్యా పోర్టులో జిన్‌పింగ్ జెండా ఊపి అత్యంత అధునాతన యుద్ధనౌకను ప్రారంభించారని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. అయితే అధికారిక మీడియా మాత్రం ఫుజియాన్‌ను శుక్రవారం ప్రారంభించారని తెలిపింది. ఇంతకు ముందు చైనా 2012లో లియావోనింగ్, 2019లో షాన్‌డాంగ్ విమాన వాహక యుద్ధ నౌకలను ప్రారంభించింది. వీటికన్నా ఫుజియాన్ పెద్దది. దీని బరువు 80 వేల టన్నులు.చైనా మిలిటరీ కమాండర్ సోంగ్ జోంగ్‌పింగ్ మాట్లాడుతూ "ఫ్లాట్ డెక్‌తో ఉన్న చైనా తొలి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఇది. ఆధునిక పరిజ్ఞానంతో తయారైంది. ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ క్యాటపుల్ట్, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ అరెస్టింగ్ గేర్, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థ ఉన్నాయి" అని పేర్కొన్నారు. అధునాతన ఫుజియాన్‌లో విద్యుదయస్కాంత విమాన ప్రయోగ వ్యవస్థ (ఈఎంఏఎల్‌ఎస్)ను అమర్చారు. ఈ వ్యవస్థను అమెరికా విమాన వాహక యుద్ధనౌక యూఎస్‌ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో మాత్రమే వినియోగించారు. చైనా ప్రవేశపెట్టిన మూడు విమాన వాహక యుద్ధనౌకల్లో సంప్రదాయ ఇంధనాన్ని మాత్రమే వినియోగిస్తున్నారు. దక్షిణ చైనా సముద్రంలోనే కాకుండా భారత్‌కు సమీపంలోని హిందూ మహాసముద్రంలోనూ, అరేబియా సముద్రంలోనూ ఫుజియాన్‌ను మోహరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పీవోకేలో మళ్లీ 'ఉగ్ర' కదలికలు!

న్యూఢిల్లీ, నవంబరు 7: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఉగ్రవాద కార్యకలాపాలు విస్తరించడానికి పాక్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మునీర్ ఆనే హ్యాండ్లర్ సూచనల మేరకు ఈ ప్రాంతంలో మళ్లీ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడానికి సిద్ధమవుతోంది. ఉగ్ర శిబిరాలను తిరిగి ప్రారంభించడంతో పాటు చొరబాట్లను సులభతరం చేయడంపై గత నెలలో ముజఫరాబాద్, భింబిర్‌లలో సమావేశాలు జరిగాయని, పాక్ ఆర్మీతో పాటు ఐఎస్‌ఐకి చెందిన సీనియర్ అధికారులు, లష్కరే, జైషే, హిజ్బుల్ ముజాహిదీన్, తెహ్రీక్-ఉల్- ముజాహిదీన్ కమాండర్లు పాల్గొన్నారని నిఘా వర్గాల నివేదికలు తెలిపాయి. ఉగ్ర కార్యకలాపాల్లోకి మహిళల నియామకాలకు సంబంధించి ఉర్దూలో ముద్రించిన ఆహ్వాన పత్రం నిఘా వర్గాలకు లభించింది.

'చికెన్స్ నెక్' భద్రత బలోపేతం

- బంగ్లా సరిహద్దుల్లో మూడు సైనిక స్థావరాలు

న్యూఢిల్లీ, నవంబరు 7: బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య కొద్దిరోజులుగా సైనిక సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. దేశ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానించే సిలిగురి కారిడార్ (చికెన్స్ నెక్) వెంబడి భద్రతను బలోపేతం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా బాముని, కిషన్‌గంజ్, చోప్రా ప్రాంతాల్లో కొత్తగా మూడు సైనిక స్థావరాలను ఏర్పాటు చేసింది. ఇవి ఈ ప్రాంతంలో భద్రతకు భరోసా కల్పించడంతో పాటు ఈశాన్య సరిహద్దుల్లో నిఘాను మరింత బలోపేతం చేయనున్నాయి. ఈ ప్రాంతాలన్నీ బంగ్లాదేశ్‌కు అత్యంత సమీపంగా ఉన్నవేనని భద్రతా వర్గాలు తెలిపాయి.

మధుమేహం, ఊబకాయం ఉంటే.. అమెరికా వీసా కష్టమే!

- ఎంబసీలు, కాన్సులేట్లకు కొత్త మార్గదర్శకాలు
- గుండె జబ్బులు, శ్వాస సమస్యలు ఉన్నవారికీ ఇబ్బందే
- 'కేఎఫ్ఎఫ్ హెల్త్ న్యూస్' వెల్లడి



వాషింగ్టన్, నవంబరు 7: మధుమేహం (షుగర్), ఊబకాయం (ఒబేసిటీ) వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఇకపై అమెరికా వీసా పొందడం కష్టం కానుంది. గుండె జబ్బులు, తీవ్ర శ్వాస సమస్యలు ఉన్నవారికీ వీసా నిరాకరించే అవకాశం పెరగనుంది. ఈ మేరకు విదేశీయులెవరైనా అమెరికా వీసా పొందడం కోసం ఇప్పటికే ఉన్న ఆరోగ్య పరిశీలన నిబంధనల్లో ఆ దేశ విదేశాంగ శాఖ మార్పులు చేసింది. ఇకపై మధుమేహం, ఊబకాయం అంశాలనూ పరిశీలన జాబితాలో చేర్చింది. దీనికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఎంబసీలు, కాన్సులేట్లకు నూతన మార్గదర్శకాలు వెళ్లాయని ఆ దేశానికి చెందిన 'కేఎఫ్ఎఫ్ హెల్త్ న్యూస్' వెబ్‌సైట్ వెల్లడించింది. ఇప్పటికే ప్రపంచ ఒబేసిటీ రాజధానిగా మారిన అమెరికాలోకి ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నవారు రాకుండా నియంత్రించడం, అక్కడి ప్రభుత్వానికి భారంగా కాకుండా ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ మార్గదర్శకాల ప్రకారం.. వృద్ధాప్యంలో ఉన్నవారికి, ఒకవేళ అమెరికాలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందాల్సి వచ్చే పరిస్థితిలో ఉన్నవారికి కూడా వీసా రావడం కష్టమేనని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. ఎంబసీలు, కాన్సులేట్ల అధికారులకు జారీ చేసిన కొత్త మార్గదర్శకాల్లో.. "వీసా దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. గుండె జబ్బులు, తీవ్ర శ్వాస సమస్యలు, క్యాన్సర్, మధుమేహం, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య పరిస్థితిని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. వాటి చికిత్సకు వందలు, వేల డాలర్ల వ్యయం అవుతుంది. వారు అమెరికాలోకి వచ్చాక ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తే తీవ్ర భారం పడుతుంది. అలాంటి వారికి వీసా నిరాకరించాలి. ఒకవేళ దరఖాస్తుదారులకు తమ వ్యాధుల చికిత్స ఆరోగ్య సంరక్షణ వ్యయాన్ని పూర్తిగా భరించగల ఆర్థిక స్తోమత ఉంటే పరిగణనలోకి తీసుకోవచ్చు. ఇక వీసా దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల (డిపెండెంట్లు)లో ఎవరికైనా తీవ్ర వ్యాధులు, వైకల్యాలు ఉన్నాయా అన్నదీ పరిశీలించాలి" అని విదేశాంగ శాఖ ఆదేశించింది. అమెరికాలోకి వలసలను నిరుత్సాహపర్చడం కోసమే మార్గదర్శకాలను ఇలా విస్తృతం చేశారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


రింగ్ ఏసిరి టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

అనంతలో రెవెన్యూ క్రీడలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడ, సాంస్కృతిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్లు, ఉద్యోగులు హాజరయ్యారు. మొత్తం 27 జట్లు పోటీలలో పాల్గొంటున్నాయి.

17న ఢిల్లీలో ఆత్మగౌరవ ప్రదర్శన: మందకృష్ణ

కావలి(టౌన్) నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి ఘటనలో న్యాయ, మానవ హక్కుల కమిషన్, పోలీసు వ్యవస్థలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన నెల్లూరు జిల్లా కావలిలో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా మూడు వ్యవస్థలు నిర్లక్షంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ 17న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ఆత్మగౌరవ ప్రదర్శన కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు.

విధులు నిర్లక్ష్యం చేస్తే వేటే!

పదోన్నతులిచ్చినంత వేగంగానే తప్పు చేసిన వారిపై చర్యలు

మిగతా శాఖల కంటే భిన్నంగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టి తమ శాఖలో 10 వేల మంది ఉద్యోగులకు ఒకేసారి ప్రమోషన్ కల్పించిన పంచాయతీరాజ్‌శాఖ అందరి ఆదరాభిమానాలను పొందింది. అదే సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగుల విషయంలో అంతే కఠిన చర్యలు తీసుకుంటోంది. తాజాగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 26 మంది పంచాయతీ కార్యదర్శులపై ఒకేసారి సస్పెన్షన్ వేటు వేసింది.

- స్వర్ణ పంచాయతీలో నిర్లక్ష్యం చేసిన 26 మంది కార్యదర్శుల సస్పెన్షన్
- సిబ్బందిపై ఉన్నతాధికారుల డేగకన్ను

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో ప్రక్షాళన కొనసాగుతోంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, వారి పనితీరుపైనా నిరంతరం పర్యవేక్షణ సాగుతోంది. గత 48 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా సంస్కరణలు చేపట్టారు. పనిలో నిబద్ధతకు పెద్ద పీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. పలు దఫాలు సమావేశాలు నిర్వహించి పదోన్నతులు కల్పించారు. దీనికిగాను డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు రేయింబవళ్లు పని చేశారు. పదోన్నతులకు ఉన్న అడ్డంకులను అధిగమించి పదోన్నతుల ప్రక్రియను ముగించారు. ఫలితంగా సుమారు 10 వేల మందికి పదోన్నతులు కల్పించారు. ఇప్పటికే చాలా మందికి పదోన్నతులు దక్కాయి. మరి కొంత మందికి మరో నెలలోపు ప్రమోషన్లు దక్కనున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడాన్ని ఉపేక్షించడం లేదు. ఎంతవారైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ల వేటు వేస్తున్నారు.

ప్రత్యేక సెల్‌తో పనితీరు అంచనా

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌లో సుమారు పది మందికి పైగా ఎంపీడీవో స్థాయి అధికారులు పలు పథకాలపై ప్రత్యేకంగా పనిచేస్తున్నారు. కమిషనర్ ఈ విభాగానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ప్రతి పథకం అమలు తీరుపై నిశితంగా గమనిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ తప్పు జరిగినా వెంటనే ఈ విభాగానికి తెలిసేలా ప్రత్యేక సెల్ పనిచేస్తోంది. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు ఎక్కడ అవినీతికి పాల్పడినా, అప్పగించిన బాధ్యతలు సకాలంలో చేపట్టకపోయినా కమిషనర్‌కు సమాచారం వచ్చే వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో గతంలో మాదిరిగా కాకుండా మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈ శాఖలో పారదర్శకత పెంచేందుకు, గ్రామీణులకు సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

డేటా సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ పంచాయతీల పోర్టల్ తీసుకురావడం ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని భావించింది. ఈ పోర్టల్ అభివృద్ధి చేయడం ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయం రూ.450 కోట్ల నుంచి రూ.900 కోట్లకు పెరిగింది. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపరిచే అవకాశం ఉంది. అయితే, ఈ పోర్టల్‌కు అవసరమైన డేటా సేకరణలో పంచాయతీ కార్యదర్శులు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సుమారు 3 వేల పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు ఒక ఫోన్ నెంబర్‌ను వందల కొద్దీ అసెస్‌మెంట్‌లకు లింక్ చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఈ పోర్టల్ తీసుకొచ్చిందో ఆ లక్ష్యం మరుగునపడింది. పైగా కీలక సమాచారం ఆయా కుటుంబాలకు చేరే పరిస్థితి లేకుండా పోయింది. పోర్టల్ ప్రారంభించి పౌరులకు స్థిరాస్తుల పన్నుల సమాచారాన్ని సందేశం రూపంలో తెలియజేయాల్సి ఉంది. అయితే, ఆయా పంచాయతీలలోని కొందరు కార్యదర్శులు వారికి అప్పగించిన బాధ్యతలను విస్మరించారు. దీంతో నిర్లక్ష్యంగా వహించిన కార్యదర్శులపై వేటు వేయకపోతే శాఖను గాడిలో పెట్టలేమని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే 26 జిల్లాల్లో అత్యంత నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న కార్యదర్శులను ఎంపిక చేసి 26 మందిపై వేటు వేశారు. మరి కొందరిపై కూడా సస్పెన్షన్ వేటు వేయాలని అధికారులు భావిస్తున్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోల సీనియారిటీ జాబితా విడుదల

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల ప్రక్రియలో భాగంగా 13మంది జడ్పీ డిప్యూటీ సీఈవోల సీనియారిటీ తుదిజాబితాను విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. డిప్యూటీ సీఈవోలు కె.రత్నకుమారి, కె.లలితాబాయి, ఎం.నాగ పద్మజ, ఎం.నాగేశ్వరరావు, ఎం.సుధాకర్‌రెడ్డి, జి.జోసెఫ్ కుమార్, డి.వి. భాగ్యలక్ష్మి, జె.వేణుగోపాల్, జి.వి.రమణారెడ్డి, యాకూబ్ బాషా ఖాజీ, ఎం.శాంతి, బి.వి. సత్యనారాయణ, ఎస్. మధుసూదన్‌తో కూడిన సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. అయితే ఎం.నాగపద్మజ, డి.వి. భాగ్యలక్ష్మి, ఎ.శాంతి ఇప్పటికే రిటైర్ అయ్యారు.

10 రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలు

- వారంలో టోకెన్ల జారీ విధివిధానాలు ఖరారు
- 17 నుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు
- 27 నుంచి అమరావతి శ్రీవారి ఆలయ విస్తరణ పనులు
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్


టీటీడీ ఈవో అనిల్ కుమార్

తిరుమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజులపాటు ఉంటాయని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో వైకుంఠ ద్వార దర్శనాల టోకెన్ల జారీ సమయంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నందున లోటుపాట్లు లేకుండా జారీ చేయడానికి విధివిధానాలను రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని వేశామని తెలిపారు. వారం రోజుల్లో ఈ కమిటీ బోర్డుకు నివేదిక సమర్పిస్తుందని.. దానికనుగుణంగా బోర్డు నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. కాగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఆక్టోపస్ గెస్ట్ హౌస్ నుంచి గోగర్భం డ్యాం వరకు శాశ్వత క్యూలైన్ నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించామని వెల్లడించారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో 17 మంది భక్తులు ఫిర్యాదులు, సందేహాలు, సమస్యలపై ఈవోతో మాట్లాడారు.

శ్రీవాణి నిధులతో నిర్మించేది ఆలయాలే

శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.750 కోట్ల నిధులతో ఐదు వేల ఆలయాలు మాత్రమే నిర్మిస్తామని ఈవో స్పష్టం చేశారు. ఇవి భజన మందిరాలనే అనుమానానికి తావులేదన్నారు. శ్రీవాణికి వచ్చిన రూ.2,300 కోట్లలో ఇప్పటికే రూ.600 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.1,700 కోట్లు నిధులు ఉన్నాయని వివరించారు. కరెంట్ బుకింగ్ ద్వారా జారీ చేస్తున్న శ్రీవాణి టికెట్ల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని, పరిశీలన చేసి త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు. అమరావతి వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయంలో ప్రాకారం, కల్యాణోత్సవ మండపం అభివృద్ధి పనులు ఈ నెల 27వ తేదీ నుంచి మొదలవుతాయని అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు.


చంద్రకుమార్ రెడ్డి

స్వదేశానికి రప్పించండి!

- ఆరోగ్యం క్షీణించింది.. ఆత్మహత్య ఆలోచన వస్తోంది
- కంపెనీ యాజమాన్యం కనికరించడం లేదు
- ఆఫ్రికాలో ఇరుక్కుపోయిన శ్రీసత్యసాయి జిల్లావాసి విజ్ఞప్తి

ఓబుళదేవరచెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఆఫ్రికాకు వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన చంద్రకుమార్ రెడ్డి అనే యువకుడు చిక్కుల్లో పడ్డాడు. జీఎంఆర్ ఇండస్ట్రీ కంపెనీలో ఉద్యోగం లభించడంతో ఆఫ్రికాలోని ఘనా దేశానికి ఏడాది క్రితం వచ్చానని, కంపెనీ యాజమాన్యం తనను వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఓబుళదేవరచెరువు మండలం వనుకువారిపల్లి చంద్రకుమార్ రెడ్డి స్వగ్రామం. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో బతుకుతెరువు కోసం ఆఫ్రికాకు వెళ్లాడు. తాను పనిచేసే కంపెనీకి గణేష్ ముత్యాల రెడ్డి, కౌశిక్ రెడ్డి యజమానులు అని, తనను కాపాడి స్వదేశానికి తీసుకువెళ్లాలని చంద్రకుమార్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. 'మార్కెట్‌లో వస్తుండగా దొంగలు దాడి చేశారు. కంపెనీ డబ్బును దోచుకున్నారు. దీనికి కంపెనీ యాజమాన్యం నన్నే బాధ్యుణ్ని చేసింది. రూ.5 లక్షలు నా నుంచి రికవరీ చేసింది. నా ఆరోగ్యం క్షీణించింది. స్వదేశానికి పంపమని వేడుకుంటున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. నా పరిస్థితి బాగలేదు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వస్తోంది. నా ఆరోగ్యం బాగా దెబ్బతినింది. ఇప్పటికే 15 కిలోల వరకు బరువు తగ్గాను. కాళ్లా వేళ్లా పడినా కంపెనీ వారు కనికరం చూపడంలేదు. స్వదేశానికి పంపకపోతే ఆత్మహత్యే నాకు శరణ్యం. నేను ఆత్మహత్య చేసుకుంటే కంపెనీ వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని బాధితుడు వీడియోలో పేర్కొన్నాడు.


క్యాన్సర్ పరీక్షకు ఆహ్వానం నమూనా కార్డులను ఆవిష్కరిస్తున్న కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

- సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ పిలుపు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల వద్దకే వచ్చి ఉచితంగా నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ పిలుపునిచ్చారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ పరీక్షకు ఆహ్వానం పేరుతో రూపొందించిన కార్డులను కలెక్టర్ లక్ష్మీశతో కలిసి విజయవాడలో ఆయన ఆవిష్కరించడంతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం పరీక్షల్ని ఉచితంగా చేస్తారన్నారు. 30 ఏళ్లు దాటిన మహిళల ఇళ్లకు ఏఎన్ఎం, సీహెచ్‌వోలు వెళ్లి..స్క్రీనింగ్ చేసుకోవాలని ఆహ్వానిస్తూ ఇన్విటేషన్ కార్డును అందజేస్తారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలోనే స్క్రీనింగ్ పరీక్షలకు ఎప్పుడు రావాలో కార్డుపై రాసి ఇస్తారన్నారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కల్పించి, సమీప వైద్యాధికారికి సమాచారం అందిస్తారని తెలిపారు.

నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరికి జైలుశిక్ష

విశాఖపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఏజెంట్లకు భారత నౌకాదళం సమాచారాన్ని రహస్యంగా అందిస్తూ దొరికిపోయిన ఇద్దరు (గూఢచర్యం కేసు) నిందితులకు విశాఖలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 70 నెలల చొప్పున జైలుశిక్ష, ఐదువేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఈ కేసులో ఆరుగురిని దోషులుగా నిర్ధారించి శిక్ష విధించగా, తాజాగా శిక్షపడినవారిలో విశాఖ జిల్లాకు చెందిన కలవలపల్లి కొండబాబు, హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన అవియాన్ష్ సోమల్ ఉన్నారు.

ఏపీఐఐసీ బోర్డు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) బోర్డుకు ప్రభుత్వం డైరెక్టర్లను నియమించింది. ఇంతకుముందే బోర్డుకు చైర్మన్‌గా మంతెన రామరాజును నియమించిన ప్రభుత్వం, తాజాగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 15మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వారి బాగోగులపైనే మా ఆలోచన!

- శేషగిరమ్మ, మనవరాలి పరిస్థితిపై నివేదికివ్వండి
- న్యాయవాది రూపేశ్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ.. 90ఏళ్లు దాటిన వృద్ధురాలు. మనవరాలు శ్యామల మానసిక వికలాంగురాలు! వృద్ధురాలి కూతురు ఇటీవల మరణించింది. ల్యాండ్ పూలింగ్‌లో తమకున్న 5సెంట్ల స్థలాన్ని నిరక్షరాస్యత వల్ల పొరపాటున సీఆర్‌డీఏకు అప్పగించారు. నివాసం ఉండేందుకు తమకు ఆ స్థలం తప్ప మరొకటి లేదని, దాన్ని తిరిగి ఇప్పించాలని, లేకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ అవ్వ, మనవరాలి విషయంలో న్యాయస్థానం శుక్రవారం కీలక ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయిలో పర్యటించి వారి పరిస్థితిని తెలుసుకొని, నివేదిక ఇవ్వాలని న్యాయవాది రూపేశ్‌ను ఆదేశించింది. స్వయంగా కారు ఏర్పాటు చేసి న్యాయవాదిని వారి నివాసానికి పంపించింది. వారిద్దరికీ పునరావాసం కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరాలు సమర్పించాలని సీఆర్‌డీఏ అధికారులకు స్పష్టం చేసింది. ప్రస్తుతం వారు ఉన్న నివాసానికి దగ్గర్లోనే పునరావాసం కల్పించాలని పేర్కొంది. వైద్యుడిని పంపించి శ్యామల మానసిక పరిస్థితిని అంచనా వేయాలని అధికారులను ఆదేశించింది. కూతురు వెంకాయమ్మ మరణించిన నేపథ్యంలో 90ఏళ్ల వయసు దాటిన శేషగిరమ్మ, మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఆమె మనవరాలు శ్యామల బాగోగుల గురించి తాము ఆలోచిస్తున్నట్లు తెలిపింది. పునరావాసం విషయంలో అధికారుల చర్యలు సంతృప్తికరంగా ఉండాలని తేల్చిచెప్పింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా, పిటిషనర్లకు పునరావాసం కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని, విచారణను సోమవారానికి వాయిదా వేయాలని సీఆర్‌డీఏ తరపు న్యాయవాది కోరారు.

4 | శనివారం ● 8 నవంబరు 2025

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

‘అణు’ ఉన్మాదం

అనేక యుద్ధాలు ఆపాను, యుద్ధం అంచులకుపోతున్న దేశాలను హెచ్చరించి మరీ నిలువరించాను, అయినా నాకు నోబెల్‌శాంతి ఇవ్వలేదు, కనీసం నా శాంతియత్నాలను కూడా ప్రపంచం గుర్తించడం లేదు, ఐక్యరాజ్యసమితి సైతం మెచ్చుకోలేదు... అని అదేపనిగా వాపోయిన అమెరికా అధ్యక్షుడు అందుకు ప్రతిగా ప్రపంచంమీద ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నారేమో! శాంతిదూత ట్రంప్ నోట వారంలోనే పలుమార్లు అణ్వస్త్రాలు, అణుయుద్ధాల ప్రస్తావనలు వినిపించాయి. యావత్ ప్రపంచాన్ని నూటయాభైసార్లు నాశనం చేయగల అణ్వస్త్రాలు తన వద్ద ఉన్నాయని ఆయన సగర్వంగా చెప్పుకున్నారు. ఒకపక్క శాంతిగురించి మాట్లాడుతూనే, అణునిరాయుధీకరణ మహాగొప్పదని అంటూనే, మరోపక్క మానవజాతిని సమూలంగా మట్టుబెట్టడానికి అమెరికాకు అట్టే సమయం పట్టదని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. దేశాలను దారికి తేవాలంటే సుంకాలతో మోదితే చాలని మొన్నటి వరకూ ఉపన్యాసాలు దంచిన ట్రంప్ ఇప్పుడు ట్రేడ్‌వార్ కాక న్యూక్లియర్‌వార్ కోసం అర్రులు చాస్తున్నట్టు కనిపిస్తోంది.

పదిరోజుల క్రితం, దక్షిణకొరియాలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ఒకరోజు ముందు ట్రంప్‌నోట ఈ అణుపాటపరీక్షల మాట వినబడింది. అందరూ చేస్తున్నదే అంటూ ఆయన చైనా, రష్యా, ఉత్తరకొరియాలను ఉదహరించడంతో పాటు పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావించారు. ఈ దేశాలన్నీ రహస్యంగా ఆ పనిచేస్తున్నాయని, తాను చెప్పి మరీ చేస్తానని అన్నారాయన. ట్రంప్ నోట పాకిస్థాన్ పేరు వినబడగానే దొంగపనులు ఆ దేశానికి అలవాటేనంటూ భారత ప్రభుత్వం విరుచుకుపడింది. అలనాటి పోఖ్రాన్ పరీక్షల శక్తియుక్తులను ప్రజలకు గుర్తుచేస్తూ అణుపరీక్షలకు మనదేశం మళ్ళీ సిద్ధపడుతోందని మీడియా కథనాలను వండివార్చుతోంది. పాక్, చైనాలు అణుబలం పెంచుకుంటూంటే మనం ఎలా ఊరుకుంటామంటూ సామాజిక మాధ్యమాల్లో దేశభక్తులు వీరంగాలు వేస్తున్నారు. ఈమారు ఎన్ని టన్నుల మందుగుండు వాడాలో, ఎంత శక్తిని విడుదలచేయాలో లెక్కలు కడుతున్నారు. అణుపరీక్షలకు సిద్ధంకమ్మని తాను ఇప్పటికే ఆదేశించాననీ, ఏర్పాట్లు మొదలయ్యాయని అమెరికా అధ్యక్షుడి నోటివెంటే రావడంతో రష్యాకు కూడా ఇక మొహమాట పడాల్సిన అవసరం లేకపోయింది. అమెరికా అణుపరీక్షలు జరిపినవెంటనే విస్ఫులింగాలు కురిపించడానికి అదీ సర్వంసిద్ధం చేసుకుంటోంది.

మూడుదశాబ్దాల విరామం తరువాత అమెరికా అణుపరీక్షలకు సిద్ధపడుతూండటం ప్రపంచాన్ని పెనుప్రమాదంలోకి నెట్టేస్తోంది. రష్యా, చైనా బూచి చూపుతూ అణుపాటవాన్ని మరింత పెంచుకుంటానని ట్రంప్ ప్రకటించడంతోపాటు, అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి మినిట్‌మ్యాన్ ప్రయోగం సైతం రష్యా, చైనాలను హెచ్చరించడానికీ, ఉత్తరకొరియాను గిల్లడానికీ ఉపకరిస్తాయి. ఈ క్షిపణికి న్యూక్లియర్ వార్‌హెడ్ తగిలించకపోవచ్చును కానీ, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్నస్థితిలో ఈ అధునాతన క్షిపణిని పరీక్షించడం ప్రత్యర్థి దేశాలను హెచ్చరించడానికే. ప్రచ్ఛన్నయుద్ధకాలం నాటి వాతావరణాన్ని సృష్టించడం, అణుపోటీని రగల్చడం ట్రంప్ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఎదుటివారివద్ద అణ్వాయుధాలున్నాయన్న ఆరోపణతో శత్రువులను హతమార్చడం, దేశాలను స్వాధీనం చేసుకోవడం అమెరికాకు అలవాటు. అణుపరీక్షలు నిర్వహిస్తున్నాయంటూ ఇప్పుడు ట్రంప్ ఆరోపించిన దేశాలేవీ నిజానికి ఆ పనిచేసిన ఆధారాలేమీ లేవు. ఉత్తరకొరియా విషయంలో పాశ్చాత్యదేశాలన్నీ కట్టగట్టుకొని చేస్తున్న ప్రచారం నమ్మినపక్షంలో దానిని కొంతమేరకు మినహాయించవచ్చును. ఈ అధునాతన సాంకేతిక యుగంలో అణుపరీక్షలను రహస్యంగా జరపడం, దాచడం కష్టం. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపని మొండిఘటం పుతిన్‌ను లొంగదీయడానికో, వాణిజ్యయుద్ధంలో లొంగిరాని జిన్‌పింగ్‌ను దారికితెచ్చుకోవడానికో తన అణు హెచ్చరికలు ఉపకరిస్తాయని ట్రంప్ అనుకొనివుంటే అది పెద్ద భ్రమ. అమెరికాలోని యాభైరాష్ట్రాల్లో ముప్పై రాష్ట్రాలు ట్రంప్‌కు హారతులుపట్టి ఏడాది అయింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) పేరిట ఆయన దేశంలోనూ, విదేశాలతోనూ చేస్తున్న పలురకాల యుద్ధాలు ప్రజలకు అంతగా రుచించ లేదని మొన్నటి ఎన్నికల ఫలితాలు తేల్చేశాయి. న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం, న్యూజెర్సీ, వర్జీనియా డెమోక్రాట్ల చేతుల్లోకి పోవడం ట్రంప్‌కు ఎదురుదెబ్బ. ట్రేడ్‌వార్‌తో కాక, తన ఆప్త మిత్రుడు బెంజమీన్ నెతన్యాహూ తరహాలో రియల్‌వార్‌తోనే తాను అధికారంలో కొనసాగగలనని ట్రంప్ అనుకుంటున్నట్టు ఉంది.

మారుతున్న ప్రపంచ దృశ్యంలో మోదీ



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

వర్తమాన ప్రపంచంలో మహా శక్తిమంతమైన నాయకులు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్. ఈ ఇరువురి నిర్ణయాలు అంతర్జాతీయ వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. ఈ కోవకు చెందిన మరో ఇద్దరు నాయకులు: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు. ఈ నాయకుల మాటలు, చర్యలు వారి వారి దేశాల సరిహద్దులకు ఆవల ఎల్లెడలా మంచిగానో చెడుగానో పర్యవసిస్తాయి. ఇటువంటి శక్తిమంతమైన నాయకుల సరసన తానూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. ప్రపంచ గమనాన్ని నిర్దేశిస్తున్న అపూర్వ రాజనీతిజ్ఞుడు నరేంద్ర మోదీ అని ఆయన పార్టీ ఇప్పటికే ఘంటాపథంగా చెప్పుతోంది. అయితే యథార్థం భిన్నంగా ఉన్నది.

భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో, అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థలతో పోల్చిచే, చిన్నది. తలసరి ఆదాయం విషయంలో రష్యా, ఇజ్రాయెల్‌లతో పోల్చితే భారతీయుల తలసరి ఆదాయం చాలా చాలా తక్కువ. గణాంకాలను చూడండి (తొలి అంకె స్థూల దేశీయోత్పత్తి పరిమాణం; రెండో అంకె తలసరి ఆదాయం. అన్ని అంకెలు అమెరికా డాలర్లలో): అమెరికా: 30.51 ట్రిలియన్; 89,000; చైనా: 19.23 ట్రిలియన్, 13,800; రష్యా: 2.54 ట్రిలియన్, 17,500; ఇజ్రాయెల్: 0.6 ట్రిలియన్, 54,000; ఇండియా: 4.19 ట్రిలియన్, 2,900.

భారత్ ఆర్థిక వ్యవస్థ కంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ 7 రెట్లు, చైనా ఆర్థిక వ్యవస్థ 4.5 రెట్లు పెద్దవి. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థే కావచ్చు కానీ మన ప్రస్తుత స్థూల దేశీయోత్పత్తి రెట్టింపు కావడానికి పది సంవత్సరాల సమయం పడుతుంది. అప్పటికి అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థల పరిమాణం మరింతగా పెరుగుతుంది. చెప్పవచ్చిన దేమిటంటే స్థూల దేశీయోత్పత్తిలో భారత్, అమెరికాల మధ్య అంతరం, అలాగే భారత్ చైనాల మధ్య అంతరం మరింతగా పెరుగుతుందేగానీ తగ్గే అవకాశం ఎంతమాత్రం లేదు. రష్యా, ఇజ్రాయెల్‌ల స్థూల దేశీయోత్పత్తి పరిమాణాలు చిన్నవేకానీ భారత్ తలసరి ఆదాయంతో పోలిస్తే రష్యా తలసరి ఆదాయం 6 రెట్లు, ఇజ్రాయెల్ తలసరి ఆదాయం 18 రెట్లు అధికంగా ఉన్నది. ఈ గణాంకాలు అన్నీ భారత్ ప్రస్తుత పాలకులకు మినహా ప్రపంచ నాయకులు అందరికీ తెలుసు సుమా!

ప్రపంచ దేశాలు భారత్‌ను గౌరవిస్తున్నాయి, సందేహం లేదు. మనకు లభిస్తున్న గౌరవాదరాలకు కారణాలు ఏమిటి? మన ప్రజాస్వామ్యం, సముజ్వల చరిత్ర, పురాతన సంస్కృతి, ప్రపంచ శాంతి పరిరక్షణలో నిర్వహిస్తున్న పాత్ర, భారతీయ మార్కెట్ పరిమాణం, శక్తి సామర్థ్యాలు, అన్నిటికీ మించి అత్యధిక జనాభా ఉన్న సమాజం. అంతేగానీ ఒక అగ్రరాజ్యమనే భావనతో భారత్‌కు ఈ గౌరవాదరాలు లభించడం లేదు. ఇదొక నిష్ఠుర సత్యం. ఏ దేశమైనా ఇతర దేశాలతో సంబంధాల విషయంలో వాణిజ్యానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. ప్రాంతీయంగా సుస్థిర శాంతిని కోరుకుంటుంది. ‘మీరు మాకు మిత్ర దేశమైతే, పాకిస్థాన్ పట్ల తప్పకుండా విరోధ భావం చూపాలి’ అన్న వైఖరితో భారత్ వ్యవహరిస్తున్నప్పటికీ తమ తమ వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే అన్ని దేశాలు భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలు నెరపుతాయి. ఇది మనం విస్మరించకూడని వాస్తవం.

వర్తమాన ప్రపంచంలో పెను మార్పులు అనూహ్య వేగంతో సంభవిస్తున్నాయి. 2023లో జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సును భారత్ నిర్వహించింది. ఈ శిఖరాగ్ర సదస్సు ఒక వార్షిక కార్యక్రమం. ప్రతి సభ్య దేశమూ వరుసగా ఈ శిఖరాగ్రాన్ని నిర్వహిస్తుంది. మరుసటి సంవత్సరం ఈ సదస్సుకు ఏ సభ్య దేశం ఆతిథేయిగా ఉండాలో ముందటి సంవత్సరం శిఖరాగ్ర సమావేశంలోనే నిర్ణయిస్తారు. 2024లో జీ–20 శిఖరాగ్ర సదస్సును బ్రెజిల్ నిర్వహించింది. నవంబర్ 2025లో దక్షిణాఫ్రికాలో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరగనున్నది. 2026 జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సు అమెరికాలో జరగనున్నది. ఇంతకూ జీ–20 శిఖరాగ్ర సదస్సును నిర్వహించడమనేది పెద్ద విషయం కాదు. అయితే మన దేశం మాదిరిగా ఏ సభ్య దేశమూ ఆ సదస్సు నిర్వహణ గురించి ఘనంగా ప్రచారం చేసుకోలేదు.

జీ–20 కంటే జీ–8, జీ–7 కూటములు చాలా ముఖ్యమైనవి. ఇప్పుడు కొత్తగా జీ–2 ప్రభవించింది. జిన్‌పింగ్‌తో సమావేశానికి ముందు, తరువాత కూడా చైనా అధినేతకు తనతో సమస్థాయి హోదా సమకూరుస్తూ సమాదరంతో మాట్లాడారు. ట్రంప్ మాటలు డాంబికంగా ఉన్నాయి. జిన్‌పింగ్ మనసులో ఏమున్నదో ఎవరికీ తెలియదు. అంతుచిక్కని స్పందనలు ఆయనవి. బహుళధ్రువ ప్రపంచం గురించి భారత్ ఏమి చెప్పినప్పటికీ ప్రపంచంలో రెండే రెండు అగ్రరాజ్యాలు ఉన్నాయి. రష్యా వాటికి కొంచెం వెనుకగా ఉన్నది. నిన్నటిదాకా ‘అమెరికా భద్రతకు పొంచి ఉన్న ముప్పు’ ఒక్కసారిగా అంతర్థానమయిపోయింది. అమెరికా, చైనాల మధ్య కొత్త ‘స్నేహపూరిత’ సంబంధాలతో క్వాడ్ ప్రాధాన్యం కోల్పోనున్నది.

వాస్తవాలను మరింత నిశితంగా చూద్దాం: అరుదైన భూ ఖనిజాలు, సోయాబీన్ ఎగుమతులు, దిగుమతుల విషయంలో అమెరికా, చైనాల మధ్య ఒక మినీ వాణిజ్య ఒప్పందం కుదిరింది. టిక్–టాక్ వివాదాన్ని కూడా ఆ రెండు దేశాలు పరిష్కరించుకునే అవకాశమున్నది; అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం ఇంకా సంప్రతింపుల దశలోనే ఉన్నది. నెలల తరబడి జరుగుతున్న చర్చలు ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు; అమెరికా, చైనాల మధ్య సుంకాల సమరం జరిగింది (పరస్పరం ప్రతీకార సుంకాలు కూడా విధించుకున్నాయి). అయితే బుసాన్‌లో ట్రంప్, జిన్‌పింగ్‌ల సమావేశమనంతరం సాంకేతికతల బదిలీ, ఎగుమతులపై నియంత్రణలు, ఓడరేవుల చార్జీలతో వివిధ అంశాలపై రెండు దేశాలూ ఒక అంగీకారానికి వచ్చినట్టు కనిపిస్తోంది. పరస్పరం సుంకాలు తగ్గించేందుకు చైనా, అమెరికాలు అంగీకరించాయి. భారత్‌పై విధించిన శిక్షాత్మక సుంకాలను సడలించేందుకు అమెరికా ఇంకా సుముఖంగా లేదు; చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు యథావిధిగా ఉంటాయి. భారతీయ కంపెనీలు రష్యా చమురును కొనుగోలుచేస్తే వాటిపై కూడా ఆంక్షలు కొనసాగుతాయి; అమెరికా ప్రస్తుతం చైనా సరుకులకు ఇస్తున్న ప్రథమ గణ్య ప్రాధాన్యతను తగ్గిస్తుంది; అలాగే భారత్‌కు 2019లో రద్దు చేసిన జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను పెంచుకోవడానికి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై సుంకాలు తగ్గించడం లేదా తొలగించే విధానం)ను పునరుద్ధరించే అవకాశాలు లేవు అనేది స్పష్టం.

ట్రంప్‌తో మోదీ చివరిసారి ఫిబ్రవరి 14, 2025న సమావేశమయ్యారు. దరిమిలా మూడు సందర్భాలలో ట్రంప్–మోదీ సమావేశం జరగవలసి ఉన్నది. తొలుత కెనడాలో జీ–7 శిఖరాగ్ర సదస్సు తరువాత. స్వదేశానికి తిరిగి వెళ్లుతూ ‘వాషింగ్టన్‌కు రావాలని మోదీని ట్రంప్ ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని మోదీ తిరస్కరించారు. ఇది సరైన నిర్ణయమే. పిదప ఈజిప్ట్‌లో గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమం. ఈ సమావేశానికి మోదీ వెళ్లలేదు. ఆ తరువాత గత నెల కౌలాలంపూర్‌లో ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు. ఈ సదస్సునుద్దేశించి మోదీ వర్చ్యువల్‌గా ప్రసంగించారు. ఆసియాన్ సదస్సుకు మోదీ స్వయంగా వెళ్లకపోవడం సరికాదని నేను భావిస్తున్నాను. ట్రంప్‌తో ద్వైపాక్షికంగా సమావేశమయ్యేందుకు, అసలు ఆయనతో సంభాషించేందుకు కూడా మోదీ ఆసక్తిచూపడంలేదని, ఉద్దేశపూర్వకంగానే తప్పించుకుంటున్నారని దౌత్యవర్గాలు భావిస్తున్నాయి.

ఆపరేషన్ సిందూర్ వ్యవహారంపై ట్రంప్ తన పాత మాటను మరొకసారి పునరుద్ఘాటించాడు. తీవ్రమవుతున్న సైనిక సంఘర్షణలకు స్వస్తి చెప్పేలా భారత్, పాకిస్తాన్‌లను బలవంతం చేయడానికై ‘వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోను’ అని ఆ రెండు దేశాలను బెదిరించానని, యుద్ధం నాలుగో రోజున నిలిచి పోయిందని ట్రంప్ వెల్లడించాడు. ఆయన ఇలా ప్రకటించడం ఇది ఎన్నోసారో మీకు గుర్తుందా? ట్రంప్ మాటను బహిరంగంగా గానీ, పార్లమెంటులో గానీ నరేంద్ర మోదీ నిరాకరించనే లేదు. చైనా సైనిక దళాలు భారత భూభాగాలలోకి చొచ్చుకువచ్చి తిష్ఠ వేశాయని, ఇది దురాక్రమణ మినహా మరేమీ కాదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆయన మొహాన మోదీ చెప్పనే లేదు కదా.

ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య వెల్లివిరిసిన కొత్త స్నేహ సరసత జపాన్, ఆస్ట్రేలియా, తైవాన్‌తో పాటు భారత్‌కూ సమస్యలు సృష్టిస్తోంది. భారత్‌కు ఇప్పుడు దక్షిణాసియాలో ఒక్క మిత్ర దేశమూ లేదు. పశ్చిమాసియా దేశాలు సమష్టిగా కొత్త సర్దుబాట్లు చేసుకుంటున్నాయి. అంతేకాదు, భారత్‌ను పట్టించుకోకుండా ఇజ్రాయెల్‌తో కొత్త స్నేహ వారధులు నిర్మించుకుంటున్నాయి. రాజనీతిలో మన పురాతన ఆచార్యుడు ఇటువంటి క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని చెప్పాడు? చుట్టుముట్టిన ఇబ్బందులను నమ్రతతో ఆకళింపు చేసుకుని విజ్ఞతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని కాదూ? నరేంద్ర మోదీగారూ, ప్రస్తుతం మీరు అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తప్పక పునరాలోచన చేయాలి. మౌలిక మార్పులతో కొత్త వైదేశిక నీతికి రూపకల్పన చేయాలి.


> ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య వెల్లివిరిసిన కొత్త స్నేహ సరసత భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమిస్తోంది. మనకు ఇప్పుడు దక్షిణాసియాలో ఒక్క మిత్ర దేశమూ లేదు. పశ్చిమాసియా దేశాలు సమష్టిగా కొత్త సర్దుబాట్లు చేసుకుంటూ ఇజ్రాయెల్‌తో స్నేహ వారధులు నిర్మించుకుంటున్నాయి. ప్రస్తుతం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై మోదీ సర్కార్ తప్పక పునరాలోచన చేయాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

రాయలసీమ గుండెచప్పుడు

ఉజ్వలమైన సామాజిక పూర్వరంగంతోనే పప్పూరు రామాచార్యులు (1896–1972) స్వాతంత్ర్య యోధుడిగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, కళాకారుడుగా పరిణమించారు. పప్పూరి వారి ఐదు దశాబ్దాల పాత్రికేయ జీవితంలో మొదటి మూడున్నరేళ్లు ‘పినాకిని’ పత్రికను నడిపినా, రెండవదైన ‘శ్రీసాధన పత్రిక’ను రాయలసీమ ప్రాంతపు గుండెచప్పుడుగా 1926 నుంచి నాలుగున్నర దశాబ్దాలకు పైబడి నిర్వహించారు. తొలి పత్రిక నామకరణంలో ప్రాంతీయ అస్తిత్వం ప్రతిఫలించినా, రెండవదానిలో అప్పటికి అత్యంత అవసరమైన కార్యసాధనా దృష్టి ప్రతిబింబించింది. రాయలసీమ నాయకులకు తలలోని నాలుకలాగా వ్యవహరించిన రామాచార్యులు ‘శ్రీ బాగ్ ఒడంబడిక’ మీద సంతకం చేసిన వారిలో ఒకరు.

అనంతపురంలోని సొంత ముద్రణాలయంలో ప్రతి శనివారం 12 పుటలతో వచ్చేట్టు, వారపత్రికగా 1926 ఆగస్టు 14న ‘శ్రీసాధన పత్రిక’ మొదలైంది. “దత్త మండలం స్థితిగతుల నరసి వెల్లడించుటకు ఇప్పుడు తగిన పత్రిక లేని లోపమును బాపుటకై మరల ఒక వారపత్రిక నెలకొల్ప ప్రయత్నించు మమ్ము మండల వాసులు చాలామంది ప్రోత్సహించిరి...” అని తొలి సంచికలో వివరమైన ఆశయాలను ప్రకటిస్తూ రాజకీయ అంశాలే కాకుండా సాంఘిక, నైతిక, సారస్వత విషయాలు తమ పత్రిక అజెండాలో ఉన్నాయని పేర్కొంటూనే; సాంఘిక జీవనమే, నైతికవర్తనమే ప్రధానమని విస్పష్టంగా చెప్పడం విశేషం. “రాజకీయం ప్రజలకు సంబంధించినది కాదా? ప్రజలతో సంబంధంలేని రాజకీయముంటుందా? సహకారమూ రాజకీయమే! ప్రభుత్వము, ప్రజలు వేరుగా ఉన్నంతవరకూ భారతజాతి యొక్క ప్రతి విషయమూ రాజకీయమే అవుతుంది. మనం తినే తిండి, త్రాగే నీరు, కట్టే గుడ్డ, కట్టుకున్న పెండ్లాము, కన్నబిడ్డలు అంతా రాజకీయమే. కానీ దృష్టి మార్చుకుని చూస్తే ఏదీ రాజకీయము కాజాలదు. అప్పుడు ప్రతిదీ సాంఘిక సమస్య అవుతుంది. ఈ దృష్టి మార్పుకే స్వరాజ్య సంపాదనమని పేరు...” అని 1929 మే 11వ తేదీ ‘శ్రీసాధన పత్రిక’ సంచికలో ఒక విమర్శకు జవాబుగా రామాచార్యులు రాశారు.



1926లో ప్రారంభించిన ‘శ్రీసాధన పత్రిక’ను సాహిత్య ప్రధానంగాను, రాజకీయ పోరాటపు ఆయుధంగాను పప్పూరి రామాచార్యులు నిర్వహించారు. శ్రీబాగ్ ఒడంబడికపై సంతకం చేసిన పప్పూరి వారు స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌కు దూరంగా జరిగిన స్వేచ్ఛావాది.

వేమనను తెలుగువారికి కొత్తగా సమగ్రంగా పరిచయం చేస్తూ రఘుపతి వెంకటరత్నంనాయుడు పూనికతో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ఆధ్వర్యంలో 1928 అక్టోబర్ 25 నుండి 31 దాకా రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ వారం రోజులపాటు అనంతపురంలోని సీడెడ్ డిస్ట్రిక్ట్ కాలేజ్ (ఇప్పటి ఆర్ట్స్ కాలేజ్) భవనంలో ప్రఖ్యాతమైన ప్రసంగాలు చేశారు. రామాచార్యులు తన పత్రికలో తొలి నుంచి కవిత్వం, కథలు, ఉపన్యాసాలు, నాటికలు, వ్యాసాలు, లేఖలు, నాటక విమర్శలు, మాండలిక వృత్తాంతాలు, యాత్రాచరిత్రలు, భాషా విషయాలు, శాసన విషయాలు, సాహిత్య విమర్శ పుస్తక సమీక్షలు, నీతి కథలు వంటివి ఎన్నో రాజకీయ వార్తలు, వ్యాఖ్యలతో పాటు ప్రచురించేవారు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర వంటి విద్వాంసుల తొలి రచనలు ఈ పత్రిక కుదురు నుంచి వెలువడినవే. కనుక పప్పూరు రామాచార్యులను రాయలసీమ ఆధునిక సాహిత్య నిర్మాతగా కూడా పరిగణించాలి. మొదటి పదేళ్లు సాహిత్య ప్రధానంగా సాగిన తర్వాత రాజకీయ పోరాటపు ఆయుధంగా ‘శ్రీసాధన’ను మలిచారు. ఆర్థికంతోపాటు ఆంక్షల ఇబ్బందులతో ముందుకు సాగినా లక్ష్యాన్ని, వ్యూహాన్ని వదలలేదు. కనుకనే 1932 సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా సంపాదకుడు జైలు పాలైనప్పుడు రెండున్నర సంవత్సరాలకు పైగా పత్రిక ఆగిపోయింది. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో రామాచార్యులు రాజకీయ ఖైదీ కావడంతో తిరిగి మరల కొంతకాలం శ్రీసాధన ఆగిపోయింది. రాజకీయాలలో గాంధీజీ స్ఫూర్తిగా మొదలై, ప్రకాశం అనుయాయిగా కొనసాగిన వాస్తవికవాది పప్పూరు. కల్లూరు సుబ్బారావు తొలినాటి నుంచీ మిత్రుడే అయినా వారితో రాజకీయపరమైన అభిప్రాయ బేధాలుండేవి. తాను చదువు చెప్పిన నీలం సంజీవరెడ్డి రాజకీయాలలో కీలకంగా ఉన్నప్పుడు, అలాగే ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు రామాచార్యులు ఆయనతో తీవ్రంగా విభేదించేవారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కాంగ్రెస్‌కు దూరంగా జరిగిన ఈ స్వేచ్ఛావాది 1963 సెప్టెంబరు 28 నుంచి తీవ్ర నిరాశలో తన పత్రికలో రాజకీయ విమర్శలు చేయడం మానివేశారు.

1928 నవంబర్ 17, 18 తేదీలలో నంద్యాలలో సర్వేపల్లి రాధాకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలలోనే డా. చిలుకూరు నారాయణరావు 128 పాదాల ‘దత్తగేయం’ చదివి దత్త మండలానికి ‘రాయలసీమ’ అనే పేరు ప్రతిపాదించారు. ‘...ఇచ్చిన దెవ్వరో పుచ్చినదెవరో’ ...అంటూ ఆ గేయం మొదలై, ‘పరిహాసములు సేయ తరిగాదు నేడు’ అని వివరిస్తూనే “దత్త కానమ్మ నే దత్తను కాను/ ఉత్తదబ్బరలివి చిత్తము కలదు/ దత్తతయన్ దూడు తొలగించరేని/ దరి చేర్చినా నేమి మరసిరయేని/ ఇరుగువారలు మన పొరుగు వారాలను/ సరిజూచి మన్నించి సఖ్యంబు నేరపి/ గౌర సబుద్ధితో గాంతురు మనల/ సంతలో జూపట్టు నాంధ్రాభ్యుదయము” అని ముగుస్తుంది. ఆ సభలలో చివరి రోజున దత్త మండలాలకు ‘రాయలసీమ’ అని నామకరణం చేస్తూ ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించారు. తొలుత ‘శ్రీసాధన పత్రిక’ మకుటంలో ఉన్న ‘వాయిస్ ఆఫ్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్’ అనే మాటలను పప్పూరు రామాచార్యులు 1929 మార్చి 16 నుంచి ‘వాయిస్ ఆఫ్ రాయలసీమ’గా మార్చారు. రాయలసీమకు గుండెకాయ వంటి ‘శ్రీసాధన పత్రిక’ను ఉజ్వలంగా నడిపిన పప్పూరు రామాచార్యులు 1972 మార్చి 21న గతించినా సదా చిరస్మరణీయుడే!

● డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి పూర్వసంచాలకులు

(నేడు పప్పూరు రామాచార్యులు జయంతి)

తిరుమలలో ఆఫ్‌లైన్ దర్శనం కల్పించాలి

గతంలో తిరుమలలో భక్తుల కోసం ఆఫ్‌లైన్ దర్శనాలు ఉండేవి. గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులు ‘ఈ–దర్శన్’ ద్వారా కూడా సులభంగా టికెట్లును పొందే వీలుండేది. కానీ ప్రస్తుతం ఆ సేవలు నిలిచిపోవడంతో వేంకటేశుడి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. భక్తుల సౌకర్యం కోసం అంటూ ఇటీవల ఆన్‌లైన్ టికెట్ సర్వీసును టీటీడీ తీసుకొచ్చింది. కానీ సరైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వేంకటేశుని దర్శనానికి ఇబ్బందులు తప్పడంలేదు. టీటీడీ వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్యలు, టిక్కెట్ స్లాట్లు క్షణాల్లో ఖాళీ కావడం, మోసపూరిత వెబ్‌సైట్లు పెరుగుతుండడం వంటివి భక్తుల్లో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. గతంలో తిరుమలలో సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉండేవి. సాధారణ భక్తులు తాము నిర్దేశిత సమయానికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకునే సౌలభ్యమూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ అవకాశం లేదు. ఆన్‌లైన్ టికెట్ దర్శనాల కారణంగా వారికి ఆ సదుపాయాల్లో అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా టీటీడీ స్పందించి జిల్లా కేంద్రాలలో తిరిగి ఈ–దర్శన్ కౌంటర్లను ప్రారంభించాలి. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రజల కోసం ఆఫ్‌లైన్ దర్శనాలను తిరిగి ప్రారంభించాలి.

– అప్పన్న గొనప

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

గెలిచే లీడరు... ఓడే ఓటరు

భారత జాతీయ రాజకీయాల్లోనే పెను భూకంపం సృష్టించగలవని భావిస్తున్న బిహార్ ఎన్నికలు... తొలిదశ పోలింగ్ ద్వారా ఆ మేరకు ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇచ్చాయి. 243 సీట్ల అసెంబ్లీలో 121 సీట్లకు జరిగిన పోలింగ్ సందర్భంగా ఓటర్లు పోటెత్తిన తీరు అధికార, విపక్ష కూటములు రెండింటి గుండెల్లోనూ గుబులు రేపుతోంది. పైకి ఎవరెంత గాంభీర్యం ప్రదర్శిస్తున్నా... 11న రెండో దశ పోలింగ్ పూర్తయి, 14న ఫలితాలు వెలువడే దాకా నరాలు తెగే ఉత్కంఠే!

ఒక రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నిక ప్రభావమైనా సాధారణంగా ఆ రాష్ట్రానికే పరిమితం. కానీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికల సంగతి అలా కాదు. లోక్‌సభలో పూర్తి మెజారిటీ లేక- తెలుగుదేశంతో పాటు జేడీ(యు) పైన అధికంగా ఆధారపడుతున్న బీజేపీ ఒకవైపు; ఎడాపెడా ఉచిత హామీలు, కుల–మత సమీకరణాలు, ఓటు చోరీ ఆరోపణలే తమను గట్టెక్కిస్తాయన్న ఆశాభావంతో కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి మరో వైపు. నితీశ్‌కుమార్, తేజస్వీ యాదవ్ మధ్య ప్రత్యక్ష పోరాటమే అనిపిస్తున్నప్పటికీ, వాస్తవంలో మోదీ, రాహుల్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమిది.

బిహార్ ప్రస్తావన రాగానే ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు... లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్. మంచో–చెడో ఆ రాష్ట్ర రాజకీయాలపై వారు వేసిన ముద్ర అంత బలమైనది. ప్రస్తుతం 77 ఏళ్ల వయసులో వయోభారం, అనారోగ్యం, స్కాముల తాలూకు కోర్టు కేసుల చికాకుల వల్ల బిహార్ ఎన్నికల రంగస్థలంపై లాలూ క్రియాశీలక పాత్ర పోషించడం లేదు. కానీ, 1990లలో రాష్ట్ర రాజకీయాల సమీకరణాలనే సాంతం మార్చేసి, కొత్త మలుపు తిప్పిన ఘనత కచ్చితంగా ఆయనదే. మందిర్, మండల్ ఉద్యమాలు రెండింటినీ తనకు అనుకూలంగా మలచుకొని– బలమైన ఎం.వై (ముస్లిం–యాదవ్) ఫార్ములా ద్వారా దిగ్విజయయాత్ర సాగించిన రాజకీయ చతురుడు లాలూ. 1990 ఆగస్టులో, అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులను అమలుపరచడంతో అగ్రకులాలకు చెందిన వారి నిరసనోద్యమం కారణంగా దేశం అట్టుడికిపోయింది. ఆనాడు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ, ఆ రాష్ట్రంలోని 52 శాతానికి పైగా వెనుకబడిన తరగతుల వారి పక్షాన నిలబడి, తిరుగులేని నాయకుడిగా ఆవిర్భవించారు. ఆ తరువాత ఎన్నో ఏళ్ల పాటు వారిపై తన పట్టును, ప్రభావాన్ని కొనసాగించగలిగారు. బిహార్ ఎన్నికల ఫలితాలను తేల్చే కీలక అంశంగా కుల రాజకీయాలు మారింది ఆనాటి నుంచే. ఆ రాష్ట్ర అసెంబ్లీలోని 113 సీట్లలో 2010, 2015, 2020 ఎన్నికల్లోనూ అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు, అంతే సంఖ్యలో పదే పదే ఎన్నిక కావడం... కుల సమీకరణ రాజకీయ ప్రాధాన్యానికి నిదర్శనం.

అయోధ్య రామాలయం కోసం బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీ అప్పట్లో చేపట్టిన రథయాత్ర నుంచి సైతం అత్యధిక ప్రయోజనం నొల్లుకున్నది లాలూనే. 1989 సార్వత్రిక ఎన్నికల్లో 85 లోక్‌సభ సీట్లు సాధించిన బీజేపీ–ఆనాడు వీపీ సింగ్ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ సర్కారులో కీలక భాగస్వామి. అద్వాణీ రథయాత్ర పెను సవాలుగా మారినప్పటికీ, సర్కారు మనుగడ దృష్ట్యా దాన్ని ఆపే సాహసం సింగ్ చేయలేకపోయారు. ఆ పని లాలూకు అప్పగించారు. 1990 అక్టోబరు 23న సమస్తీపూర్‌లో అద్వాణీని అరెస్టు చేసి, బిహార్–పశ్చిమబెంగాల్ సరిహద్దులోని మసన్‌జోర్ ప్రభుత్వ అతిథి గృహానికి తరలించింది– బిహార్‌లోని అప్పటి లాలూ ప్రభుత్వం. ఆ చర్యతో ఒక్కసారిగా ముస్లింలు, వామపక్ష లిబరల్‌వాదులకు ఆత్మబంధువుగా మారిపోయారు లాలూ. తన కులవర్గమైన యాదవులతో పాటు ముస్లింలనూ గట్టి ఓటు బ్యాంకుగా మలచుకోగలిగారు. ఈనాటికీ ఆయన పార్టీ (ఆర్జేడీ)కి ఎంవై సమీకరణే అండా–దండా! ప్రస్తుత ఎన్నికల్లోనూ ఈ వర్గమే తమను విజయతీరాలకు చేర్చగలదని లాలూ–తేజస్వీ నమ్ముతున్నారు. మరోవైపు, ముఖ్యంగా లాలు హయాంలో అవినీతి, అక్రమాలు, గూండాగిరీ, అరాచకత్వం, మావోయిస్టు హింసాకాండ, సామాజిక అశాంతి కారణంగా బిహార్ ‘జంగిల్ రాజ్’గా మారిందన్న ప్రచారం జనంలోకి చొచ్చుకెళ్లింది. ఆయన కుమారుడు మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్‌ను సైతం ఆ నీడ నేటికీ వెంటాడుతోంది.




బిహార్ రాజకీయాల చదరంగంలో గ్రాండ్ మాస్టర్ అనదగ్గ మరో నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్. పరిస్థితులు, అవసరాలు, అవకాశాల్ని బట్టి ఎన్నికలకు ముందో, తరువాతో ఉన్నట్టుండి కూటమి ఫిరాయించడం, తను మాత్రమే చక్రం తిప్పగలగడం ఆయనకు అలవాటైన విద్య. ‘పల్టూరామ్’ అంటూ ప్రత్యర్థులు ఆడిపోసుకుంటారు కానీ, ఎవ్వరి ఊహకూ అందని రీతిలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త రాజకీయ ఎత్తుగడలు వేయడంలో ఆయన దిట్ట. 74 ఏళ్ల నితీశ్, ఇప్పుడు ఏకంగా పదోసారి బిహార్ సీఎం పదవికి పోటీపడుతున్నారంటేనే ఆయన రాజకీయ జిత్తుల మారితనాన్ని అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి, సుస్థిరత, శాంతిభద్రతలతో కూడుకొన్న సుపరిపాలనే తన లక్ష్యం, ధ్యేయంగా ప్రజల్లో బలమైన భావన ఏర్పరచగలిగిన నితీశ్– పార్టీల జయాపజయాలు, కూటముల కొట్లాటలు, కోలాటాలతో సంబంధం లేకుండా ఏకంగా 20 ఏళ్లుగా అధికారంలో కొనసాగగలగడం చిన్న విషయం కాదు. పరిపాలన సంస్కరణలు, ప్రజా సంక్షేమం వంటివి తన పక్షానికి మరో విజయం కట్టబెడతాయని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. నితీశ్ శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితి సవ్యంగా లేదంటూ రాజకీయ వర్గాల్లో కొద్దికాలంగా ప్రచారం జరుగుతోంది. దీర్ఘకాలిక పాలన కారణంగా ప్రభుత్వ వ్యతిరేకత మేట వేసిందన్న అంచనాలూ ఉన్నాయి. అయినప్పటికీ ఎన్నికల్లో నెగ్గుకురావాలంటే– ‘మోదీ అప్పీల్’తో పాటు నితీశ్ ‘కరిష్మా’పైనా చాలావరకు ఆధారపడక తప్పని పరిస్థితి ఎన్డీయేది. కుర్మీ–కొయిరీ కులవర్గాలు (7 శాతం), బాగా వెనుకబడిన హిందూ వర్గాలు (ఈబీసీ) (26 శాతం), మహా దళితులు, మహిళలతో కూడుకొన్న ఓటు బ్యాంకుపైనే నితీశ్ కూటమి ఆశలన్నీ!

ఆర్థికంగా దివాళా తీసినందున బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ (బీఐఎంఏఆర్‌యూ)లను కలిపి 1980ల నుంచి ‘బీమారు’ రాష్ట్రాలుగా పిలుస్తున్నారు. ‘బీమారు’ అంటే– జబ్బుపడిన అని అర్థం. ఈ రాష్ట్రాల్లో యూపీతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ సైతం చాలా వరకు కోలుకోగలిగినప్పటికీ, బిహార్ నేటికీ దారిద్ర్యం ఊబిలో నుంచి బయటపడలేకపోతోంది. పనీ లేక– ‘మనీ’ రాక ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ పెద్దయెత్తున ఇతర రాష్ట్రాలకు వలసపోక తప్పని పరిస్థితి బిహారీలది. ఏటా 25 లక్షల బిహారీలు పని కోసం వేరే రాష్ట్రాలకు వలసపోతుంటారు. 35 శాతం దాకా యువత నిరుద్యోగులే. కార్మికుల్లో 80 శాతానికి పైగా అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ‘జంగిల్ రాజ్’ అన్న ముద్ర చాలా వరకు చెరిగిపోయినప్పటికీ, అవినీతిమయ రాష్ట్రాల్లో నేటికీ తొలి అయిదారు స్థానాల్లో కొనసాగుతోంది. అందుబాటులో ఆస్పత్రులు, వైద్యులు– అన్యదేశీ పదాలిక్కడ. 42 శాతం బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎన్నో ఎన్నికలు... మరెన్నో హామీలు. అన్నీ అరచేతిలో స్వర్గాలే. దశాబ్దాలు దొర్లిపోతున్నా... బిహార్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే! అప్పటి ఎన్నికలైనా, ఇప్పటి ఎన్నికలైనా– మార్పు రాదేమో! అంతిమంగా... గెలిచేది లీడర్లు.. ఓడేది ఓటర్లే!

■ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు









శ్రీచరణికి స్వాగతం

స్వాగతం పలుకుతున్న మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఎంపీ చిన్ని

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ కప్‌లో విజయం సాధించి తొలిసారి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసిన మహిళా క్రికెటర్ శ్రీచరణికి అపూర్వ స్వాగతం లభించింది. ఎయిరిండియా విమానంలో ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం ఆమె ఇక్కడికి విచ్చేశారు. మంత్రులు వంగలపూడి అనిత, ఎస్.సవిత, గుమ్మిడి సంధ్యారాణి, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు, మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, క్రికెట్ సెలక్షన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. పలు కళాశాలలు, పాఠశాలలు, అకాడమీలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వందేమాతరం.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం రోడ్డు మార్గాన శ్రీచరణి సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.

విజయగీతిక

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 3 వేల మంది విద్యార్థులు వందేమాతరం ఆలపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా సందేశం ఇచ్చారు.





6



మాట్లాడుతున్న ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ

సీఎం సూచనల మేరకు దుర్గగుడి అభివృద్ధి

- దసరా తరహాలోనే భవానీ దీక్ష విరమణ ఉత్సవాలు
- మల్లేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం
- దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ వెల్లడి

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి చేపట్టి, భక్తులకు పెద్దపీట వేస్తామని ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డిలో ఉన్న ఆలయ సమావేశపు కార్యాలయంలో పాలకమండలి మొదటి సమావేశం శుక్రవారం జరిగింది. 24 అంశాలపై చర్చించారు. అనంతరం ఛైర్మన్‌తో పాటు ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తొలుత ఛైర్మన్ మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణలకు పెద్ద ఎత్తున భవానీలు తరలిరానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్ష విరమణల్లో కూడా అన్ని ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేస్తామన్నారు. ఇంజనీరింగ్ మిగతా 6లో..

ఒక్కొక్కరుగా నకిలీలు

నకిలీ మద్యం కేసులో బయటపడుతున్న నిందితులు

నకిలీ మద్యం తయారీ కేసులో నలుదిక్కుల్లో మూలాలు బయటకొస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒక్కొక్కరు చేసిన పనులపై ఎక్సైజ్, సిట్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. కోర్టు ద్వారా కస్టడీలోకి తీసుకుంటుండంతో నిందితుల సంఖ్య భారీగానే పెరుగుతోంది. తాజాగా శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు మరో ఏడుగురిని కస్టడీలోకి తీసుకున్నారు.

- తాజాగా ఏడుగురిని కస్టడీకి తీసుకున్న ఎక్సైజ్
- కీలక ఆధారాలు సేకరించే పనిలో అధికారులు
- విచారణలో తవ్వేకొద్దీ బయటకొస్తున్న నిజాలు
- పేరు తప్పుతో మనోజ్‌కుమార్ అతి తెలివి
- హైకోర్టును ఆశ్రయించిన 'మూతల' నిందితుడు



శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న ఏడుగురిలో ఐదుగురు నిందితులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసులో ఒక్కొక్కరి వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన రావును వారం పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. వారిద్దరూ ఇచ్చిన సమాచారంతో వైసీపీ నేత, మాజీమంత్రి జోగి బ్రదర్స్‌కు సంకెళ్లు చేశారు. నకిలీ మద్యం తయారీలో ఎవరెవరి పాత్ర ఎంత అన్న దానిపై ఒక్కో నిందితుడిని విచారణ చేయడం ద్వారా కూపీ లాగుతున్నారు. తాజాగా రిమాండ్ ఖైదీలుగా ఉన్న బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్, డి.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట కల్యాణ్, అల్లాభక్షు, నకరికంటి రవి, తాండ్ర రమేశ్‌బాబును శుక్రవారం కోర్టు ఐదు రోజుల కస్టడీకి ఇచ్చింది.

ఒక్కొక్కరుగా విచారణ

బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్ ఇబ్రహీంపట్నంలో ఉన్న ఏఎన్ఆర్ బార్‌లో పనిచేస్తూనే నకిలీ మద్యం సీసాలను బాక్స్‌లో పెట్టేవారు. ఫార్ములాను ఉపయోగించిన బాలాజీ చెప్పినట్టుగా వారు చేసేవారు. ఈ మద్యాన్ని బార్ బిజీగా ఉన్న రోజుల్లో మందుబాబులకు సరఫరా చేసేవారు. గన్నవరం మండలం సూరంపల్లిలో ప్లాస్టిక్ వస్తువుల తయారీ పరిశ్రమ నిర్వహించే డి.శ్రీనివాసరెడ్డి అద్దేపల్లి సోదరులకు అడిగిన మొత్తంలో ప్లాస్టిక్ సీసాలను సరఫరా చేశాడు. వాటికి అవసరమైన మూతలను వన్‌టౌన్‌లోని మనోజ్‌కుమార్ జైన్ బ్రాండ్లను ముద్రించి సరఫరా చేసేవాడు. హైదరాబాద్‌కు అల్లాభక్షు, జగ్గయ్యపేటకు చెందిన నకరికంటి రవి, ఒంగోలుకు చెందిన తాండ్ర రమేశ్‌బాబు.. అద్దేపల్లి సోదరులు చెప్పినట్టుగా సరుకును తలో ప్రదేశానికి మార్చేవారు. వారిద్దరి ఆదేశాల ప్రకారం అడుగులు వేసేవారు. ఇప్పుడు ఈ నిందితులను ఎక్సైజ్, సిట్ అధికారులు ఒక్కొక్కరుగా విచారణ చేస్తున్నారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

మనోజ్ అతితెలివి

నకిలీ మద్యం తయారీ కేసులో ఏ20గా ఉన్న మనోజ్‌కుమార్ జైన్ అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు చేసిన తప్పిదాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటున్నాడు. దీనిపై న్యాయపోరాటం చేయడానికి హైకోర్టు మెట్లెక్కాడు. మాజీమంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును సిట్ అధికారులు ఈనెల రెండో తేదీన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆరోజున కోర్టుకు సమర్పించిన కేసు డైరీలో ఏ20గా మనోజ్ కొఠారి పేరును రాశారు. మూడో తేదీన వన్‌టౌన్‌లోని పులిపాటి వారి వీధిలో ప్లాస్టిక్ మూతల వ్యాపారం చేస్తున్న మనోజ్‌కుమార్ జైన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనికి చాతీనొప్పి రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి 41ఏ నోటీసు ఇచ్చి మిగతా 6లో..



- టెలి కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, టెక్నికల్ విభాగాలన్నీ ఇక్కడే
- రూ.80 కోట్లతో పూర్తయిన టవర్, కాంప్లెక్స్ పనులు
- ఇక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయటమే ఆలస్యం

ఏటీసీ టవర్ రెడీ

విజయవాడ విమానాశ్రయంలో అత్యాధునికంగా నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయంలో సరికొత్త ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, అనుబంధ కాంప్లెక్స్ పనులు పూర్తయ్యాయి. ఎయిర్‌పోర్టులో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌కు మిగతా 6లో..

అత్యాధునికంగా...

అంతర్జాతీయ విమానాశ్రయాలకు అనుగుణంగా ఈ ఏటీసీ టవర్ అత్యాధునికంగా రూపుదిద్దుకుంది. పొడవు 25 మీటర్లు. విమానాల కదలికలను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు విమానాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇది పనిచేస్తుంది. ఈ టవర్‌లో అధునాతన సాంకేతిక వ్యవస్థలు ఉంటాయి. ఈ వ్యవస్థలు భూమిపైనా, ఆకాశంలో విమానాలతో నిరంతరం కమ్యూనికేషన్‌లో ఉంటాయి. దీనిలో ఇంకా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయలేదు. ఇప్పుడిప్పుడే పనులు చేపడుతున్నారు. విమమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ పూర్తయ్యే నాటికి దీనిని పూర్తి చేస్తారు.

ఇంజనీరింగ్‌లో ఇష్టారాజ్యం

39వ డివిజన్ పేవర్ బ్లాక్స్ పనుల్లో వ్యవహారాలు

- లెస్ టెండర్లు వేయించి కాంట్రాక్టు సంస్థకు పనులు
- శంకుస్థాపనకు వెళ్లి కనిపెట్టిన ఎమ్మెల్యే సుజనాచౌదరి
- అంచనాల పెంపుపై నీళ్లు నమిలిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఇంజనీరింగ్ పనులు అవినీతిమయంగా మారాయి. కాంట్రాక్టర్లతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని టెండర్ల విధానాన్ని అపహాస్యం చేస్తున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వంలోనే ఇంజనీరింగ్ విభాగం గాడితప్పింది. కమీషన్ల కోసం టెండర్లను ఇష్టారాజ్యంగా పిలుస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంది. ఇంజనీరింగ్ పనులతో పాటు ప్రజారోగ్యం, ఉద్యానం, రెవెన్యూ, జనరల్.. ఇలా ఏ శాఖ పరిధిలో చేపట్టాల్సిన పనులకైనా ఇంజనీరింగ్ విభాగమే టెండర్లు పిలుస్తోంది. దీంతో రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోంది. ఇందుకు బలం చేకూర్చేలా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్‌లో పేవర్ బ్లాక్స్ టెండర్ల వ్యవహారం లొసుగులు బయటకు వచ్చాయి. ఈ వ్యవహారాలను స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి చేతికే చిక్కడం గమనార్హం.

నిలదీసిన ఎమ్మెల్యే

పేవర్ బ్లాక్స్ పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమంలో సుజనా చౌదరి పాల్గొన్నారు. అంతకుముందే ఆయన సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ నిపుణులతో చర్చించి అంచనాలు ఎలా ఉంటాయన్న సమాచారాన్ని తెప్పించుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఎదురెదురుగా పెట్టి అంచనాల గురించి అడిగారు. టెండర్‌కు రూ.48 లక్షల అంచనాలు వేయటంపై ఆయన ఆగ్రహం మిగతా 6లో..



కాంట్రాక్టర్‌ను నిలదీస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

అవినీతి ఇలా..


39వ డివిజన్ పరిధిలోని కేవీఆర్ బిల్డింగ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల ఏర్పాటుకు పేవర్ బ్లాక్స్ వేసి పనులు చేపట్టేందుకు కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు రూ.48.74 లక్షలతో టెండర్లు పిలిచారు. మొత్తం 900 మీటర్ల పొడవునా ఈ పనులు చేపట్టాలి. మార్కెట్‌లో రూ.55గా ఉన్న పేవర్ బ్లాక్ ధరను రెట్టింపుగా అంటే.. రూ.110 చొప్పున చూపిస్తూ అంచనాలు పెంచేసినట్టుగా తెలుస్తోంది. మిగిలిన కాంపోనెంట్స్‌కు సంబంధించిన అంచనాలు ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి గుర్తించారు.



అందాల నిధి

నగరంలో సందడి చేసిన హీరోయిన్లు నిధి అగర్వాల్, ఈషా రెబ్బా

8



60 ఏళ్ల సొరంగం

- చిట్టినగర్‌లోని సొరంగానికి ఘన చరిత్ర



బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో దుర్గగుడి పాలకమండలి సమావేశం

దుర్గమ్మ భక్తులకు ఉదయం అల్పాహారం

- భవానీదీక్షల విరమణల ఏర్పాట్లకు ఆమోదం
- అన్నవితరణలో అదనపు ఆహారపదార్థాలకు నో..
- పాలకమండలి తొలి సమావేశంలో పలు తీర్మానాలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో శుక్రవారం పాలకమండలి నిర్వహించిన తొలి సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. పాలకమండలి అధ్యక్షుడు బొర్రా రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈవో వీకే శీనానాయక్, సభ్యులు పాల్గొన్నారు. భవానీదీక్షల విరమణకు సంబంధించి ఏర్పాట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మొత్తం 24 అంశాలకుగాను 19 అంశాలకు ఆమోదం తెలిపారు.

● కొండపైన దేవస్థానం సూచించిన ప్రదేశంలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసి కూల్‌డ్రింక్ షాపు నిర్వహించుకునేందుకు అక్టోబరు 16న జరిగిన టెండర్ కమ్ వేలంపాటలో శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకున్న పాటను భక్తుల భద్రత దృష్ట్యా రద్దు పరుస్తూ తీర్మానించారు.

● అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవిక ముక్కలు పోగు చేసుకునేందుకు గుంటూరుకు చెందిన పావని కలెక్షన్స్ అక్టోబరు 10న హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. అయితే సభ్యులందరితో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని ఈ అంశాన్ని వాయిదా వేశారు.

● సీతానగరంలో వీరాంజనేయ సమేత కోదండరామస్వామికి చెందిన విజయవాడ సూర్యారావుపేటలో గల 400 చదరపు గజాల స్థలాన్ని వినియోగించుకునేందుకు స్కూల్స్ కాలేజీలు, హాస్పటల్స్ తదితరాలకు తాత్కాలిక నిర్మాణాల ద్వారా 11 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనను వాయిదా వేశారు. గూడవల్లిలో ఉన్న 7.66 ఎకరాల భూమి లీజువిషయం సభ్యుల పరిశీలన నిమిత్తం వాయిదా వేశారు. అన్నదాన ట్రస్ట్ విభాగంలో భక్తులు అదనంగా అడిగిన ఆహారపదార్థాలను పెంచే అంశాన్ని పాలకమండలి తిరస్కరించింది. ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని తీర్మానించింది.

● తెల్లవారుజామున ఆలయానికి వచ్చే భక్తులకు బొంబాయిరవ్వ లేదా గోధుమరవ్వ, దద్దోజనం, కట్టుపొంగలిని అల్పాహారంగా ఇచ్చేందుకు ఆమోదించారు. సాధారణ రోజుల్లో 1500 మందికి, వారాంతపు సెలవులు, పర్వదినాల రోజుల్లో 2000 మందికి చొప్పున అందించేందుకు నిర్ణయించారు. భక్తుల రద్దీ, రోజుల ప్రాముఖ్యతను బట్టి పదార్థాలను పెంచుకునేందుకు, తగ్గించుకునేందుకు కూడా ఆమోదించారు.

భవానీదీక్షల విరమణ ఏర్పాట్ల ప్రతిపాదనలకు ఆమోదం

డిసెంబరు 11 నుంచి 17 వరకు భవానీ దీక్షల విరమణ సందర్భంగా రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి భక్తులను తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు, నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనాలకు అయ్యే రూ.9.60లక్షల ఖర్చు అంచనాలను ఆమోదించారు. 10 లక్షల వాటర్ బాటిల్స్ 7 లక్షల వాటర్ ప్యాకెట్లు మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా అందించేందుకు ఆమోదించారు. ప్రధాన ఆలయం, శివాలయం నుంచి టోల్‌గేట్ వరకు విద్యుత్ దీప అలంకరణల కోసం రూ.38 లక్షల అంచనాలతో పాటు పలు అంశాలకు ఆమోదం తెలిపారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి పై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రతరంగా జరిగేందుకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



మండవ జానికిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చలసాని ఆంజనేయులు, అధికారులు

కృష్ణామిల్క్ వృద్ధికి మండవ సేవలు ఎనలేనివి

- యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య చేసిన కృషి ఎనలేనిదని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కొనియాడారు. శుక్రవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో మండవ జానికిరామయ్య సంతాప కార్యక్రమం నిర్వహించారు. తొలుత యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు మండవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అధికారులు సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమ అభివృద్ధికి మండవ జానికిరామయ్య కృషి ఎనలేనిదన్నారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్కూల్ గేమ్స్ ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8నుంచి 10వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. అండర్-17 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో, నెట్‌బాల్ అండర్-17 బాల బాలికల విభాగంలో పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి 500మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని, తెలిపారు. పోటిలకు కార్యనిర్వాహక కారదర్శిగా ఎల్.దుర్గారావు, అడ్మిన్ కార్యదర్శిగా టి.శ్రీలతలు వ్యవహరిస్తారని, పోటిల్లో ప్రతిభ కనబరిచిన వారు జాతీయస్థాయి పోటిల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.





ఆఫ్రికన్ నత్తలతో ఆందోళన వద్దు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

- సీఎంవో ఆదేశాలతో హుటాహుటిన కదిలిన యంత్రాంగం
- జి.కొండూరులో పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు





పామాయిల్ మొక్కలో నత్తలను పరిశీలిస్తున్న అధికారులు

జి.కొండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులను హడలెత్తిస్తున్న ఆఫ్రికన్ నత్తల నివారణ చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం ఉపక్రమించింది. రైతులకు నిద్రలేకుండా చేస్తున్న ఆఫ్రికన్ నత్తలు కేరళ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్టు నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త సెల్వరాజ్ స్పష్టం చేశారు. పంటలను పీల్చి పిప్పి చేస్తున్న నత్తలతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. సీఎంవో ఆదేశాల మేరకు శుక్రవారం ఉద్యానశాఖ అధికారులు హుటాహుటిన గ్రామాల్లో పర్యటించారు. నత్తలపై రైతుల అనుమానాలను నివృతి చేశారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో పలు గ్రామాల్లో నత్తలు ఆశించిన పంటలను శుక్రవారం ఉద్యానశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆఫ్రికా నత్తలతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటిని చాలా సులువుగా నివారించుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి బాలాజీకుమార్, నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సెల్వరాజ్‌లు పేర్కొన్నారు. ఈనెల 5న 'హడలెత్తిస్తున్న ఆఫ్రికన్ నత్తలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం జి.కొండూరులోని బొప్పాయి, పామాయిల్, వంగ తదితర పంటల్లో ఆఫ్రికన్ నత్తలను గుర్తించారు. మునగపాడు బైపాస్ రోడ్డులో మండవ దుర్గారాణి తన పామాయిల్ తోటలో నత్తలను నిర్మూలించిన విధానం బాగుందని చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ, పంటలపై 10 శాతానికి మించి నత్తల దాడి లేదని తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. సకాలంలో అధికారులు సూచించే నివారణ పద్ధతులు పాటించి నత్తలను నివారించుకోవచ్చన్నారు.

నివారణ పద్ధతులు

పాడైపోయిన గన్నీబ్యాగ్స్‌ను ఉప్పు ద్రావణంలో ఉంచి పొలానికి రక్షణ గోడలా వేసుకుంటే అవి వ్యాప్తి చెందవు. కాపర్‌సల్ఫేట్ 1.5 గ్రాములు, ఐరన్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి ప్రతి మూడు రోజులకొకసారి పిచికారీ చేసుకుంటే నత్తల ఉధృతి, ఉనికిని తగ్గించుకోవచ్చు. ఎక్కువగా ఉధృతి ఉంటే ఎకరానికి 3 నుంచి 4 కేజీల మెటాల్డిహైడ్ బలపాలు అక్కడక్కడ పెట్టి నివారించుకోవచ్చు. 25 కిలోల వరి తవుడు, బెల్లం 3 కిలోలు, 100 థయోడిన్ పొడి మందు, 100 గ్రాముల ఆముదంతో విషపు గిళికలు తయారు చేసుకొని పొలంలో అక్కడక్కడ వేసుకోవాలి. ముఖ్యంగా పొలంలో, గడ్ల మీద కలుపు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. చెత్త కుప్పలు ఉండకూడదు. అత్యధిక వర్షపాతం వల్ల తేమశాతం అధికమై నత్తల ఉధృతి అధికమయ్యింది. జూలై నుంచి ఫిబ్రవరి వరకు నత్తలకు అనుకూల సమయం కనుక ఈ సమయంలో రైతులు పొలాలను శుభ్రంగా ఉంచుకోవాలి.



కేరళ రాష్ట్రం నుంచి వచ్చాయి..

- సెల్వరాజ్, కీటక శాస్త్రవేత్త



కేరళ రాష్ట్రం నుంచి ఈరకం నత్తలు రాష్ట్రానికి వచ్చాయి. మూడు నాలుగు మాసాల క్రితం వీటిని పార్వతి మన్యం, విశాఖ జిల్లాలో గుర్తించాం. కేరళ రాష్ట్రం నుంచి ఆయిల్ పామ్‌లో తమలపాకు సాగుకు నర్సరీ నుంచి మొక్కలు తీసుకువచ్చారు. వాటిద్వారా వచ్చాయి. అన్ని రకాల కూరగాయలు, పండ్ల తోటలను నాశనం చేస్తాయి. వీటి గురించి ఆందోళన చెందవద్దు.

గోదావరి జిల్లాలతో పోల్చితే ఉధృతి తక్కువే

- జిల్లా ఉద్యానఅధికారి బాలాజీకుమార్



గోదావరి జిల్లాలతో పోల్చితే ఈప్రాంతంలో నత్తల ఉధృతి చాలా తక్కువ. నత్తల బెడద తొలి దశలోనే ఉంది. జి.కొండూరు మండలంలో 2 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అధిక వర్షాలవల్ల నత్తలు వ్యాప్తి చెంది రాత్రి పూట పంటలకు ఎక్కువ నష్టం చేస్తుంటాయి. చిన్న మొక్కలు చనిపోతాయి. రైతుల అప్రమత్తతతో చాలా వరకు నివారించుకోగలిగారు. విధిగా నివారణ పద్ధతులతో పాటు చేతికి గ్లౌజులు వేసుకోవాలి. లేదా నత్తలు విసర్జించే జిగురులాంటి ద్రావణం వల్ల చర్మ వ్యాధులతో పాటు దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది.

వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఘనంగా వందేమాతరం వేడుకలు

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని, విద్యాంసుల నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించిందని, వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆర్డీవో కావూరి చైతన్య, తదితరులతో కలిసి భరతమాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అదేవిధంగా వందేమాతరం రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు మూడువేల మంది విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేశారు. ప్రధానమంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని.. ఈ సందర్భంగా ఆ మహనీయులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచిందని, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. వందేమాతరం ఔన్నత్యాన్ని దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకొని యువత ముందడుగు వేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ, కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కులాలు, మతాలకు అతీతంగా దేశ ప్రజల్లో వందేమాతరం స్ఫూర్తి నింపిందన్నారు. తేజస్వి పొడపాటి మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమానికి వందేమాతరం శ్వాసగా ప్రతిఒక్కరి హృదయాల్లో నిలిచిందని పేర్కొన్నారు. ప్రధాని మార్గనిర్దేశనంతో ఏడాది పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, కళా వైభవంతో వందేమాతరం విశిష్టతను వ్యాప్తి చేసేందుకు అకాడమీ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్.మల్లికార్జున రావు, కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, వందేమాతరం దేశ ప్రజల్లో అచంచలమైన దేశభక్తిని పెంపొందించిందని, ఈ గేయం 150 ఏళ్ల వేడుకల్లో భాగంగా ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



భరతమాత, బంకించంద్ర చటర్జీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, తేజస్వి పొడపాటి



కేబీఎన్ కళాశాలలో వందేమాతరం వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



కంచికచర్ల యార్డులో పెసలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

పెసలనూ కొనుగోలు చేస్తాం..

- సీసీఐ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెసలు కొనుగోళ్లకు సంబంధించి శాయశక్తులా కృషి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. శుక్రవారం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆమె, సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు పెసర రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును విన్నవించారు. పెసలు ఇంటికి వచ్చి రెండు నెలలు గడిచిందని, ఎక్కువ రోజులు నిల్వ చేయటం వల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదం నెలకొందని వాపోయారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పెసలు కొనాల్సిందిగా విన్నవించుకుంటున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదన్నారు. రబీ సీజన్ పనులు ప్రారంభం కావటంతో చేతిలో సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే సౌమ్య జిల్లా అధికారులతో మాట్లాడి పెసలు కొనుగోలు చేయాల్సిందిగా కోరారు. అధైర్యపడవద్దని, పెసలు కొనేలా కృషి చేస్తానంటూ రైతులకు హామీఇచ్చారు. స్థానిక యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటికే రైతులు భారీ వర్షాలు, మొంథా తుపాన్ వల్ల దెబ్బతిన్నారని, తేమ విషయంలో నిబంధనలు సడలించి, రైతులను ఆదుకోవాల్సిందిగా సీసీఐ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, పాలకవర్గసభ్యులు, ఏడీఎం రాజాబాబు, కార్యదర్శి శ్రీనివాస్, సీసీఐ బయ్యర్ బాల నరసింహ నాయక్ పాల్గొన్నారు.

ఒక్కొక్కరుగా నకిలీలు

(5వ పేజీ తరువాయి)

విడుదల చేశారు. నేరాలు చేయడంలో అనుభవం ఉన్న మనోజ్‌కుమార్ ఇక్కడే తన మెదడుకు పదును పెట్టాడు. ఎఫ్ఐఆర్, కేసు డైరీలో తన పేరు లేకపోయినా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కోర్టును ఆశ్రయించాడు. వ్యాపారరీత్యా తనకు వచ్చిన ఆర్డర్ల ప్రకారమే మూతలు సరఫరా చేశానని చెబుతున్నాడు. ఆ మూతలపై నకిలీ మద్యం బ్రాండ్ల పేర్లను ముద్రించి మరీ సరఫరా చేయడాన్ని ఎక్సైజ్ పోలీసులకు ఒక ఆధారంగా మారింది. తాను మూతలను మనోజ్‌కుమార్ నుంచి కొన్నానని అద్దేపల్లి జనార్దనరావు స్పష్టంగా చెప్పాడు. అసలు జనార్దనరావు అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, కలిసి వ్యాపారం చేయలేదని మనోజ్ చెబుతున్నాడు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అరెస్టు చేయడానికి ఎక్సైజ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారని హైకోర్టును ఆశ్రయించాడు. ఎక్సైజ్ పోలీసులు సీడీ ఫైలులో మనోజ్ కొఠారి అని మాత్రమే రాశారు. విజయవాడ వన్‌టౌన్‌లో అనేక మంది ఈ పేరుతో ఉన్నారని, వారెవరో స్పష్టంగా రాయాలని వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న మనోజ్ కొఠారి చెబుతున్నాడు. ఎక్సైజ్ పోలీసులు ఈ పేరును ప్రస్తావించగానే అంతా వైసీపీ నేత మనోజ్ కొఠారిని నిందితుడిగా చేర్చారని భావించారు. తర్వాత అదే పోలీసులు మనోజ్‌కుమార్ జైన్‌ను అరెస్టు చేయడంతో గందరగోళం ఏర్పడింది. సీడీ ఫైలులో పేరు తేడాగా ఉండటంతో జనార్దనరావుకు ముద్రించిన ప్లాస్టిక్ మూతలను సరఫరా చేసిన మనోజ్‌కుమార్ జైన్ తెలివితేటలను ప్రదర్శిస్తున్నాడు.

సీఎం సూచనల మేరకు దుర్గగుడి అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కనకదుర్గానగర్, ఘాట్‌రోడ్డులోని దుకాణాలన్నింటినీ మహామండపం ఐదో అంతస్థులోకి మార్చనున్నట్లు చెప్పారు. షాపుల వద్ద ప్రతి వ్యాపారీ తప్పనిసరిగా ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పూజా సామగ్రి విక్రయాల దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేవస్థానం నుంచి పోరంకి వరకు ప్రత్యేక బస్సును దాతల సాయంతో కానీ, ఆలయ నిధులతో కానీ నడుపుతామన్నారు. దేవస్థాన అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. మల్లేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయించనున్నట్లు తెలిపారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లపై చర్చించామన్నారు. కనకదుర్గానగర్‌ను మరింత అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. దీక్షల విరమణ అనంతరం మాస్టర్ ప్లాన్‌పై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

బెజవాడ బార్‌లో రాష్ట్రస్థాయి క్యారమ్, చెస్ టోర్నమెంట్

విజయవాడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్యారమ్, చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్‌లకు చెందిన న్యాయవాదులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్ విచ్చేయనున్నట్టు, బహుమతి ప్రదాన కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బార్ కౌన్సిల్ మెంబర్లు సుంకర రాజేంద్రప్రసాద్, నూరా బత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమర్, ఏపీ హైకోర్టు బార్ అధ్యక్షులు కె.చిదంబరం హాజరవనున్నట్టు బాషా తెలిపారు.

ఇంజనీరింగ్‌లో ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. తాను లెస్ టెండర్ వేసి పనులు దక్కించుకున్నానని కాంట్రాక్టర్ చెప్పారు. టెండర్ అంచనాలు పెంచి లెస్ టెండర్ వేయించటమేమిటని సుజనా.. ఇంజనీరింగ్ అధికారిని నిలదీశారు. టెండర్ స్పెసిఫికేషన్ల గురించి తెలుసుకున్న ఆయన ఫుట్‌పాత్‌లకు ఎంత మందంతో కూడిన పేవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారాన్ని కాంట్రాక్టర్ నుంచి తెలుసుకున్నారు. 20 శాతం లాభం వేసుకోవాలి కదా.. 40 శాతం వేసుకున్నారా.. అని ప్రశ్నించారు. అలాంటిదేమీలేదని కాంట్రాక్టర్ చెప్పారు. పోనీ 30 శాతం లాభం వేసుకున్నారా.. అని ప్రశ్నించారు. అది కూడా లేదని చెప్పారు. దీంతో సుజనా చౌదరి ఇంజనీరింగ్ అధికారులను అంచనాల గురించి ప్రశ్నించారు. అడుగుల లెక్కన అని కాంట్రాక్టర్, కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారమని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు. అయినా.. అంచనాలు తక్కువగానే ఉండాలి కదా.. ఎందుకు ఎక్కువ వచ్చాయని.. ప్రశ్నించారు. అంచనాలు పెంచి కాంట్రాక్టర్లతో లెస్ టెండర్లు వేయించొద్దని, వాస్తవ అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాలని, ఎవరూ నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై మీడియా ప్రతినిధులు సుజనాను వివరణ కోరగా, అలాంటిదేమీ లేదని సమాధానమిచ్చారు.

ఏటీసీ టవర్ రెడీ

(5వ పేజీ తరువాయి)

అనుసంధానంగా ఈ టవర్, కాంప్లెక్స్ పనులను రూ.80 కోట్లతో చేపట్టారు. ఈ రెండూ యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయి. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ కూడా పూర్తయ్యాక వినియోగంలోకి తీసుకొస్తారు.

వేగవంతమైన వ్యవస్థలు

ఈ ఏటీసీ టవర్‌లో రాడార్ వ్యవస్థలు ఉంటాయి. రేడియో తరంగాలను ఉపయోగించి విమానం ఎక్కడ ఉంది, కచ్చితమైన స్థానం, వేగం, ఎత్తును ఇవి నిర్ణయిస్తాయి. ఆటోమేటిక్ డిపెండెంట్ సర్వైలెన్స్-బ్రాడ్‌కాస్ట్ (ఏడీఎస్-బీ) మరో ప్రధానమైన వ్యవస్థ. ఈ వ్యవస్థ ద్వారా విమానం ఎక్కడ ఉందన్న విషయాన్ని ఉపగ్రహాల ద్వారా ప్రసారం చేస్తుంది. టవర్ దానిని గ్రహిస్తుంది. ఫ్లైట్ డేటా ప్రాసెసింగ్ సిస్టమ్స్ (ఎఫ్‌డీపీఎస్) అనేది ఇంకో ముఖ్యమైన వ్యవస్థ. ఈ వ్యవస్థ ద్వారా విమాన మార్గం, చేరుకునే సమయాన్ని అంచనా వేయడం, వాతావరణం వంటి సమాచారాలను టవర్‌కు అందిస్తుంది. సర్ఫేస్ మూవ్‌మెంట్ రాడార్.. అనేది విమానం రన్‌వేపై ఉన్నపుడు ఇతర వాహనాల కదలికలను గుర్తిస్తుంది. దీంతో పాటు విమాన పైలెట్లతో నిరంతరం కమ్యూనికేషన్స్ చేసే వ్యవస్థ, రియల్‌టైమ్ వెదర్, రాడార్, శాటిలైట్ డేటాను అందించే వ్యవస్థలు ఉంటాయి. ఇవన్నీ ఏర్పాటు కావటానికి రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. టవర్ వెనుక ఉన్న కాంప్లెక్స్‌లో ఎలక్ట్రికల్, టెలి కమ్యూనికేషన్ విభాగాలు ఏర్పాటు చేస్తారు.



రోడ్డుపై బోల్తా పడిన కూరగాయల లారీ

కూరగాయల వ్యాన్ బోల్తా

- వాహనాల రాకపోకలు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వై జంక్షన్ వద్ద మినీలారీ బారికేడ్లను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)పై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. విజయవాడ వైపు నుంచి కూరగాయల లోడుతో హైదరాబాద్ వైపు అతివేగంగా వస్తున్న మినీలారీ షేర్ మహ్మద్‌పేట, ఆటోనగర్ వైజంక్షన్ దగ్గర రహదారిపై బారికేడ్లను ఢీకొనటంతో అదుపు తప్పింది. ఆసమయంలో అటుగా వాహనాల రాకపోకలు లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వ్యాను బోల్తా పడటంతో కూరగాయలన్నీ హైవేపై చిందర వందరగా పడ్డాయి. హైవే మొబైల్ పోలీసులు అక్కడకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన లారీని క్రేన్‌తో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి.



క్రేన్‌తో వ్యాన్‌ను తొలగిస్తున్న హైవే పోలీసులు

బాలుడిపై పోక్సో కేసు

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టెంపుల్ కాలనీకి చెందిన 9వ తరగతి బాలికను ప్రేమ పేరుతో మోసగించి లైంగిక సంబంధం కొనసాగిస్తున్న బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరు పరచగానిందితుడికి 14రోజుల రిమాండ్ విధించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

పాలిటెక్నిక్‌లో యువతులకు ఎలక్ట్రిక్ టూ వీలర్ సర్వీస్‌పై శిక్షణ

భారతీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువతుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో యువతులకు ఎలక్ట్రిక్ టూ వీలర్ సర్వీస్, మెయింటెనెన్స్‌పై ఉచిత శిక్షణ అందజేస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎస్‌డీసీ) సర్టిఫికెట్స్‌ను అందజేస్తామని తెలిపారు. 17ఏళ్లు నిండిన, ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణులైన యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం వారిని సంప్రదించాలన్నారు.





పీబీ సిద్దార్థలో వందేమాతరం గీతాలాపన చేయిస్తున్న ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, పాల్గొన్న విద్యార్థులు, స్టేడియంలో 150 ఆకారంలో నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, తాటికొండ సుబ్బారావు పాఠశాలలో ..

జాతీయ ఉద్యమ స్ఫూర్తి..వందేమాతరం

మొగల్రాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి రోజు వందేమాతరం గీతం ఆలపించడం ద్వారా దేశభక్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు సూచించారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గీతం రచించి నవంబరు 7 నాటికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పీబీ సిద్ధార్థ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు.

లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేడియం ఆవరణలో వందేమాతరం 150 నంబర్ ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. భారీ జాతీయ జెండాను పట్టుకుని దేశభక్తిని చాటిచెప్పారు. అనంతరం వందేమాతర గీయాన్ని ఆలపించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎస్‌కె.రషీయాబేగం, కె.సుధాకర్ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాణిగారితోట: స్థానిక తాటికొండ సుబ్బారావు పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు పాల్గొని విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.



విజయవాడలోని డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో , ఆర్టీసీ హౌస్‌లో, వీఎంసీ ప్రధాన కార్యాలయంలో...

వీఎంసీ ప్రధాన కార్యాలయంలో..

కార్పొరేషన్: వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గీతం ఆలపించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో వందేమాతరం' గేయానిదే ప్రథమ భూమికని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఏ.రవీంద్రరావు, సీఎంహెచ్‌వో డాక్టర్ కే. అర్జునరావు, సీఈ పి. సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) వెంకటనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సిబ్బంది, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో ..

రైల్వేస్టేషన్: విజయవాడలోని డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో శుక్రవారం విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు, సిబ్బంది జాతీయ గీతం - వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఉత్సాహపూరితంగా నిర్వహించారు. విజయవాడ రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు, బ్రాంచ్ ఆఫీసర్లతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై, వందేమాతరం ఆలపించారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్మారక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష ప్రసంగాన్ని వీక్షించారు.

ఆర్టీసీ హౌస్‌లో ...

బస్టేషన్: ఆర్టీసీ హౌస్‌లో సామూహికంగా వందేమాతరం గీతాలాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ వందేమాతరం గేయం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ (హెచ్‌ఆర్‌డీ) మాణిక్యం, ఈడీ (ఆపరేషన్స్) చెంగల్‌రెడ్డి, ఎఫ్‌ఏ, సీఏవో ఎన్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ (మార్కెటింగ్) విజయగీత, డిప్యూటీ సీటీఎం (మార్కెటింగ్) ఎ.జాన్‌సుకుమార్, ఏడి (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) శోభామంజరి, చీఫ్ ఇంజనీర్ (ఐటీ) వై.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, సంస్థ కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్‌లో కర్నాటికి ఘననివాళి



కర్నాటి రామ్మోహనరావు పోస్టల్ స్టాంపును విడుదల చేస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, మల్లేశ్వరరావు,చలసాని తదితరులు

విజయవాడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం కర్నాటి రామ్మోహన్‌రావు 7వ వర్ధంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కర్నాటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ న్యాయవాదుల పట్లగాని, అమాయక ప్రజల పట్ల ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగినా కర్నాటి రామ్మోహనరావు అండగా నిలబడి వారికి బెజవాడ బార్ తరఫున ఉచిత న్యాయసహాయం అందించడమే కాక భరోసా కల్పించేవారన్నారు. బార్ కౌన్సిల్‌సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, ఎస్.మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ బార్ న్యాయవాదుల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించిన ప్పుడు కర్నాటి పోలీసులపై కేసులు వేసి వారిని ధీటుగా ఎదుర్కొన్నారన్నారు. అనంతరం వారు కర్నాటి రామ్మోహనరావు పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. బార్ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ బాలాజీ నగర్ ఫీడర్, 11కేవీ గీతానగర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. బాపనయ్య నగర్, చలసాని నగర్, రాణిగారితోట, పాత, కొత్త శాంపిల్ బిల్డింగ్, సంగీత అపార్ట్‌మెంట్, పేర్ని బద్రీనాథ్ అపార్ట్‌మెంట్, తారకరామా నగర్, భూపేష్‌గుప్తా నగర్, చలసాని నగర్, బాలాజీ నగర్, గీతానగర్ కట్ట, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కృష్ణలంక విద్యుత్ కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు నెహ్రూనగర్, గౌతమీ నగర్, ద్వారకా నగర్, శంకర మఠం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



ప్రభుత్వాసుపత్రిలో, సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

క్యాన్సర్ చికిత్సపై అవగాహన పెంచుకోవాలి

అవగాహన ర్యాలీలో ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ చికిత్సపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఆర్.సి.హెచ్.మోహన్ సూచించారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి వద్ద శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ నివారణ, ముందస్తుగా గుర్తించే విషయాలను మోహన్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌ఎంవో డాక్టర్ నాగేశ్వరరావు, ఏబీడీఎం నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో...:

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో జరిగిన క్యాన్సర్ అవగాహన ర్యాలీలో డాక్టర్ ఎ.ఏడుకొండలరావు పాల్గొన్నారు. క్యాన్సర్ రిస్క్ ఫ్యాక్టర్లు, క్లినికల్ లక్షణాలు, స్క్రీనింగ్ పద్ధతులు, నివారణ చర్యలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్, క్యాన్సర్ నివారణ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆషాపార్విన్, ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యకిషోర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌జీ రంగా జయంతి వేడుకలు



ఎన్‌జీ రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తరుణ్ కాకాని తదితరులు

మొగల్రాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు నాయకుడు ఆచార్య ఎన్‌జి రంగా 125వ జయంతి వేడుకలు మొగల్రాజపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌జీ రంగా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన రంగా నేటి తరానికి ఒక స్ఫూర్తి అని చెప్పారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, రంగా 125వజయంతి ఒకేరోజు రావడం గమనించాల్సిన అంశం అని కొనియాడారు. కార్యక్రమానికి ముందు ఆచార్య ఎన్‌జీ రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీ రంగా ట్రస్టు చైర్మన్ ధనశేఖర్ గోగినేని, బోధన్ మాజీ ఎమ్మెల్యే సాంబశివచౌదరి, ప్రముఖ పారిశ్రామికవేత్త మలినేని నారాయణ ప్రసాద్, రైతు నాయకులు గద్దె ప్రసాద్, తుమ్మల నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు ఎన్. పవన్ తదితరులు పాల్గొన్నారు.

నలందలో లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్ రేపు

గవర్నర్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో ఈనెల 9న చిన్నారులకు ఎన్‌వీఎన్ లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్, సండే కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ బేబిషో, టాలెంట్ పరేడ్, కాస్ట్యూమ్ పార్టీ, ఒలింపియాడ్ టెస్ట్ లాంటి పోటీలు కేటగిరి వారీగా ఉంటాయని తెలిపారు. ప్రవేశం ఉచితమని, ఎన్‌వీఎన్ కార్నివాల్ ఉదయం 9.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నగరంలోని చిన్నారులందరూ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవెలప్‌మెంట్ మైలవరపు కృష్ణతేజ బహుమతులు అందజేస్తారని తెలిపారు. పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ సీజీఎం డి.గురునాథరెడ్డి

మొగల్రాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మెట్రో రైల్ సాఫ్ట్‌వేర్ పనితీరు ఆటోమేటెడ్ మెట్రో సిస్టమ్స్ అభివృద్ధిలో కంప్యూటర్ సైన్సు పాత్ర అమోఘం అని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్), వింగ్ కమాండర్ డి.గురునాథరెడ్డి చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో ఇంటిలిజెంట్ ట్రాన్సిట్ సిస్టమ్స్ మెట్రో ఆటోమేషన్ అండ్ అనలిటిక్స్‌లో కంప్యూటర్ సైన్స్ పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ప్రాధాన్యాన్ని విద్యార్థులు గుర్తించి ఆ దిశగా సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల తరుపున ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ రాజేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్, ఎంఎస్‌సీ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్ మసీదు మలుపు వద్ద పాడైన రోడ్డు

అధ్వానంగా రోడ్డు ...ఆందోళనలో ప్రజలు

రామలింగేశ్వరనగర్,ఆంధ్రజ్యోతి: 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ మసీదు మలుపు వద్ద బీటీ రోడ్డు పాడై ప్రమాదకరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణలంక, నుంచి రామలింగేశ్వరనగర్ మీదుగా యనమలకుదురు, అవనిగడ్డ వెళ్లే బస్సు మార్గంలో చివర మసీదు మలుపు వద్ద రోడ్డు పాడై అవస్థలు పడుతున్నామని, ముఖ్యంగా ఎత్తు నుంచి పల్లంలోకి వెళ్లే మలుపు కావడం, గతుకులతో రోడ్డు ఉండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





రిసోర్స్ పర్సన్ లక్ష్మీకుమారితో ఎంబీఏ విద్యార్థులు

లయోలలో ఉపాధి నైపుణ్యాలపై ముగిసిన శిక్షణ

భారతీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధి నైపుణ్యాల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్(హెచ్‌ఆర్, పబ్లిక్ స్పీకర్) లక్ష్మీకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బహుళ ఇంటర్వ్యూ మర్యాదలు, రెజ్యూమ్ రైటింగ్, జాబ్ పోర్టర్స్, లింక్డ్ఇన్ వాడకం, గ్రూప్ డిస్కషన్‌లలో శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎ.మాధురి, డాక్టర్ సీహెచ్ వరలక్ష్మి, డాక్టర్ బి.ఆర్.కుమార్, డాక్టర్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను సత్కరిస్తున్న మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి దంపతులు, కుమారుడు, కోడలు

ఇళయరాజాకు సత్కారం

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటల్‌లో వివంతలో శుక్రవారం ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి కుటుంబంతో కలిశారు. రామసుబ్బారెడ్డి భార్య రాధ, కుమారుడు విశాల్, కోడలు స్వప్నతో కలిసి ఇళయరాజాకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. శనివారం మున్సిపల్ స్టేడియంలో జరగనున్న సంగీత కన్సర్ట్‌ను వీక్షిస్తానని చెప్పారు.



అనంత పద్మనాభస్వామి దేవస్థానం ట్రస్టీ లక్ష్మీభాయికి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో అనంత పద్మనాభస్వామి దేవస్థానం ట్రస్టీ

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కేరళలోని అనంత పద్మనాభ స్వామి దేవస్థానం ట్రస్టీ అశ్వతీ తిరునాళ్ గౌరీ లక్ష్మీభాయి దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ప్రిన్సెస్ ఆఫ్ ట్రావెన్ కోర్ గౌరీ లక్ష్మీభాయికి దేవస్థానం ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రముఖ నిర్మాత, సినీ నటుడు కొల్లా అశోక్ కుమార్‌తో కలిసి గౌరీ లక్ష్మీభాయి ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సెస్ ఆఫ్ ట్రావెన్ కోర్ లక్ష్మీభాయి, కొల్లా అశోక్ కుమార్‌లను దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న నిధి అగర్వాల్, ఈషా రెబ్బా

బెజవాడలో నిధి అగర్వాల్, ఈషా రెబ్బా సందడి

గవర్నర్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, ఈషా రెబ్బా శుక్రవారం బెజవాడలో సందడి చేశారు. అప్సర సెంటర్‌లో ఒక షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్న అభిమానులకు అభివాదం తెలిపారు. అభిమానులతో సెల్ఫీలు దిగారు. రెబల్ స్టార్ ప్రభాస్‌తో కలిసి నటించిన రాజ్యసభ చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుందని నిధి అగర్వాల్ తెలిపారు. మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నానని, అవి కూడా షూటింగ్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఇతివృత్తంతో రోషాగ్ని చిత్రం

● దర్శక, నిర్మాత, కథానాయకుడు రాజవీర



విలేకరులతో మాట్లాడుతున్న రాజవీర, సాహితీవేత్త గొల్ల నారాయణరావు

గాంధీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవశ్యకత ఉందనే అంశంతో రోషాగ్ని చిత్రాన్ని రూపొందించినట్టు చిత్ర దర్శక, నిర్మాత, కథానాయకుడు ఫైట్ మాస్టర్ రాజవీర తెలిపారు. గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సృష్టికర్త ఫిలింస్ బ్యానర్‌పై తెరకెక్కించిన రోషాగ్ని చిత్రం ఈనెల 9న శైలజా థియేటర్‌లో ఉదయం 9 గంటకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ స్ఫూర్తితో తాను కూడా ఎటువంటి డూప్ లేకుండా యాక్షన్ సన్నివేశాలు చేయడం జరిగిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త గొల్ల నారాయణరావు మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన రాజవీర గత 40 ఏళ్లుగా కన్నడ చిత్రపరిశ్రమలో పని చేస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. కన్నడలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించిన రోషాగ్ని చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ఎడిటర్ విజయ్‌కుమార్, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.



కిడ్నీ రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సరిత

కిడ్నీ బాధితులకు నెఫ్రాలజిస్టు వైద్యసేవలు

● కలెక్టర్ ఆదేశాలతో ఎ.కొండూరు పీహెచ్‌సీలో వైద్యశిబిరం

ఎ.కొండూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సహాయం అందించాలనే లక్ష్యంతో నెఫ్రాలజిస్టు సేవలు విస్తృతం చేసినట్టు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం ఎ.కొండూరు పీహెచ్‌సీలో విజయవాడ ప్రభుత్వాసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ సరిత ఆధ్వర్యంలో వైద్య బృందం 46 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ విజిటర్లు గ్రామాల్లో పర్యటించి కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని కోరారు. మద్యపానం, ధూమపానం, మత్తుపదార్థాలు సేవించడం, తరచూ కాళ్ల వాపులు వచ్చి తగ్గడం, కండరాల నొప్పులు, శరీరంలో నీరు చేరడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలతో బాధపడే వారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలు ప్రభుత్వం ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తున్న తెలిపారు. ముఖ్యంగా ఎ.కొండూరు, తిరువూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ప్రముఖ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెందిన నెఫ్రాలజిస్టు డాక్టర్ల సహకారంతో వారానికి ఒక రోజు ఎ.కొండూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తునట్టు డాక్టర్ తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు టీడీపీ సీనియర్ నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి 100 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. డాక్టర్లు దివ్య, స్వాతి ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలోకి వైసీపీ నాయకులు

విజయవాడ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు నియోజకవర్గం జెడ్పీటీసీ సభ్యుడు శేఖర్, వైసీపీ సీనియర్ నాయకురాలు కమలమ్మ, పలువురు సర్పంచ్‌లు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ వారికి కషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు విజయవాడ నగరానికి చెందిన బీసీ సంఘాల నాయకులు లాకా వెంగళరావు యాదవ్, నాగుల్ మీరా, యలమందరావులను కూడా బీజేపీలోకి ఆహ్వానించారు. ఆలూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్, సీనియర్ నాయకులు బీజేపీలో చేరడం పట్ల మాధవ్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న అన్ని పథకాలకు ప్రధాని నరేంద్ర మోదీ సహకారం ఉందని వివరించారు.



తెలుసుకుందాం

60 ఏళ్ల సొరంగం

బెజవాడ నగరం పేరు చెప్పగానే ఎవరికైనా టక్కున గుర్తుకొచ్చేది వన్‌టౌన్‌లోని ఇంద్రకీలాద్రి సొరంగం. చిట్టినగర్ టన్నెల్ ఏర్పడి 60 ఏళ్లు అవుతోంది.

చిట్టినగర్ ప్రాంతం నుంచి 1965కి పూర్వం విద్యాధరపురం, భవానిపురం, గొల్లపూడి ప్రాంతాలకు చేరుకోవాలంటే ఆంజనేయవాగు సెంటర్, కొత్తపేటచౌక్, చిన్నకోటవారి చౌక్, సామారంగం చౌక్ నుంచి ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకుని హైదరాబాద్ రోడ్డు మార్గంలోకి ప్రవేశించి కుమ్మరిపాలెం గట్టు నుంచి తిరిగి రావాల్సి వచ్చేది. వాహనాల్లో రాకపోకలు సాగించే వారు ఈ మార్గాన్ని ఎంచుకునేవారు. కాలి నడకన వెళ్లే వాళ్లు విచిత్రంగా చిట్టినగర్, విద్యాధరపురం మధ్య నున్న కొండను ఎక్కి దిగేవారు. ఈ పరిస్థితులను గమనించిన ప్రఖ్యాత ఇంజనీర్ కె.ఎల్.రావు ఈ ప్రాంతం ప్రయాణం సులభతరం చేయాలని ఆలోచించారు. దీనిలో భాగంగానే 1964లో సొరంగం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఇంజనీర్ కె.ఎల్.రావు దూరదృష్టితో ఆలోచించి టన్నెల్‌ను 120 అడుగులు ఏర్పాటు చేయాలని ముందుగా ప్రతిపాదించారు. అప్పటి రాజకీయ అస్థిర పరిస్థితుల దృష్ట్యా అది కేవలం 60 అడుగులకు కుదించబడింది. భవిష్యత్తులో విజయవాడ-హైదరాబాద్ మధ్య రద్దీ ఏర్పడుతుందని, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలతో విజయవాడలో ట్రాఫిక్ స్తంభిస్తుందని, దీని కోసం రానున్న రోజుల్లో కచ్చితంగా బైపాస్ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని, టన్నెల్ వెడల్పు 120 అడుగులు చేస్తే ఇదే బైపాస్‌గా ఉపయోగపడుతుందని ఇంజనీర్ కె.ఎల్.రావు పంపిన నివేదికను అప్పటి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేవలం 60 అడుగులకు మాత్రమే అనుమతి రావడంతో ఆ విధంగానే చిట్టినగర్ - విద్యాధరపురం మధ్య టన్నెల్ (సొరంగం) ఏర్పాటైంది. ఇది ఏర్పాటై 60 ఏళ్ల గడిచింది. విద్యాధరపురం, భవానిపురం, గొల్లపూడి, సితార జంక్షన్ నుంచి చిట్టినగర్, కేదారేశ్వరపేట, సత్యనారాయణపురం, గాంధీనగర్ ప్రాంతాల రాకపోకలకు ఈ టన్నెల్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంద్రకీలాద్రి టన్నెల్‌గా నామకరణం చేసిన ఈ సొరంగం విజయవాడ నగరానికి ప్రఖ్యాత చిహ్నంగా నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీ)



'మీ డబ్బు - మీ హకు' పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



కేన్సర్‌పై అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీరపాండ్యన్

బడుగు, బలహీనవర్గాలకు బ్యాంకులు చేయూతనివ్వాలి

కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రాధాన్యరంగాలతో పాటు బడుగు బలహీన వర్గాల ఆర్థిక సాధికారతకు బ్యాంకులు చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, యూబీఐ రీజనల్ హెడ్, డీసీసీ-డీఎల్ఆర్‌సీ కన్వీనర్ ఎంపీ తిలక్ హాజరైన ఈ సమావేశంలో తొలుత లీడ్ బ్యాంక్ (యూబీఐ) మేనేజర్ కె.ప్రియాంక పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గత సమావేశంలో తీసుకొన్న నిర్ణయాల అమలుతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక ప్రగతిని వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో స్మార్ట్ అగ్రికల్చర్‌తో పాటు పాడి, ఉద్యాన, ఎంఎస్ఎంఈ రంగాల అభివృద్ధిపై దృష్టిపెట్టామన్నారు. తొలివిడతగా 289 వ్యవసాయ డ్రోన్లు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నామని, ఇందుకు సహకరించాలన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) ద్వారా స్టార్టప్‌లను, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని, ఇందుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణ సదుపాయాలు పెంచాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో బ్యాంకుల పాత్ర కీలకమని, వివిధ పథకాల రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించిన రుణ మంజూరు దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే బొండా ఉమా, అధికారులు, బ్యాంకర్లతో కలిసి 'మీ డబ్బు - మీ హక్కు' నినాదంతో పోస్టరును ఆవిష్కరించారు. ఆర్‌బీఐ అధికారి నవీన్, నాబార్డ్ డీడీఎం ఎం.వృద్ధి, ఎస్‌బీఐ రీజినల్ హెడ్ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డీజీఎం రీజినల్ హెడ్ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డీఆర్‌హెచ్ అమిత్ జూయల్, ఇండియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ శేషగిరిరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతోనే కేన్సర్‌పై విజయం సాధ్యం

● వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్

కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండటంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకొని క్రమం తప్పక స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే నియంత్రణకు దోహదపడతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వీరపాండ్యన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేన్సర్ వ్యాధి అవగాహనపై రూపొందించిన వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అవగాహన లేమితో వ్యాధి తీవ్రత పెరిగే వరకు గుర్తించకపోవడం వలన వ్యాధి నియంత్రణ చేయలేని పరిస్థితి ఉందన్నారు. వ్యాధిపట్ల అవగాహన పెంచుకొని తొలి దశలోనే వ్యాధిని గుర్తించగలిగితే చికిత్స ద్వారా వ్యాధిని నియంత్రించుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. ప్రభుత్వం కేన్సర్ చికిత్సలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాకింగ్, సైక్లింగ్, యోగా వంటి వ్యాయామాలను అనుసరిస్తే కేన్సర్‌కు దూరంగా వుండే అవకాశం వుంటుందన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్యామల, డబ్ల్యుహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ జి.సురేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ మాధవి, డీపీఎంవో డాక్టర్ పి.నవీన్, డాక్టర్ స్నేహ సమీరా, డాక్టర్ హఫీసా పాల్గొన్నారు.



జీఆర్‌టీ హోటల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్

లబ్బీపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జీఆర్‌టీ హోటల్‌లో శుక్రువారం కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హోటల్ హెడ్, చెఫ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రిస్మస్‌కు నెలరోజులు ముందుగా కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కేక్ మిక్సింగ్‌లో 12 రకాల ఆల్కహాల్స్‌తో పాటు 12 రకాల నట్స్, డ్రై ఫ్రూట్స్‌ను కలపడం జరుగుతుందన్నారు. పండుగలు ప్రారంభ సందర్భంగా తమ హోటల్‌లో ప్రత్యేక ఆఫర్స్ ఇస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యాలయానికి శంకుస్థాపన

భారతీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి రేడియో కాలనీలో శుక్రవారం జరిగింది. కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ జీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ అఖిల భారత జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేసే విద్యార్థి సంఘం ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర కార్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేశామన్నారు. విద్యార్థి లోకానికి స్ఫూర్తినిచ్చే విధంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ అఖిల భారత సంఘటన్ మంత్రి ఆశిష్ చౌహాన్‌జీ, శ్రీశైలం గుడి చైర్మన్ రమేష్ నాయుడు, భానుప్రకాష్, అడ్డూర్ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని వృద్ధుడి ఆత్మహత్య

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందిన సంఘటన గవర్నరుపేటలో శుక్రవారం జరిగింది. గవర్నరుపేట బైరెడ్డి రామన్న వీధిలో ఉండే పి.రామ్‌ప్రసాద్‌కు ఆయన ఇంటి పక్కన ఉన్న మరో భవనంలోని రూమ్‌లను బ్యాచిలర్స్‌కు అద్దెకు ఇస్తుంటాడు. బిల్డింగ్ మొదటి అంతస్తు ఎఫ్‌బి-5 రూమ్‌లో మూడు సంవత్సరాల నుంచి పెరుమత్స వెంకటేశ్వరరావు (64) అద్దెకు ఉంటూ ప్రతినెలా రూ.3 వేలు అద్దె ఇస్తున్నాడు. వెంకటేశ్వరరావు బకింగ్‌హోమ్ పోస్టాఫీసు రోడ్డులో నిమ్మకాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని రెండు నెలల నుంచి వ్యాపారం చేయకుండా రూమ్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 2.45 గంటలకు వెంకటేశ్వరరావు ఉంటున్న రూమ్ నుంచి పొగ వస్తుందని పక్క రూమ్‌లో ఉన్న సిహెచ్.రామారావు బిల్డింగ్ యజమాని రామ్‌ప్రసాద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో రామ్‌ప్రసాద్ వెంకటేశ్వరరావు రూమ్ వద్దకు వచ్చి చూడగా దట్టంగా పొగలు వ్యాపించి ఉన్నాయి. రాంప్రసాద్ తలుపుకొట్టినప్పటికీ ఎలాంటి సమాధానం లేకపోవటంతో పక్కనే ఉన్న ఐరన్ పైపుతో వెంకటేశ్వరరావు రూమ్ గడియను పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా వెంకటేశ్వరరావు శరీరం సగం కాలిపోయి కింద పడి ఉన్నాడు. రామ్‌ప్రసాద్ బాత్రూమ్‌లో ఉన్న బక్కెట్‌తో నీళ్లు తీసుకు వచ్చి మంటలను ఆర్పివేశాడు. వెంకటేశ్వరరావు మృతదేహం పక్కన సగం కిరోసిన్ క్యాన్ ఉంది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామ్‌ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వరరావుకు కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని రామ్‌ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అశోక్ లేల్యాండ్‌లో ఉద్యోగాల పేరిట బురిడీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) :మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోని అశోక్ లేల్యాండ్ కంపెనీలో ఉద్యోగాలు భర్తీ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో నిరుద్యోగ యువత మోసపోతున్నారు. సోషల్ మీడియా ప్రకటనలో సూచించిన సెల్ నెంబరుకు కాల్ చేయగానే కంపెనీ హెచ్‌ఆర్‌ని మాట్లాడుతున్నానంటూ ఓ మహిళ ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్లు జిరాక్సు కాపీలతో బెంగళూరులోని కార్యాలయానికి ఇంటర్వ్యూకు హాజరు కావాలని, ఇన్సూరెన్సు ప్రీమియంగా రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుందని, ప్లేస్‌మెంట్ అశోక్ లేల్యాండ్ బెంగళూరు, హైదరాబాద్, మల్లవల్లి బ్రాంచిల్లో ఎంచుకుంటే అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తామంటూ నమ్మబలికి మోసం చేస్తోంది. తేలప్రోలు గ్రామానికి చెందిన టీఎస్‌కె.రెడ్డి సోషల్ మీడియా ప్రకటనతో బెంగళూరు వెళ్లి దరఖాస్తు చేయడానికి సిద్ధపడి మిత్రులు హెచ్చరించడంతో విరమించుకున్నాడు. మల్లవల్లి అశోక్‌లేల్యాండ్ కంపెనీ యాజమాన్య ప్రతినిధుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్లగా ఎటువంటి నియామకాలు జరపడం లేదని, అనేక మంది నిరుద్యోగ యువకులు బెంగుళూరు వెళ్లి ఫేక్ లెటర్‌లతో వచ్చి మోసపోతున్నారని కంపెనీ యాజమాన్య ప్రతినిధులు వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ కంపెనీల ప్రకటనలకు యువత మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

జీవితంలో ఘటనలే నా స్వరాలు

● ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : "నిజజీవితంలో జరిగిన ఘటనలు, పరిణామాలే నా స్వరాలు. వాటినే నేను స్వరాలుగా మార్చాను" అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరగబోయే మ్యూజికల్ కన్సర్ట్ సంబంధించి ఓ ప్రైవేట్ హోటల్లో శుక్రవారం మీడియాతో ముచ్చటించారు. తాను స్వరపరిచిన గీతాలను వింటున్నప్పుడు చాలా మంది సంగీత ప్రియులు తమ జీవితాల్లో జరిగిన ఘటనలను గుర్తుకు చేసుకుంటారన్నారు.

కళ్ల ముందు కనిపించిన ప్రతి పరిణామాన్ని ఒక స్వరంగా మార్చానని అన్నారు. సినిమా పాటలకు స్వరాలను సమకూర్చేటప్పుడు గాయకులు, ఆర్కెస్ట్రా అంతా కలిసి ప్రాక్టీస్ చేసేవాళ్లమన్నారు. ఏ వాయిద్య కారుడు ఎప్పుడు వాయించాలో నోట్స్ రాసి ఇచ్చేవాడినని తెలిపారు.

రికార్డింగ్ సమయంలో ఎక్కడ చిన్న తప్పు దొర్లిన రీ రికార్డింగ్ చేసేవాళ్లమన్నారు. పాట కచ్చితంగా తప్పులు లేకుండా వచ్చినప్పుడే దాన్ని విడుదల చేసేవాళ్లమన్నారు. ప్రస్తుతం ఉన్న సంగీత దర్శకుల్లో చాలామంది తాము ఇళయరాజా అంతటి స్థాయికి వెళ్లాలని అనుకుంటున్నారంటే అది దేవుడిచ్చిన వరంగా పేర్కొన్నారు. ఆ రోజుల్లో రికార్డింగ్ చేసేటప్పుడు ఎన్ని గంటలకు రికార్డింగ్ చేశాం, ఎక్కడ చేశాం, ఎవరెవరు పాటలు పాడారు, ఆర్కెస్ట్రా ఎవరు అన్న విషయాలను తెలియజేసే వాళ్లమని వివరించారు. ఇప్పుడు పాట రాస్తున్న వారు ఎవరు పాడతారో వారికి తెలియడం లేదని. పాడేవారు ఆర్కెస్ట్రాకు తెలియడం లేదని, ఆర్కెస్ట్రా ఎవరో దర్శకులకు తెలియడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

గాయనీ గాయకులు ఒకరికొకరు తెలియని పరిస్థితి ఇప్పుడు ఉందన్నారు. మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్న ట్రెండ్ సెటర్స్ లైవ్ అధినేత సుధాకర్ మాట్లాడుతూ విజయవాడలో మొదటిసారిగా ఇళయరాజా మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశామన్నారు.



పునాదిపాడులో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం : కలెక్టర్ బాలాజీ

కంకిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాను తమను నట్టేట ముంచిందని రైతులు కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకున్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని టువంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని తప్పకుండా ఆదుకుంటామన్నారు. రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జ్యోతి, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ భవన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

చరిత్రహీనుడు జోగి రమేశ్ : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రజల పార్టీ కాదని, మద్యం మాఫియా పార్టీ అని, మద్యం కుంభకోణంలో వైసీపీ పెద్దలెందరో బయటపడుతున్నారని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ పాత్ర బట్టబయలైందన్నారు. కల్తీ మద్యం కేసు నుంచి కులం కార్డుతో బయటపడాలని చూసిన జోగి రమేశ్ పప్పులు ఉడకలేదన్నారు. చరిత్ర హీనులకు గౌడ సమాజం అండగా ఉండదన్నారు. కల్తీమద్యం కుంభకోణం జరుగుతుంటే వైసీపీ పెద్దల అండదండలు లేకుండా ఎలా ఉంటాయన్నారు. జోగి రమేశ్‌ను సమర్థించే వైసీపీ నాయకులకు సిగ్గు ఉండాలన్నారు. బత్తిన దాసు, వంకా వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సీతారామయ్య, వేముల కృష్ణారావు పాల్గొన్నారు.

కల్తీ మద్యం దోషుల ఆస్తులు జప్తు చేయాలి : కొలికపూడి

తిరువూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో దోషుల ఆస్తుల్ని జప్తు చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జోగి రమేష్ కల్తీ మద్యం అమ్మకాలు చేసి ఎంతో మంది మృతికి కారణమయ్యాడని ఆరోపించారు. జోగి బినామీలందరూ కటకటాల పాలవుతున్నారన్నారు. కల్తీ మద్యం కేసులో అరెస్టులే కాకుండా దోషుల ఆస్తుల్ని జప్తు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్‌రెడ్డి కుట్ర : దేవినేని ఉమా

గొల్లపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్మోహన్ రెడ్డి విద్వేషపూరిత కుట్రకు తెరలేపుతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ, విదేశాల నుంచి పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఆసక్తి చూపిస్తుంటే, జగన్‌రెడ్డి ద్వేషపూరిత వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రముఖ విద్యాసంస్థలతో ఆర్‌టీఐహెచ్ ఎంవోయూలు

కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నవ్య ఆవిష్కరణలను, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (విజయవాడ) ప్రముఖ విద్యాసంస్థలు, కళాశాలలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొంటున్నట్లు జేసీ ఎస్.ఇలక్కియా తెలిపారు. ఆర్‌టీఐహెచ్ విజయవాడ స్పోక్, వివిధ కళాశాలల మధ్య అవగాహన ఒప్పందాలు శుక్రవారం కుదిరాయి. మంచి ఆలోచనలకు కార్యరూపమిచ్చి కొత్త పరిశ్రమల స్థాపన దిశగా యువతను నడిపించేందుకు ఆర్‌టీఐహెచ్ కృషిచేస్తోందన్నారు లయోలా, ధనేకుల, ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌టీఐహెచ్ ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు జేసీ ఇలక్కియా వివరించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 8 నవంబరు 2025

వంటిల్లు



చాలామంది డ్రాగన్ ఫ్రూట్‌ను ఇష్టంగా తింటూ ఉంటారు. ఈ పండు కమ్మగా కొద్దిపాటి తియ్యదనంతో ఉంటుంది. దీంతో సలాడ్స్, మిల్క్‌షేక్‌లు, జామ్‌లు, స్మూతీలు తయారుచేస్తూ ఉంటారు. ఎన్నో ఔషధ గుణాలతో నిండిన డ్రాగన్ ఫ్రూట్‌ను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

డ్రాగన్ ఫ్రూట్‌తో కొత్తగా...

డ్రాగన్ ఫ్రూట్ కేక్

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, కోడిగుడ్లు- మూడు, పాలు- అర కప్పు, నూనె- అర కప్పు, మైదా- ఒక కప్పు, బేకింగ్ పౌడర్- ఒక చెంచా, పంచదార పొడి- అర కప్పు, మిల్క్ చాక్లెట్- పెద్దది ఒకటి, ఫ్రెష్ క్రీమ్- రెండు చెంచాలు, చాకో చిప్స్- కొన్ని

తయారీ విధానం



- బ్లెండర్‌లో కోడిగుడ్ల సొనలు, డ్రాగన్ ఫ్రూట్ ముక్కలు వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. అందులో పాలు, నూనె వేసి బాగా కలపాలి. తరువాత మైదా, బేకింగ్ పౌడర్, పంచదార పొడి వేసి ఉండలు రాకుండా కలపాలి. కేక్ మౌల్డ్ లోపల కొద్దిగా నూనె రాయాలి. అందులో డ్రాగన్ ఫ్రూట్ మిశ్రమాన్ని వేయాలి. తరువాత ఈ మౌల్డ్‌ను స్టీమర్‌లో ఉంచి నలభై నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించాలి. ఆపైన కేక్‌ను పళ్లెంలోకి తీసి చల్లార్చాలి.
- ఒక గిన్నెలో మిల్క్ చాక్లెట్ ముక్కలు, ఫ్రెష్ క్రీమ్ వేసి వేడి నీళ్ల గిన్నెలో పావుగంట సేపు ఉంచాలి. చాక్లెట్ పూర్తిగా కరిగిన తరువాత ఆ మిశ్రమాన్ని బాగా కలపాలి. తెల్లగా మెరిసే ఈ చాక్లెట్ మిశ్రమాన్ని కేక్ మీద పరచాలి. పైన చాకో చిప్స్ చల్లాలి. అంతే డ్రాగన్ ఫ్రూట్ కేక్ రెడీ! ఈ కేక్‌ను గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచి సర్వ్ చేసుకోవాలి.

డ్రాగన్ ఫ్రూట్ ఫ్రైడ్ రైస్

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, అన్నం- రెండు కప్పులు, ఉల్లిపాయలు- రెండు, బీన్స్- నాలుగు, పచ్చి బఠాణీలు- కొన్ని, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఉల్లికాడలు- రెండు, పచ్చిమిర్చి- నాలుగు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- రెండు, మిరియాల పొడి- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం



స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. తరువాత అందులో దాల్చిన చెక్క, లవంగాలు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, పచ్చి బఠాణీలు, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, బీన్స్ ముక్కలు, ఉల్లికాడల ముక్కలు వేసి దోరగా వేయించాలి. ఆపైన అన్నం, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. చివరగా డ్రాగన్‌ఫ్రూట్ ముక్కలు వేసి కలిపి దించాలి. ఇలా తయారుచేసిన డ్రాగన్ ఫ్రూట్ ఫ్రైడ్ రైస్‌ని వేడి వేడిగా తింటే రుచిగా ఉంటుంది.

డ్రాగన్‌ఫ్రూట్ సార్బెట్



కావాల్సిన పదార్థాలు

పండిన డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, స్ట్రాబెర్రీలు- నాలుగు, తేనె- నాలుగు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు

తయారీ విధానం

ముందుగా డ్రాగన్ ఫ్రూట్ ముక్కలను జిప్‌లాక్ కవర్లో వేసి రాత్రంతా ఫ్రీజర్లో ఉంచాలి. ఉదయాన్నే బ్లెండర్‌లో డ్రాగన్‌ఫ్రూట్ ముక్కలు, స్ట్రాబెర్రీ ముక్కలు, తేనె, నిమ్మరసం వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక మౌల్డ్‌లో పరిచి ఒక పూటంతా ఫ్రీజర్లో ఉంచాలి. తరువాత ఈ డ్రాగన్‌ఫ్రూట్ సార్బెట్‌ను అందమైన బౌల్స్‌లోకి తీసి సర్వ్ చేసుకోవాలి.

డ్రాగన్ ఫ్రూట్ సల్సా

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- రెండు, నిమ్మకాయ- ఒకటి, కొత్తిమీర తరుగు- కొద్దిగా, ఉప్పు- చిటికెడు, మిరియాల పొడి- చిటికెడు

తయారీ విధానం



డ్రాగన్ ఫ్రూట్ పైన ఉన్న తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చిలను కూడా వీలైనంత చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కొత్తిమీరను శుభ్రం చేసి సన్నగా తరగాలి. వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో డ్రాగన్ ఫ్రూట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం వేసి చెంచాతో బాగా కలపాలి. ఇష్టమైతే అందులో దానిమ్మ గింజలు, పండిన బొప్పాయి ముక్కలు, పైనాపిల్ ముక్కలు కూడా కలుపుకోవచ్చు. ఈ డ్రాగన్ ఫ్రూట్ సల్సాను చిప్స్, క్రాకర్స్, గ్రిల్డ్ ఫిష్ లేదా చికెన్‌తో సర్వ్ చేసుకోవాలి.

భోజన కుతూహలం

కొమ్ముపొట్లను ఆదరించండి!

కొమ్ముపొట్లకాయలు ఆకుపచ్చగా, తెల్లచారలతో మెరుస్తూ దొండకాయలా అనిపిస్తాయి. 'పేరులో 'పొట్ల' ఉన్నా ఇది పొట్లకాయ కుటుంబానికి చెందినది కాదు; ఆకారం దొండలా ఉన్నా ఇది దొండకాయ కుటుంబానికి చెందినదీ కాదు. గుమ్మడి కుటుంబానికి చెందిన మొక్క. పైన తొక్క గట్టిగా ఉంటుంది. తొక్కను తీసి, దొండకాయల మాదిరిగా తరిగి వండుతారు. రెండు అంచులా మొనదేలిన రూపం వలన దీనిని ఆంగ్లంలో 'పాయింటెడ్ గోర్డ్' అని పిలుస్తారు. ఇది దక్షిణాదిలో తక్కువగా, ఉత్తరాదిలో ఎక్కువగా పండుతుంది. ఉత్తరాదిన దీన్ని 'పర్వల్' అని పిలుస్తారు. మన ఆయుర్వేద గ్రంథాల్లో దీని విశిష్టతలను వివరించారు.

- పర్వల్ మన జీర్ణవ్యవస్థను బలపరిచి పైత్యాన్ని తగ్గిస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. చరకుడు దీనిని 'శాంతకారిణి ఔషధ కూరగాయ'గా పేర్కొన్నాడు.'చరక సంహిత' ప్రకారం ఇది తృప్తిఘ్న (కొంచెం తినగానే కడుపునిండిపోయేలా ఉండటాన్ని తగ్గిస్తుంది), తృష్ణానియంత్రక (దప్పికను తగ్గిస్తుంది) గుణాలు కలిగి ఉంటుంది. వేడి వల్ల కలిగే చర్మమంటలు, చేతుల కాలిన భావనలకు ఉపశమనం ఇస్తుంది.
- 'భోజనకుతూహలం' గ్రంథంలో పర్వల్ వల్ల కలిగే ప్రయోజనాలను పేర్కొన్నారు. వాటి ప్రకారం- ఇది జ్వరాలను తగ్గిస్తుంది. బలం, పుష్టి, సంతృప్తి, ఆనందం అన్నింటినీ కలిగిస్తుంది.
- పర్వల్‌లో విటమిన్ ఏ, ఇ, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం లాంటివి సమృద్ధిగా ఉంటాయి. దీనిలో తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది మధుమేహం, స్థూలకాయం ఉన్నవారికి మేలు చేస్తుంది.
- పర్వల్‌ను దొండకాయల మాదిరిగా వండుకోవచ్చు. ఇది ప్రధానంగా జీర్ణకోశ అవయవాల బలవృద్ధికి సహాయపడుతుంది. బలహీన జీర్ణక్రియ, లివర్, పాంక్రియాజ్ సమస్యలున్న వారికి ఇది ఉపకరిస్తుంది.
- పర్వల్ పండ్లను గుజ్జుగా చేసి చర్మమంటలపై రాస్తే చల్లదనం కలుగుతుంది. ఆకుల రసం చర్మవ్యాధులకు, వేరుతో కషాయం ఉదర వ్యాధులకు, పండ్ల కషాయం జ్వర నివారణకు ఉపయోగిస్తారు.
- పర్వల్‌ను క్రమం తప్పకుండా తింటే చర్మం నున్నగా అవుతుంది. మెరుపు వస్తుంది.



• గంగరాజు అరుణాదేవి

అందం- ఇలా సొంతం

సౌందర్య సాధనాలను ఎంచుకోవడంతో పాటు, వాటిని ఉపయోగించే విధానం పట్ల కూడా అవగాహన కలిగి ఉండడం అవసరం. అందుకు తోడ్పడే చిట్కాలు ఇవే!

లిప్‌స్టిక్: పెదవులు పొడిబారకుండా ఉండడం కోసం, గీతలు పడకుండా ఉండడం కోసం మాయిశ్చరైజింగ్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. లిప్‌లైనర్‌తో ఔట్‌లైన్ గీసుకోవడం అందరికీ తెలిసిందే! అయితే అందు కోసం ఉపయోగించే లైనర్, లిప్‌స్టిక్ కంటే ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి.

ఐ బ్రో పెన్సిల్: కనుబొమలకు నలుపు రంగు ఐ బ్రో పెన్సిల్‌కు బదులుగా డార్క్ బ్రౌన్, డల్ బ్లాక్ పెన్సిల్ వాడాలి. అప్పుడు కనుబొమలు సహజంగా కనిపిస్తాయి.

ఐ లైనర్: కనురెప్పల మీద వేసుకునే ఐలైనర్ వాటర్‌ప్రూఫ్ అయి ఉండాలి. ఐలైనర్ వేసుకునే పద్ధతిని ప్రాక్టీస్ చేసుకుంటే, తక్కువ సమయంలోనే కళ్లను తీర్చిదిద్దుకోవచ్చు.

గ్లిట్టర్: నైట్ మేకప్‌లో గ్లిట్టర్ ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెడుతుంది. అయితే అందుకోసం గ్లిట్టర్‌ను పరిమితంగా వాడుకోవాలి. కనురెప్పలు, చెంపలకు తగుమాత్రంగా అద్దుకోవాలి.

టోనర్: చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.

మాయిశ్చరైజర్: మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.

ప్రైమర్: చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మరంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.

ఫౌండేషన్: స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.

కన్‌సీలర్: చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.

కాంటూర్: దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.

బ్లష్: చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

మేకప్



అభిరుచి

ముంబయి డీవై పాటిల్ స్టేడియం... భారత్- దక్షిణాఫ్రికా మధ్య మహిళల ప్రపంచ కప్ అంతిమ సమరం... ఇన్నింగ్స్ 46వ ఓవర్. దీప్తి శర్మ వేసిన ఫుల్‌టాస్ బంతిని గాల్లోకి లేపింది నడైన్ డిక్లెర్క్. కవర్స్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మెరుపు వేగంతో వెనక్కి పరుగెడుతూ బంతిని అందుకుంది. ఒక్కసారిగా మైదానంలో జయ జయ ధ్వానాలు మిన్నంటాయి. భారత క్రీడాకారుల ముఖాలు భావోద్వేగాలతో నిండిపోయాయి. ఆలింగనాలు... ఆనందబాష్పాలు... కేరింతలు... నృత్యాలు... ఎన్నో ఏళ్ల వారి దీక్షకు, పట్టుదలకు, అలుపెరుగని పరిశ్రమకు దక్కిన ఫలితం. ఇది కేవలం ఒక విజయం మాత్రమే కాదు... కలలను ఛేదించడం... వాటిని నెరవేర్చుకోవడం. భారతదేశం తొలిసారిగా మహిళల ప్రపంచ కప్‌ను సాధించిన నేపథ్యంలో... కోట్లాదిమంది గుండెలు గర్వంతో ఉప్పొంగిన క్షణం.

ఈ గెలుపులో ఎవరికి వారే ప్రత్యేకం. సమష్టి కృషితో... అచంచలమైన ఆత్మవిశ్వాసంతో హర్మన్‌ప్రీత్ జట్టును నడిపించిన తీరు అత్యద్భుతం. వీరిని చూస్తుంటే 'లగాన్' చిత్రంలో ఆమిర్‌ఖాన్ జట్టు గుర్తుకువస్తుందనేది క్రికెట్ పండితుల మాట. భిన్న నేపథ్యాలు... ఒకరికీ ఒకరికీ సంబంధంలేని పరిస్థితులు. కానీ అందరిదీ ఒకటే కల... ఒకటే శ్వాస... క్రికెట్. ఆటలో దేశానికి ప్రాతినిధ్యం వహించడం... దశాబ్దాలుగా ఊరిస్తున్న ప్రపంచ కప్‌ను సాధించడం. షఫాలీవర్మ ఉత్సాహం... స్మృతి మంధాన ప్రశాంత చిత్తం... జమీమా రోడ్రిగ్స్ పోరాడే తత్వం... దీప్తిశర్మ శ్రమ... శ్రీచరణి ఆత్మస్థైర్యం... క్లిష్ట పరిస్థితుల్లో ముందుండి నడిపించగల హర్మన్‌ప్రీత్ సామర్థ్యం... ఇవే నేడు భారత్‌ను జగజ్జేతగా నిలబెట్టాయి. క్రికెట్ సరే... మరి మన స్టార్లు మైదానం విడిచాక ఏంచేస్తారు? తెలుసుకోవాలని ఉందా..! అయితే రండి... ఆటను ఆస్వాదిస్తూనే తమ అభిరుచులకు పట్టం కడుతున్నవారిపై ఓ లుక్కేద్దాం.



ఆటలోనే కాదు

హర్మన్‌ప్రీత్ కౌర్



భారత మహిళల జట్టుకు సారథ్యం వహిస్తున్న హర్మన్‌ప్రీత్... ఎన్నో అవరోధాలు, కట్టుబాట్లను దాటి క్రికెట్ బ్యాట్ పట్టింది. ఆరంభంలో ఆమె తల్లి కూడా వంట నేర్చుకొని ఇంట్లో కూర్చోమని సలహా ఇచ్చారు. ఆ మాటలు హర్మన్‌లో మరింత పట్టుదలను పెంచాయి. "అప్పుడు నేను చాలా చిన్నపిల్లను. ఇంటి దగ్గర అబ్బాయిలతో కలిసి ఆడుతుండేదాన్ని. అది చూసి ఒక రోజు అమ్మ... 'నువ్వు ఎప్పుడూ మగపిల్లలతోనే ఆడుతున్నావు. కెరీర్ గురించి నీకు ఏ మాత్రం ఆలోచన లేదు' అంది. అందరి ఆడపిల్లల్లాగా సల్వార్ కమీజ్ వేసుకొని, వంట నేర్చుకోమని సలహా ఇచ్చింది. 'నా జీవితం క్రికెట్‌తోనే' అని తేల్చిచెప్పాను. ఆనాటి నుంచి అమ్మ నన్ను మళ్లీ ఎప్పుడూ నన్ను ప్రశ్నించలేదు" అంటూ ఓ సందర్భంలో గుర్తు చేసుకున్న హర్మన్... 2017 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 171 పరుగుల ఇన్నింగ్స్ భారత మహిళ క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. క్రికెటర్లు కావాలనుకొనే ఎంతోమంది అమ్మాయిలకు ప్రేరణనిచ్చింది. కలల కప్‌ను ముద్దాడాక, ఆ ఆనందాన్ని, ఆ గర్వించే క్షణాన్నీ జీవితాంతం గుర్తుండిపోయేలా తాజాగా తన చేతిపై ప్రపంచ కప్ టాటూ వేసుకుంది హర్మన్. ఆ ఫొటోలను తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. గతంలో భారతీయ రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, పంజాబ్ పోలీసు శాఖలో డీఎస్పీగా గతంలో ఆమె బాధ్యతలు నిర్వర్తించింది. అయితే విద్యార్హతల విషయం వివాదాస్పదం కావడంతో డీఎస్పీగా ఆమె నియామకాన్ని పంజాబ్ పోలీస్ వెనక్కు తీసుకుంది. వివాదం సమసిపోయాక తిరిగి ఉద్యోగం ఇచ్చింది. ఎన్నో బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్న హర్మన్‌కు సంగీతం అంటే ప్రాణం.

స్మృతి మంధాన



క్రికెట్ తరువాత స్మృతికి అత్యంత ఇష్టమైనది బీజీఎంఐ (బాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా) ఆడటం. ఇది తనకు ఒత్తిడి నుంచి ఉపశమనం ఇచ్చే సాధనమని పలు సందర్భాల్లో చెప్పింది. గేమర్‌గా కూడా మంచి ఆదరణ సంపాదించుకున్న ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌వుమన్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ ఏ23కు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. స్మృతి మైదానంలో కనిపించలేదంటే... స్నేహితులతో కలిసి బీజీఎంఐలో మునిగిపోయిందని అర్థం. అంతలా ఆ గేమ్‌ను ప్రేమిస్తుంది. ఇక రకరకాల వంటలు ప్రయత్నించడం తన మరో అభిరుచి. పంజాబీ వంటకాలు నేర్చుకోవడానికి తరగతులకు కూడా వెళ్లింది. స్పైసీ పనీర్ టిక్కా మసాలా ఆమెకు నచ్చిన, బాగా వండే వంటకం. 'వంట చేయడం అంటే నాకు మైదానంలో అద్భుతమైన కవర్‌డ్రైవ్ కొట్టినంత ఆనందాన్ని ఇస్తుంది' అంటుంది స్మృతి. అంతేకాదు... ఆమెకు పర్యటనలన్నా చాలా ఇష్టం. స్విట్జర్లాండ్‌లోని ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలు, ఆస్ట్రేలియాలోని సుందర ప్రాంతాలు... ఎప్పుడూ కొత్త కొత్త పర్యాటక ప్రాంతాల్లో సేద తీరాలని కోరుకొంటుంది. బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలు విపరీతంగా చూస్తుంది.

జమీమా రోడ్రిగ్స్



క్రికెట్ గ్రౌండ్‌లో కొట్టే కళాత్మక స్ట్రోక్స్‌తోనే కాదు... గిటార్‌ను శృతి చేస్తూ... కమ్మని రాగంతోనూ కోట్ల మంది అభిమానులను సంపాదించుకుంది జమీమా. ఇన్‌స్టాలో తరచూ రీల్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తుంది. భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో... మెరుపు ఫీల్డింగ్‌తో మైదానంలో... తను ఎక్కడుంటే అక్కడ వాతావరణం ఉల్లాసంగా మారిపోతుంది. సమయం చిక్కినప్పుడల్లా స్టెప్పులేసి... జట్టు సభ్యుల్లోనే కాదు... స్టాండ్స్‌లో కూర్చున్న ప్రేక్షకులలోనూ ఉత్సాహం నింపుతుంది. తండ్రి మార్గదర్శకత్వంలో ఏడేళ్ల వయసులో క్రికెట్ బ్యాట్ పట్టిన జమీమా ముంబయిలోని బాంద్రాలో పుట్టి పెరిగింది. తమ మత విశ్వాసాలను అనుసరించే జమీమా సామాజిక మాధ్యమాల్లో ద్వేషాన్ని ఎదుర్కొంది. అయినా ఆట నుంచి మనస్సును పక్కకు పోనివ్వలేదు. కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు. ఎన్నో పునరాగమనాల తరువాత ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకుంది. ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్‌లో అజేయ సెంచరీ చేసి... రికార్డు స్కోరును ఛేదించడంలో కీలకమైంది. భారత్‌ను ఫైనల్స్‌కు చేర్చింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం ఉద్వేగానికి లోనైన జమీమా కన్నీటి పర్యంతమైంది. ఇన్‌స్టాలో ఈ స్టార్ బ్యాటర్‌కు దాదాపు మూడున్నర లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. అక్కడ తరచూ తన అభిరుచుల చిత్రాలు, రీల్స్‌ను పోస్ట్ చేస్తుంటుంది.

దీప్తి శర్మ



ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన దీప్తి... ఆల్‌రౌండ్ ప్రతిభతో జట్టు గెలుపులో అత్యంత కీలక పాత్ర పోషించింది. అన్నయ్య సుమిత్ ఆటను చూస్తూ పెరిగిన ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది ఒక త్రో. అన్నయ్య శిక్షణ తీసుకొంటుండగా... తనవద్ద పడివున్న ఓ బంతిని నేరుగా కోచ్ చేతుల్లోకి విసిరింది దీప్తి. అది భారత మాజీ బ్యాటర్ హేమలత కాలా దృష్టిని ఆకర్షించింది. ఆ రోజు నుంచి సుమిత్ చెల్లి కోసం తన ఆటను, ఉద్యోగాన్ని త్యాగం చేశాడు. 'దీప్తి ఆడుతుంటే దేశం తరుపున నేనూ ఆడినట్టే' అంటూ ఓసారి అతను చెప్పాడు. అన్నయ్య నేతృత్వంలో, తల్లి ప్రోత్సాహంతో దీప్తి అంచెలంచెలుగా ఎదిగింది.

ఆగ్రాకు నుంచి వచ్చిన ఈ ఆల్‌రౌండర్ ప్రస్తుతం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గానూ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. సంగీతం వినడం, పుస్తకాలు చదవడం ఆమెకు బాగా నచ్చిన అంశాలు. బెంగాల్‌కు ఆడుతున్న సమయంలో తన సహచరుల ద్వారా బంగ్లా మాట్లాడటం నేర్చుకుంది. గార్డెనింగ్‌తో పాటు ఇంటిని అందంగా అలంకరించడం ఆమె మరికొన్ని అభిరుచులు.

ప్రతీక రావల్



ఢిల్లీలో పుట్టి పెరిగిన ప్రతీక... క్రికెట్‌లోనే కాదు, చదువులోనూ టాపే. ఆమె తండ్రి ప్రవీణ్ రావల్ బీసీసీఐ అంపైర్. ఆమె తల్లి గృహిణి. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతీకను తల్లితండ్రులు ప్రోత్సహించారు. బడి రోజుల్లో ఆమె బాస్కెట్‌బాల్ ఆడేది. 2019 జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఢిల్లీ తరుపున స్వర్ణ పతకం కూడా సాధించింది. తరువాత క్రికెట్ వైపు మళ్లింది. పన్నెండో తరగతిలో 92.5 శాతం మార్కులు సంపాదించిన ఆమె, సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసింది. "ఆటను అవగాహన చేసుకోవడానికి, మానసికంగా దృఢంగా ఉండటానికి, విశ్లేషణాత్మకంగా ఆలోచించడానికి నేను చదివిన మనస్తత్వ శాస్త్రం అవకాశం కల్పించింది" అని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ప్రతీక... ఆట లేనప్పుడు కుటుంబంతో కలిసి సమయాన్ని గడుపుతుంది.

హర్లీన్ దేవల్



క్రికెట్‌లోకి రాకముందు హర్లీన్ రకరకాల క్రీడా పోటీల్లో పాల్గొంది. చిన్నప్పుడు హాకీ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర గేమ్స్ ఆడింది. డ్యాన్సింగ్, ట్రావెలింగ్, షాపింగ్‌తో పాటు సినిమాలు చూడటం ఆమె అభిరుచులు. విభిన్న సంస్కృతులతో మమేకం కావడం ఎంతో ఇష్టం. అలాగే ఖాళీ సమయాల్లో ఫుట్‌బాల్ ఆడుతుంది. ఒకవేళ క్రికెటర్‌ను కాకపోయివుంటే పైలెట్‌గా స్థిరపడాలని కోరుకున్నట్టు హర్లీన్ ఓ సందర్భంలో వెల్లడించింది.

రాధా యాదవ్/ శ్రీచరణి



ఇరుకైన ముంబయి వీధుల్లో అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడిన రాధా యాదవ్‌కు ఆట తప్ప మరో ధ్యాస లేదు. తన జీవితాన్ని మలుపు తిప్పిన క్రికెట్టే ఆమెకు జీవితం. ఇక తెలుగు అమ్మాయి శ్రీచరణికి కూడా హర్లీన్‌లానే క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లో కూడా ప్రవేశం ఉంది. చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్, ఖోఖో ఆడింది. అయితే చివరకు క్రికెట్‌ను తన కెరీర్‌గా ఎంచుకుంది.



సీఎం చంద్రబాబును కలిసిన క్రికెటర్లు శ్రీచరణి, మిథాలి రాజ్‌లతో మంత్రి లోకేశ్ సెల్ఫీ

శ్రీచరణికి రూ. 2.5 కోట్లు

- వెయ్యి చదరపు గజాల స్థలం
- గ్రూప్-1 ఉద్యోగం కూడా..
- రాష్ట్ర ప్రభుత్వ నజరానా

అమరావతి (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటి.. భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించిన తెలుగుతేజం శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెకు రూ.2.5 కోట్ల భారీ నజరానా ప్రకటించారు. దీంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చదరపు గజాల స్థలం కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఆమెకు గ్రూప్-1 ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను శ్రీచరణి మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచకప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను వారితో పంచుకుంది. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా శ్రీచరణి భారత క్రికెటర్లు సంతకాలు చేసిన టీషర్ట్‌ను సీఎంకు అందించింది. ఆమెతో పాటు మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ కూడా సీఎంతో భేటీ అయింది. అంతకు ముందు గన్నవరం విమానాశ్రయంలో శ్రీచరణికి మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీశ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు స్వాగతం పలికారు. సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి లోకేశ్ శ్రీచరణికి స్వాగతం పలికారు.

కడపలో అపూర్వ స్వాగతం

మహిళా ప్రపంచ కప్ గెలుపొందడంలో కీలక భూమిక పోషించిన నల్లపురెడ్డి శ్రీచరణికి సొంతగడ్డ కడపలో జనం అపూర్వ స్వాగతం పలికారు. హెడ్ పోస్టాఫీస్ సర్కిల్ నుంచి వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులు రేణుక, చంద్రశేఖర్‌రెడ్డి, మామ కిశోర్‌రెడ్డిలను గుర్రపు బండిపై ఊరేగించారు. అక్కడి నుంచి కారులో స్టేడియం వద్దకు చేరుకున్నారు. బాణసంచా పేల్చుతూ, పూలవర్షం కురిపిస్తూ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.



గాబాలోనూ మురిపిస్తారా?



కెప్టెన్లు మార్ష్, సూర్య

సిరీస్‌కు విజయం దూరంలో భారత్

మధ్యాహ్నం 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ దక్కించుకునేందుకు టీమిండియా మరో విజయం దూరంలోనే ఉంది. శనివారం ఇరు జట్ల మధ్య జరిగే ఆఖరి మ్యాచ్‌కు ప్రఖ్యాత గాబా మైదానం వేదిక కానుంది. ఇప్పటికే సూర్య సేన 2-1తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే. అయితే విదేశీ గడ్డపై మరో సిరీస్ సాధించాలనుకుంటున్న భారత్ ముందుగా తమ బ్యాటింగ్ పటిష్టతపై దృష్టి సారించాల్సి ఉంది. అటు ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టు భారత స్పిన్నర్లను ఎదుర్కోలేక వరుసగా రెండు మ్యాచ్‌లను ఓడాల్సి వచ్చింది. నేటి కీలక పోరులో ఈ బలహీనతను అధిగమించకుంటే కంగారూలు హ్యాట్రిక్ ఓటమితో సిరీస్ కోల్పోక తప్పదు. టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు ఇరు జట్ల మధ్య ఇదే చివరి మ్యాచ్. మరోవైపు గాబాలో ఆసీస్‌కు అద్భుత రికార్డే ఉంది. ఇక్కడ ఆడిన ఎనిమిది టీ20ల్లో ఆ జట్టు ఒక్కసారే ఓడడం గమనార్హం.

మిడిలార్డర్ కుదురుకుంటే..: భారత జట్టు బ్యాటింగ్ లైనప్ కాగితంపై పటిష్టంగానే కనిపిస్తోంది. కానీ ఇప్పటిదాకా సిరీస్‌లో సమష్టిగా రాణించిన సందర్భం లేదు. గోల్డ్‌కోస్ట్ మ్యాచ్‌లో గిల్ తొలిసారిగా ఆకట్టుకున్నాడు. అయితే 121/2తో మెరుగ్గా కనిపించిన జట్టు 15 పరుగుల తేడాతో చివరి నాలుగు వికెట్లు కోల్పోవడం ఆందోళనకరం. అభిషేక్ ఒక్కడే అంచనాలను అందుకుంటున్నాడు. సూర్యకుమార్ బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. మిడిలార్డర్‌లో తిలక్ 0, 29, 5 స్కోర్లతో నిరాశపరిచాడు. కీపర్ జితేశ్ రెండు మ్యాచ్‌లాడినా ప్రభావం చూపలేకపోయాడు. దూబే బ్యాటింగ్‌లో నిలకడ లోపించింది. లోయరార్డర్‌లో ఆల్‌రౌండర్లు అక్షర్, సుందర్ పరుగులు రాబడుతున్నారు. అయితే బౌలర్లు జట్టుకు అండగా నిలుస్తుండడం సానుకూలాంశం కానుంది. పేసర్ అర్ష్‌దీప్ టీమ్ మేనేజ్‌మెంట్ సంతృప్తి చెందేలా రాణిస్తున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు వరుణ్, అక్షర్, సుందర్ జట్టుకు కొండంత అండగా ఉన్నారు. కానీ గాబా పిచ్‌పై వీరు ఏమేరకు రాణించగలరో చూడాల్సిందే. అటు దూబే కీలక సమయాల్లో వికెట్లు తీయగలుగుతున్నాడు. సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో తమ లోపాలను సరిదిద్దుకుని భారత జట్టు విజయంతో ఈ టూర్‌ను ముగించాలనుకుంటోంది.

స్పిన్‌తో సవాల్: ఆతిథ్య ఆసీస్ జట్టు తమకు అలవాటైన పిచ్‌లపై సమర్థంగా ఆడలేకపోతోంది. నాలుగో టీ20లో భారత స్పిన్నర్లను ఎదుర్కోలేక మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అందుకే భారత స్పిన్ త్రయానికి ఆసీస్ ఆరు వికెట్లు సమర్పించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ మార్ష్, స్టొయినిస్, డేవిడ్‌లపైనే ఆధారపడి ఉంది. మ్యాక్స్‌వెల్ ఫామ్ లేమి గత మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఓపెనర్ హెడ్ అందుబాటులో లేకపోవడం వీరిని దెబ్బతీసింది. శనివారం మ్యాచ్‌లో మ్యాక్సీతో పాటు ఇన్‌గ్లిస్ సత్తా చూపితేనే ఫలితం ఉంటుంది. స్టార్ పేసర్ హాజెల్‌వుడ్ లేకపోవడంతో బౌలింగ్ బలహీనంగా మారింది. పేసర్ ఎలిస్, స్పిన్నర్ జంపా కీలకంగా మారారు. పేసర్ డ్వార్షుస్ స్థానంలో మహ్లి బియర్డ్‌మన్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

సమం చేసేందుకు ఆసీస్ ఆరాటం

నేడు ఇరు జట్ల మధ్య ఐదో టీ20

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, దూబే, అక్షర్, సుందర్, జితేశ్, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: మార్ష్ (కెప్టెన్), షార్ట్, ఇన్‌గ్లిస్, మ్యాక్స్‌వెల్, డేవిడ్, స్టొయినిస్, ఓవెన్/ఫిలిప్, ఎలిస్, బార్ట్‌లెట్, జంపా, బియర్డ్‌మన్.

పిచ్, వాతావరణం

గాబా పిచ్ సహజంగా పేస్, బౌన్స్‌తో పేసర్లకు అనుకూలంగా ఉంటుంది. మరోవైపు బ్యాటర్లకు కూడా సహకరించనుంది. బిగ్‌బాష్ లీగ్‌లో ఇక్కడ భారీ స్కోర్లు నమోదయ్యాయి. అయితే ఈ మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

అంతర్జాతీయ కెరీర్ ముగిసింది



సునీల్ ఛెత్రి

న్యూఢిల్లీ: ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 ఫైనల్ రౌండ్ క్వాలిఫయర్స్ నుంచి భారత నిష్క్రమణతో తన అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రి స్పష్టం చేశాడు. గత ఏడాది జూన్‌లోనే అంతర్జాతీయ సాకర్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. అయితే భారత సాకర్ కొత్త ప్రధాన కోచ్ మనోలో మార్క్వెజ్ విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది ప్రారంభంలో ఛెత్రి ఆసియా కప్ క్వాలిఫయర్స్ కోసం తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. క్వాలిఫయర్స్‌లో భారత్‌ను ముందుకు తీసుకెళ్లడానికే తన నిర్ణయాన్ని మార్చుకున్నానని, అందులో టీమిండియా పోరాటం ముగియడంతో తన అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని చెప్పాడు. వచ్చే ఐఎస్ఎల్ సీజన్ తర్వాత ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ కెరీర్‌కు కూడా ఛెత్రి వీడ్కోలు పలుకుతాడని సమాచారం.

వచ్చేసారి పది జట్లు

2029 మహిళల వన్డే వరల్డ్ కప్

దుబాయ్: వచ్చేసారి..అంటే 2029లో జరిగే మహిళల వన్డే ప్రపంచ కప్‌లో జట్లను ప్రస్తుతమున్న 8 నుంచి 10 కి పెంచాలనీ ఐసీసీ నిర్ణయించింది. ఈమేరకు ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. ఐసీసీ అనుబంధ సభ్య దేశాల బోర్డులకు 2026 సంవత్సరంలో 10 శాతం మేర అదనంగా నిధులు అందజేయాలని తీర్మానించింది. 2027లో జరిగే ఆఫ్రికన్, పాన్ అమెరికన్ క్రీడల జాబితాలో క్రికెట్‌ను చేర్చాలని కూడా నిర్ణయించింది.

అర్జున్, హరికృష్ణ గెలుపు

పనాజీ: ఇరిగేసి అర్జున్, పెంటేల హరికృష్ణ చెస్ ప్రపంచకప్ మూడో రౌండ్ తొలి గేమ్‌లో విజయాలు నమోదు చేశారు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత అత్యధిక ఎలో రేటింగ్ గల అర్జున్ తెల్లపావులతో బరిలోకి దిగి 30 ఎత్తుల్లో వోఖిడోవ్ (ఉజ్బెకిస్థాన్)పై, హరికృష్ణ 25 ఎత్తుల్లో డానియెల్ (బెల్జియం)పై నెగ్గారు. గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ డ్రాతో సరిపెట్టుకున్నారు.

ఆసియాకప్ అప్పగింతపై కమిటీ

ఆసియాకప్‌ను భారత్‌కు అప్పగించే అంశాన్ని బీసీసీఐ ప్రతినిధులు శుక్రవారంనాటి ఐసీసీ సమావేశంలో లేవనెత్తినట్టు సమాచారం. పాక్‌కు చెందిన మొహిసిన్ నఖ్వీ కార్యాలయంలో ఉన్న ఆసియాకప్ ట్రోఫీని వీలైనంత త్వరగా భారత్‌కు అందించే అంశంపై ఓ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. అయితే నఖ్వీ ఈ సమావేశానికి డుమ్మా కొడతారని భావించగా, అనూహ్యంగా ఆయన హాజరయ్యారు.

మహిళల క్రికెట్ కమిటీలో మిథాలీ

ఐసీసీ మహిళల క్రికెట్ కమిటీకి భారత జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌ను ఎంపిక చేస్తూ ఐసీసీ మరో నిర్ణయం తీసుకుంది. మిథాలీతోపాటు ఆష్లే డిసిల్వా, అమోల్ మజుందార్, బెన్ సాయెర్, చార్లోటి ఎడ్వర్డ్స్, సాలా స్టెల్లాను కమిటీలోకి తీసుకుంది.

నో హ్యాండ్‌షేక్!

పాక్‌కు భారత్ నిరాకరణ
హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ

హాంకాంగ్: పాకిస్థాన్‌తో భారత క్రికెట్ జట్టు కరచాలనం చేయకపోవడమనే సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. దీనిని భారత వెటరన్ ఆటగాళ్లూ పాటించారు. హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో భాగంగా దినేశ్ కార్తీక్ కెప్టెన్సీలోని టీమిండియా శుక్రవారం పాకిస్థాన్‌తో తలపడింది. ఈ సందర్భంగా మ్యాచ్‌కు ముందు మన క్రికెటర్లు పాకిస్థాన్‌తో కరచాలనం చేయలేదు.

భారత్ గెలుపు: ఇక ఉత్కంఠగా జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను భారత జట్టు ఓడించింది. తొలుత మనోళ్లు 6 ఓవర్లలో 86/4 స్కోరు చేశారు. ఛేదనలో..పాక్ 3 ఓవర్లలో 41/1 స్కోరుతో ఉన్న దశలో వర్షం కురిసింది. దాంతో డక్‌వర్త్/లూయిస్ నిబంధన అమలులోకి తేగా పాకిస్థాన్ విజయానికి రెండు పరుగులు తక్కువగా చేయడంతో ఓటమి తప్పలేదు.

ఆధిక్యంలో భారత్ 'ఎ'

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 221

బెంగళూరు: దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో భారత్ 112 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. శుక్రవారం రెండో రోజు పేసర్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికా 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఏకర్మన్ (134) శతకం సాధించినా.. పేసర్లు ప్రసిద్ధ్ (3/35), ఆకాశ్ దీప్ (2/28), సిరాజ్ (2/61)ల ధాటికి ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత 34 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 'ఎ' ఆట ముగిసే సమయానికి 78/3 స్కోరుతో నిలిచింది. క్రీజులో రాహుల్ (26 బ్యాటింగ్), కుల్దీప్ ఉన్నారు. దేవ్‌దత్ (24), సాయి సుదర్శన్ (23), అభిమన్యు (0) అవుటయ్యారు. అంతకుముందు భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేసింది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,020 ▲	1,11,850 ▲	1,65,000 ▲
విజయవాడ	1,24,000 ▼	1,18,000 ▲	1,53,000 ▲
విశాఖపట్నం	1,24,050 ▼	1,11,750 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,49,000 ▲
ప్రొద్దుటూరు	1,21,600 ▲	1,11,870 ▲	1,52,500 ▲
ముంబై	1,20,100 ▼	1,10,012 ▼	1,48,275 ▲

దివీస్ లాభం రూ.689 కోట్లు

దివీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.689 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.510 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.2,338 కోట్ల నుంచి రూ.2,715 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.1,722 కోట్ల నుంచి రూ.1,948 కోట్లకు పెరిగినట్లు దివీస్ పేర్కొంది. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో ఫారెక్స్ లాభాలు రూ.29 కోట్ల నుంచి రూ.63 కోట్లకు పెరిగినట్లు తెలిపింది.

తగ్గిన కిమ్స్ హాస్పిటల్స్ లాభం

కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.965 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.72 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 23.3 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 42 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో అన్ని హాస్పిటల్స్ ప్రోత్సాహకర పనితీరును కనబరిచాయని, మహారాష్ట్రలోని థానేలో కొత్తగా ఏర్పాటు చేసిన హాస్పిటల్‌కు అద్భుతమైన స్పందన లభించిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర్ రావు అన్నారు.

నవ లిమిటెడ్ 300% డివిడెండ్

నవ లిమిటెడ్ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.989.70 కోట్ల ఆదాయంపై రూ.177.50 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 5 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 46 శాతం తగ్గింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.555.5 కోట్ల ఆదాయంపై రూ.156.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 28.9 శాతం పెరగగా లాభం 7.5 శాతం వృద్ధి చెందింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.3 (300%) మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీని ఈ నెల 14గా ఖరారు చేసింది.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

సంస్క'రన్'తోనే సాధ్యం!

- 30 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదగాలంటే ఆర్థిక సేవల రంగంలో మరిన్ని సంస్కరణలు అవసరం
- ప్రైవేట్ రంగంలో మూలధన సమీకరణకు ఊతమివ్వాలి..
- భారత్‌కు ప్రపంచ బ్యాంక్ సూచన



న్యూఢిల్లీ: వచ్చే 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఆర్థిక సేవల రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టడంతోపాటు ప్రైవేట్ రంగంలో మూలధన నిధుల సమీకరణకు ఊతమివ్వాలని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక భారత్‌కు సూచించింది. భారత్ ప్రపంచ స్థాయి డిజిటల్ ప్రజా మౌలిక వసతులను కలిగి ఉందని, ప్రభుత్వ కార్యక్రమాలు దేశంలోని పురుషులు, మహిళలకు విస్తృతమైన ఆర్థిక సేవలను అందుబాటులోకి తెచ్చాయని వరల్డ్ బ్యాంక్ 'ఫైనాన్షియల్ సెక్టార్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎస్ఏ)' రిపోర్టు పేర్కొంది. ఖాతాల వినియోగాన్ని, ముఖ్యంగా మహిళల్లో మరింత పెంచాల్సిన అవసరం ఉందని.. వ్యక్తులు, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సాధనాలను విస్తృతంగా అందుబాటులోకి తేవాలని నివేదిక సూచించింది. మరిన్ని విషయాలు..

- బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నియంత్రణ, పర్యవేక్షణపైనా రిపోర్టులో ప్రస్తావించింది. సహకార బ్యాంకులపై నియంత్రణాధికారాల విస్తరణ, కీలక నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు నియంత్రణ, పర్యవేక్షణ శాఖ పునర్‌వ్యవస్థీకరణ ఆర్థిక సేవల రంగ దక్షతను మరింత పెంచనుంది. అలాగే, ఎన్‌బీఎఫ్‌సీలకు స్కేల్ బేస్డ్ నియమావళిని సైతం ప్రపంచ బ్యాంక్ స్వాగతించింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలపై మరింత మెరుగైన పర్యవేక్షణ కోసం క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్ నియమావళిని మరింత బలోపేతం చేయాలని సూచించింది.
- గడిచిన ఐదేళ్లలో భారత క్యాపిటల్ మార్కెట్ (ఈక్విటీ, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లు) జీడీపీలో 144 శాతం నుంచి 175 శాతానికి పెరిగింది. క్యాపిటల్ మార్కెట్లో విస్తృత మౌలిక వసతులు, భారీగా పెరిగిన మదుపరులు వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి. మూలధన సమీకరణకు మరింత దోహదపడేలా రుణ విస్తరణ వ్యవస్థ అభివృద్ధి, రిస్క్ షేరింగ్ ఫెసిలిటీస్, సెక్యూరిటైజేషన్ వేదికను అభివృద్ధి చేయాలని వరల్డ్ బ్యాంక్ నివేదిక సూచించింది.

ఎయిర్‌టెల్‌లో 0.8% వాటాల విక్రయం

సింగ్‌టెల్

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్‌లో 0.8% వాటాలను రూ.10,353 కోట్లకు విక్రయించినట్టు సింగపూర్‌కు చెందిన టెలికాం కంపెనీ సింగ్‌టెల్ ప్రకటించింది. ఆస్తుల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కంపెనీ ఈ చర్య తీసుకుంది. ఈ విక్రయం అనంతరం ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 27.5 శాతానికి తగ్గుతుంది. ఈ వాటా అంచనా విలువ రూ.3.46 లక్షల కోట్లుగా ఉంది. సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్రైవేటుగా షేర్ల కేటాయింపు విధానంలో ఈ లావాదేవీ జరిగింది. ఎయిర్‌టెల్‌పై మార్కెట్లో విశ్వాసానికి, బలమైన డిమాండ్‌కు ఇది దర్పణమని పేర్కొంది. ఈ లావాదేవీ ద్వారా వచ్చిన లాభం 110 కోట్ల సింగపూర్ డాలర్లుంటుందని సింగ్‌టెల్ తెలిపింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో ఎయిర్‌టెల్ షేరు 4.46% క్షీణించి రూ.2001.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు 4.47% క్షీణించి రూ.2001.20 వద్ద క్లోజైంది.

ఏపీ ప్రాజెక్టు కోసం ఏడీబీ నుంచి రూ.2,934 కోట్ల రుణం

రెన్యూ ఎనర్జీ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో తాము నెలకొల్పే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) నుంచి 33.1 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,934 కోట్లు) రుణం తీసుకోబోతున్నట్టు రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్రకటించింది. ఏడీబీ ఇందులో 29.1 కోట్ల డాలర్ల రుణాన్ని స్థానిక కరెన్సీలో, మిగతా 4 కోట్ల డాలర్ల రుణాన్ని ఇతర కరెన్సీల్లో అందించనుంది. ఇది గాక 14.6 కోట్ల డాలర్ల రుణాన్ని కూడా ఏడీబీ తన ఇతర అనుబంధ సంస్థల ద్వారా సమకూర్చనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా రెన్యూ ఎనర్జీ గ్లోబల్ అనంతపురం జిల్లాలో 2,800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న సౌర, పవన విద్యుత్ కేంద్రాలను, 2,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటు చేయనుంది.

పిట్టీ ఇంజనీరింగ్ ఆదాయం రూ.499 కోట్లు

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ రూ.499 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 5%, ఆదాయం 10% వృద్ధి చెందాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా రూ.150 కోట్ల పెట్టుబడితో సామర్థ్య విస్తరణను చేపడుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	613	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	100
కర్నూలు	100	నెల్లూరు	105
విశాఖపట్నం	108	అనంతపురం	105
గోదావరి	106		

25,500 దిగువకు నిఫ్టీ

ఇంట్రాడేలో 83,000 కిందికి సెన్సెక్స్

వరుసగా మూడో రోజూ నష్టాల్లోనే..

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ కారణంగా భారత ఈక్విటీ సూచీలు శుక్రవారం మరింత నష్టపోయాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 640 పాయింట్లు క్షీణించి 82,670.95 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి మళ్లీ కోలుకున్న సూచీ చివరికి 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17.40 పాయింట్లు తగ్గి 25,492.30 వద్ద క్లోజైంది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు. గడిచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 1,300 పాయింట్లకు పైగా, నిఫ్టీ 440 పాయింట్లకు పైగా పతనమయ్యాయి. కాగా గత నెల 31తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 562 కోట్ల డాలర్ల మేర తగ్గి 68,973 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

షార్ట్ సెల్లింగ్‌ను సమీక్షిస్తాం..

త్వరలోనే వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు .. సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



నూఢిల్లీ: ప్రస్తుతం ఉన్న షార్ట్ సెల్లింగ్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విధి విధానాలను సమగ్రంగా సమీక్షించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం త్వరలోనే ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సీఎన్‌బీసీ టీవీ 18 చానల్ నిర్వహించిన ఒక సదస్సులో సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే ఈ విషయం వెల్లడించారు. స్టాక్ మార్కెట్లో లిక్విడిటీ పెంచేందుకు తమ డీమ్యాట్ ఖాతాల్లో వృధాగా పడి ఉన్న షేర్లను మరొకరికి కొంత ఫీజుకు అద్దెకి ఇచ్చి అదనపు రాబడి పొందేందుకు 2007లో షార్ట్ సెల్లింగ్ విధానాన్ని, 2008లో ఎస్ఎల్‌బీ విధానాన్ని సెబీ ప్రవేశ పెట్టింది. మధ్యలో ఎస్ఎల్‌బీ విధానంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నా, షార్ట్ సెల్లింగ్ విధానంలో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎస్ఎల్‌బీ విధానం కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదు. దీంతో ఈ రెండు విధానాలను సమగ్రంగా సమీక్షించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐ పెట్టుబడులపై బేఫికర్

దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) తరలిపోవటంపై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాండే అన్నారు. ఇప్పటికీ మన క్యాపిటల్ మార్కెట్లో ఈ సంస్థల పెట్టుబడులు 90,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.79.78 లక్షల కోట్లు) వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎఫ్‌పీఐలకు భారత ఆర్థిక వృద్ధిపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం మన స్టాక్ మార్కెట్లో దేశీయ సంస్థాగత మదుపరులె (డీఐఐ), వ్యక్తిగత ఇన్వెస్టర్లు కూడా చురుగ్గా ఉన్నట్టు తెలిపారు. లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్‌లో వ్యక్తిగత మదుపరులు వాటానే 18 శాతం వరకు ఉన్న విషయాన్ని పాండే గుర్తు చేశారు. వీక్లీ ఎక్స్‌పైరీలపై నిషేధం విధించే ఆలోచన ఉందా? అనే ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

మస్క్‌కు లక్ష కోట్ల డాలర్ల ప్యాకేజీ

టెస్లా షేర్‌హోల్డర్ల ఆమోదం

టెక్సాస్: అమెరికన్ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ను ప్రపంచంలో తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వ్యక్తి)గా మార్చగలిగే పారితోషిక ప్యాకేజీకి కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా షేర్‌హోల్డర్ల వార్షిక సమావేశంలో మస్క్ పారితోషిక ప్యాకేజీకి సుముఖంగా 75 శాతం మంది ఓటు వేశారు. ఈ సెప్టెంబరులో టెస్లా బోర్డు మస్క్‌కు భవిష్యత్‌లో ట్రిలియన్ డాలర్ల విలువ చేసే పనితీరు ఆధారిత ప్యాకేజీని ఆఫర్ చేసింది. ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద ప్యాకేజీ. బీవైడీ, ఇతర చైనా కంపెనీల నుంచి పోటీ తట్టుకోలేక విక్రయాలు భారీగా తగ్గి డీలాపడిన టెస్లా ఈ ప్యాకేజీలో భాగంగా మస్క్‌కు అత్యంత భారీ లక్ష్యాలను నిర్దేశించింది. కంపెనీ మార్కెట్ విలువను (క్యాపిటలైజేషన్) ప్రస్తుత 1.5 ట్రిలియన్ డాలర్ల నుంచి 8.5 ట్రిలియన్ డాలర్ల (8.5 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చడం, కంపెనీ కార్ల వార్షిక విక్రయాలను గత ఏడాదిలో నమోదైన 20 లక్షల లోపు యూనిట్ల నుంచి 2 కోట్ల యూనిట్లకు పెంచడం, రోబో ట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల అమ్మకాలను 10 లక్షల యూనిట్లకు పెంచడం అందులో ప్రధానమైనవి. లక్ష్యాలన్నింటినీ చేరుకుంటేనే, ప్యాకేజీలో భాగంగా ఆఫర్ చేసిన 42.37 కోట్ల కంపెనీ షేర్లు మస్క్‌కు దక్కుతాయి. ప్రస్తుతం వాటి విలువ 8,780 కోట్ల డాలర్లు. పదేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ 8.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరితే ఆయన వాటా షేర్ల మొత్తం విలువ ట్రిలియన్ డాలర్లు దాటనుంది. ఈ ప్యాకేజీ ప్రయోజనాలు పూర్తిగా దక్కాలంటే, మస్క్ కంపెనీలో కనీసం ఏడున్నరేళ్లు కొనసాగాలి.

చిప్‌ల తయారీలోకి టెస్లా: టెస్లా సెమీకండక్టర్ల (చిప్) తయారీలోకి ప్రవేశించాలనుకుంటున్నట్లు కంపెనీ వాటాదారుల వార్షిక సమావేశంలో మస్క్ వెల్లడించారు. స్వయం చోదక వాహనాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్న కంపెనీ.. ఇందుకు అవసరమైన ఏఐ ఆధారిత చిప్‌ల కోసం ఇతర సంస్థలపై ఆధారపడకుండా సొంతగా తయారు చేసుకోవాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఐదు, ఆపై తరాల ఏఐ చిప్‌ల తయారీ కోసం టెస్లా టెరాఫ్యాబ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు, అందులో భాగంగా ఇంటెల్‌తో కలిసి పనిచేయనున్నట్లు మస్క్ తెలిపారు.



విజయవాడలో నిర్వహించిన రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతులో పాల్గొన్న బీవీ రాఘవులు, బాబూరావు, కాశీనాథ్ తదితరులు

వేగంగా విద్యుత్ ప్రైవేటీకరణ

- అదానీ చేతుల్లోకి నియంత్రణ.. భవిష్యత్‌లో ప్రజలపై మోయలేని భారం
- ప్రపంచవ్యాప్తంగా సోషలిజంపై పెరిగిన ఆకర్షణ: రాఘవులు
- విజయవాడలో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ ఆస్తి 1,500 రెట్లు, అంబానీ ఆస్తి 500 రెట్లు పెరిగింది. కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదు' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. తొలి సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'విద్యుత్ ప్రైవేటీకరణ చేసే పనులు వేగవంతం అయ్యాయి. ఇప్పటికే అదానీ చేతుల్లోకి పోతోంది. దీనివల్ల భవిష్యత్తులో ప్రజలపై మోయలేని భారం పడుతుంది. ప్రపంచ పెత్తనం కోసం సామ్రాజ్యవాదం ఇప్పటి వరకు చేస్తున్న బెదిరింపులు, హెచ్చరికలన్నీ ఉడత ఊపులే. ప్రపంచవ్యాప్తంగా సోషలిజం పట్ల ఆకర్షణ పెరిగింది. ఇటీవల అమెరికాలో యువతపై నిర్వహించిన ఒక సర్వేలో 60 శాతం మంది సోషలిజం కావాలని కోరుకుంటున్నారు. అమెరికాలో పెట్టుబడిదారీ విధానంలో జీతాలు పెరుగుదలలో వైఫల్యం కనిపిస్తోంది. డాలర్ విలువ తగ్గుతోంది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తోంది. మరోవైపు ఆర్థికంగా బలోపేతం అవ్వడం కోసమే ప్రపంచంలోని అనేక దేశాలు మధ్య యుద్ధాలు జరుపుతోంది. ఇదే సమయంలో కమ్యూనిస్టు దేశాలు అన్ని అంశాల్లోను వేగంగా ముందుకు వెళుతున్నాయి' అని రాఘవులు అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ, శ్రమకు తగ్గ వేతనం, ఉపాధి, జీవన భద్రత కావాలంటే సోషలిజంలోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, కె.శ్రీదేవి, ఎన్‌సి హెచ్ శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్లు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవశ్యం: సీపీఐ

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులందరూ పునరేకీకరణ కావాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. వందేళ్ల కాలంలో దేశంలోని కమ్యూనిస్టు పార్టీ కీలకంగా లేకపోవడానికి, అధికారంలోకి రాకపోవడానికి పార్టీల చీలికే కారణమని అభిప్రాయపడ్డారు. శుక్రవారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేపాల్లో తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలు ఐక్యతతో ఉమ్మడిగా ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఇదే తరహాలో భారత్‌లోనూ ఏకం కావాలని కమ్యూనిస్టు ఉద్యమ అభిమానులు, వామపక్ష మేధావులు, కార్మికులు కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం ఈనెల 18న దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనల్లో అన్ని రాష్ట్రాల్లో కమ్యూనిస్టు నేతలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చకచకా సన్నాహాలు..

- విశాఖలో 14,15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- దానికి తగినట్టే భారీగా ఏర్పాట్లు
- ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో 8 హాళ్లు
- సదస్సు ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి
- వేదిక వద్ద సీఎం, కేంద్ర వాణిజ్యమంత్రికి ప్రత్యేకంగా చాంబర్లు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు (పార్టనర్‌షిప్ సమ్మిట్) చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెట్టుబడుల కోసం తొలిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో సీఎం చంద్రబాబు ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఇక్కడ ఏర్పాట్లు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయి. సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటివరకూ 1,000 మంది డెలిగేట్లు రిజిస్టర్ చేసుకున్నారు. రెండు వేల మంది వరకూ వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్‌తోపాటు 33 దేశాల నుంచి వాణిజ్య మంత్రులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఆస్ట్రేలియా, సౌదీ అరేబియాతోపాటు మరికొన్ని దేశాల నుంచి వాణిజ్య మంత్రిత్వ శాఖల బృందాలు రానున్నాయి. సదస్సు ముందురోజు, ఈనెల 13వ తేదీన నోవాటెల్ హోటల్‌లో అతిథులకు ముఖ్యమంత్రి విందు ఇవ్వనున్నారు. ఈనెల 14వ తేదీన సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పలు శాఖల ఉన్నతాధికారులు రానున్నారు.

1600 మంది కూర్చునేలా ప్రధాన హాలు

సదస్సు కోసం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మొత్తం ఎనిమిది హాళ్లు ఏర్పాటుచేస్తున్నారు. మొదటి హాలులో డెలిగేట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతారు. రెండో హాలును వివిధ కంపెనీలు, ప్రభుత్వ శాఖల స్టాళ్ల ఏర్పాటుకు, మూడో హాలును డెలిగేట్లకు భోజన ఏర్పాట్లకు కేటాయించారు. నాలుగో హాలులో మూడు మినీ హాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ డెలిగేట్లతో ప్రభుత్వ ప్రతినిధుల ముఖాముఖి భేటీలు ఉంటాయి. ఐదో హాలులో ప్రధాన వేదికను 1,600 మంది ప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరో హాలులో సీఎం లాంజ్, భద్రతా, ఇతర సిబ్బందికి గదులు, ఏడో హాలులో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్‌కు లాంజ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎనిమిదో హాలు ఉపరాష్ట్రపతి కోసం కేటాయించారు.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సుకు ఏర్పాట్లు

హోటళ్ల బుకింగ్, 40 ఆడి, బీఎండబ్ల్యూ, బెంజ్‌లు

సదస్సుకు వచ్చే ప్రముఖులు, ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధుల కోసం ఇప్పటివరకూ విశాఖ నగరంలో 1,200 గదులు రిజర్వు చేశారు. అయితే మరింతమంది వచ్చే అవకాశం ఉన్నందున మరికొన్ని హోటళ్లలో కూడా గదులను బుక్ చేస్తున్నారు. అతిథులు, ఇతర ప్రముఖుల కోసం సుమారు 40 వరకు బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి కార్లు సిద్ధం చేస్తున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు, డెలిగేట్లు, ప్రజాప్రతినిధులు, అధికారులకు వేర్వేరుగా పాస్‌లు సిద్ధం చేస్తున్నారు. కాగా, సదస్సును నిర్వహించే ప్రాంగణంలో వేదికలు, హాళ్లు సిద్ధమైన తరువాత ఆ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు.

ప్రతి సీసాకూ లెక్క!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించడం సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఇక నుంచి కొత్త విధానం తీసుకురానున్నారు. దీని ద్వారా వినియోగదారులకు ఎంత మద్యం అమ్మారు?. షాపులు మూసేసే సమయానికి ఎంత సరుకు నిల్వ ఉంది?. అనే వివరాలను కూడా రియల్‌టైమ్‌లో తెలుసుకునేలా 'ట్రాక్ అండ్ ట్రేస్' విధానాన్ని ప్రవేశ పెట్టనున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ ఇటీవల ఓ సమావేశం నిర్వహించింది. ఇప్పటివరకు 'వశిష్ఠ' అనే సంస్థ ఎక్సైజ్‌కు ఆన్‌లైన్ సేవలు అందించింది. ఆ సంస్థ కాలపరిమితి ముగియడంతో 'ట్రాక్ అండ్ ట్రాస్'ను పూర్తిగా అప్‌డేట్ చేసి, సేవలు అందించేందుకు సంస్థలను ఆహ్వానించింది. దీనిలో భాగంగా ఇకపై వినియోగదారుడి వరకు అమ్మకాలను ట్రాకింగ్ చేసే విధానం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే, వినియోగదారుల సమాచారం తప్పనిసరిగా తీసుకోవాలా?. లేదా?. అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మద్యం కొనుగోలుదారులు వారి వివరాలను ఇచ్చే అవకాశం తక్కువ. కాబట్టి వ్యక్తిగత వివరాల సేకరణ ఆప్షనల్‌గా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కనీసం ఫోన్ నంబరు అయినా తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అలాగే ఇటీవల తీసుకొచ్చిన ఎక్సైజ్ 'సురక్ష యాప్'లో సీసాలను స్కాన్ చేసేవారి వివరాలు వచ్చేలా యాప్‌ను రూపొందించారు. స్కాన్ చేసి నకిలీ మద్యం అని ఎవరైనా అని ప్రచారం చేస్తే.. అది నిజమా? కాదా? అనేది ఎక్సైజ్‌కు తెలిసిపోతుంది. నిజంగానే సీసాలు స్కాన్ కాలేదా? అనే వివరాలు కూడా అధికారులకు తెలియనున్నాయి.

పూర్తిస్థాయిలో డిజిటల్ చెల్లింపులు

ప్రస్తుతం షాపులు, బార్లలో డిజిటల్ చెల్లింపులు తప్పనిసరి కాదు. కానీ, అనధికారికంగా డిజిటల్ చెల్లింపుల సౌకర్యం అందుబాటులో ఉంచాలని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అయితే, ఇకపై డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని షాపులు, బార్లకు తప్పనిసరి చేయనున్నారు. అన్ని షాపులు, బార్లలో డిజిటల్ పేమెంట్ల విధానం అందుబాటులో ఉంటే వినియోగదారులు నచ్చిన విధంగా నగదు చెల్లిస్తారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. దీని కోసం ఇటీవల ఓ అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపి అధ్యయనం చేయించారు. ఇతర రాష్ట్రాల్లో డిజిటల్ చెల్లింపులను కూడా అధ్యయనం చేసి రాష్ట్రంలో ఉత్తమ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు.



కొత్త ట్రాక్ అండ్ ట్రేస్ విధానం అమల్లోకి వస్తే మద్యం అమ్మకాల్లో వంద శాతం రియల్ టైమ్ డేటా అందుబాటులోకి వస్తుంది. దానివల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. ప్రస్తుతం డిస్టిలరీ నుంచి డిపో, అక్కడి నుంచి నుంచి మద్యం షాపు లేదా బార్ వరకు ఎంత స్టాకు సరఫరా చేశారు అనే వివరాలు తెలుస్తాయి. కొత్త విధానంలో షాపు లేదా బార్‌లో ఎంత స్టాకు ఉందో కూడా తెలుస్తుంది. వినియోగదారులు ఎంత మద్యం కొన్నారు? ఏ బ్రాండ్ ఎక్కువగా అమ్ముడవుతోంది?. అనే వివరాలు కూడా క్షణాల్లో తెలిసిపోతాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో ఎక్కడైనా

ఇకపై రియల్‌టైమ్ డేటా

ఏదైనా బ్రాండ్‌తో నకిలీ మద్యం విచ్చలవిడిగా అమ్ముతుంటే ఆ సమాచారం కనిపెట్టడం అధికారులకు సులభం అవుతుంది. స్టాకు షాపుల్లోనే ఉండి, అదే బ్రాండ్ బయట వినియోగదారులు తాగుతుంటే అది ఎక్కడినుంచి వచ్చిందనేది కనిపెట్టడం కూడా సులభతరం అవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే నూతన సంవత్సరం, పండగలు, ఇతర వేడుకల సమయంలో నిజంగా వినియోగదారులు ఎంత మద్యం తాగుతున్నారనే వివరాలు కూడా ప్రభుత్వానికి తెలియనున్నాయి.

రాష్ట్రపతి భవన్‌కు ఏపీ విద్యార్థులు

- స్పేస్ టెక్నాలజీపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు


రష్యన్ స్పేస్ టెక్నాలజీపై నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

న్యూఢిల్లీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పర్యటిస్తున్న ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 52 మంది రెండో రోజు రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌ను వెళ్లగా అక్కడి గైడ్‌లు భవన నిర్మాణ విశిష్ఠతలను విద్యార్థులకు దగ్గరుండి వివరించారు. అంతకుముందు రష్యన్ సోషల్ సైన్స్ కల్చరల్ సెంటర్‌లో స్పేస్ టెక్నాలజీపై అక్కడి శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రష్యన్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించి వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిపి రెండు కేటగిరీలలో నిర్వహించిన పోటీలలో మొత్తం ఆరుగురు విజేతలుగా నిలిచారు. వారిలో నలుగురు ఏపీ విద్యార్థులే కావడం గమనార్హం. దేశంలోని పేరెన్నికగన్న కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులను ఓడించి ఏపీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ పేరిట నిర్వహిస్తున్న ఈ పర్యటన చివరి రోజైన శనివారం విద్యార్థులకు నెహ్రూ ప్లానెటోరియంలో నాసా ఇంజనీర్లతో ముఖాముఖి పరిచయ కార్యక్రమం ఉంటుంది. ప్రధాని సంగ్రాలయాన్ని (మ్యూజియం) విద్యార్థులు సందర్శించనున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965



భావోద్వేగానికి గురవుతున్నారు

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా చూసిన మహిళలంతా భావోద్వేగానికి గురవుతున్నారు. ఇలాంటి మంచి సినిమాను నిర్మించినందుకు సంతృప్తిగా ఉంది. మీడియా కూడా ఈ చిత్రానికి మంచి రేటింగ్స్ ఇచ్చి ప్రోత్సహించింది. మార్నింగ్ షో, మ్యాట్నీ షోలకు మంచి టాక్ రావడంతో క్రమంగా వసూళ్లు పెరుగుతున్నాయి. మా ప్రయత్నానికి మంచి ఫలితం దక్కింది అనిపించింది' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రమిది. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ప్రేమికులైనా, భార్యా భర్తలైనా ఒకరిపట్ల మరొకరు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో ఈ సినిమాలో చెప్పారు' అని అన్నారు.

అదిరే స్టెప్పులు... చికిరి చికిరి




రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తోన్న 'పెద్ది' చిత్రం నుంచి తొలి గీతం వచ్చేసింది. 'చికిరి చికిరి...' అంటూ సాగే ఈ పాటకు రామ్‌చరణ్ అదిరిపోయే స్టెప్పులు వేశారు. ఈ పాటను బాలాజీ రాయగా, ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. మోహిత్ చౌహాన్ అద్భుతంగా ఆలపించారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించనున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

మరోసారి యాక్షన్ ఫిల్మ్




తన పుట్టినరోజు సందర్భంగా విలక్షణ నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమాను ప్రకటించారు. 'విక్రమ్' చిత్రంలో తనతో అద్భుతమైన ఫైట్లు చేయించి చిత్ర విజయానికి కారణమైన స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బు మణి, అరివు మణి లను దర్శకులుగా ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నారు కమల్. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఆర్.మహేంద్రన్‌తో కలసి ఈ సినిమా నిర్మించనున్నారు కమల్. 'హంట్ మోడ్ ఆన్' అనే ట్యాగ్‌లైన్‌తో చిత్రాన్ని ప్రకటించారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందని అన్బు మణి, అరివు మణి చెప్పారు.

అఖండ తాండవం!



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం 'అఖండ 2.. తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో సినిమాలోని ఆసక్తికరమైన అంశాలు ఒక్కొక్కటీగా జనంలోకి వదులుతున్నారు. తాజాగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న తాండవం సాంగ్ ప్రోమోని విడుదల చేశారు. సంగీత దర్శకుడు తమన్ స్వరాలు అందించి అద్భుతంగా పాటను రూపొందించారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతితో ఢమరుకంతో బాలకృష్ణ చేసిన అఖండ తాండవం ఆకట్టుకుంటోంది. పూర్తి పాటను ఈ నెల 14న విడుదల చేయనున్నారు. సంయుక్త కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. డిసెంబర్ 5న 'అఖండ 2.. తాండవం' చిత్రం విడుదల కానుంది. నందమూరి తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు.

సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధికి చర్యలు




సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మూడు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో సృజనాత్మక రంగానికి ఊతమివ్వడంతోపాటు యువ ప్రతిభకు వేదికలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

హైదరాబాద్‌లో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్: డిసెంబరు 19 నుంచి 21 వరకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఫెస్టివల్‌ను దాదాసాహేబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

టెలివిజన్ అవార్డులపై కమిటీ: 'తెలంగాణ టెలివిజన్ అవార్డులు 2024' నిర్వహణకు సంబంధించిన నియమాలు, విధానాలు, లోగో డిజైన్ వంటి అంశాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. టెలివిజన్ రంగానికి చెందిన ప్రముఖులు, సీనియర్ ప్రొఫెషనల్స్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్: యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం రూ.30 లక్షల బడ్జెట్‌ను కేటాయించింది. దర్శకుడు హరీశ్ శంకర్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, సినిమాటోగ్రాఫర్ పి.జి. విందా, దర్శకుడు బలగం వేణులతో అవార్డుల ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 'సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. తెలంగాణలోని యువ ప్రతిభకు అవకాశాలు కల్పించడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, చిత్ర పరిశ్రమకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించడం మా లక్ష్యం' అని అన్నారు.

పండంటి బాబుకు జన్మనిచ్చిన కత్రీనా



బాలీవుడ్ దంపతులు కత్రీనా కైఫ్, విక్కీ కౌశల్ తల్లిదండ్రులయ్యారు. శుక్రవారం పండంటి బాబుకు కత్రీనా జన్మనిచ్చినట్లు విక్కీ కౌశల్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'ఎంతో ఆనందంగా ఉంది. మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు జన్మించాడు. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి' అని పోస్టు పెట్టారు. ప్రముఖులు, నెటిజన్లు విక్కీ కౌశల్, కత్రీనా కైఫ్ జంటకు శుభాకాంక్షలు తెలిపారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం అనంతరం 2021లో విక్కీ, కత్రీనా వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

ఇక కుంభాతో తలపడే సమయం వచ్చింది



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న చిత్రం (ఎస్ఎస్ఎంబీ 29) నుంచి మేజర్ అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్‌ను రాజమౌళి 'కుంభా' అనే పేరుతో శుక్రవారం సోషల్ మీడియాలో విడుదల చేశారు. రోబోటిక్ వీల్ చైర్‌లో కూర్చుని, తీవ్రమైన హావభావాలతో పృథ్వీరాజ్ కనిపించారు. అతను అచేతనుడై ఉన్నా, వీల్‌చైర్ నుంచి బయటకు వచ్చిన రోబోటిక్ చేతులు అతని శక్తికి, సాంకేతికతకు ఆధారమని తెలుస్తోంది. 'దుష్టుడు, క్రూరుడు, శక్తిమంతమైన విరోధి'గా ఈ పాత్రను రాజమౌళి అభివర్ణించారు. ఇలాంటి పాత్రకు ప్రాణం పోయడం సృజనాత్మకంగా చాలా సంతృప్తిని ఇచ్చింది, ఆ కుర్చీలో ఒదిగిపోయినందుకు పృథ్వీకి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. 'ఒక వైపు నిలబడ్డాను... ఇక కుంభాతో తలపడే సమయం వచ్చింది' అని మహేశ్‌బాబు స్పందించారు. 'మేము టేకాఫ్ అవుతున్నాం... కుంభాను కలవండి' అని కథానాయిక ప్రియాంక చోప్రా పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈవెంట్‌లో సినిమా టైటిల్‌ను ప్రకటించి టీజర్‌ను విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

బాలీవుడ్ నటి, గాయని సులక్షణ పండిట్ ఇక లేరు!



తన నటనతో, పాటతో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ అలనాటి నటి సులక్షణ పండిట్ (71) గురువారం రాత్రి గుండెపోటుతో ముంబైలో కన్ను మూశారు. ఆవిడ సోదరుడు లలిత్ పండిట్ ఈ విషయాన్ని వెల్లడించారు. హరియాణా రాష్ట్రంలోని హిసార్‌లో ఓ సంగీత కుటుంబంలో సులక్షణ జన్మించారు. నటనపై ఆసక్తితో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సులక్షణకు 'ఉల్‌జాన్' (1975)లో తొలి అవకాశం లభించింది. అందులో సంజీవ్‌కుమార్ హీరో. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్న సులక్షణ బాలీవుడ్‌లోని టాప్ స్టార్స్ రాజేశ్‌ఖన్నా, శశికపూర్, వినోద్ ఖన్నా వంటి వారి సరసన నటించారు. 1970-80 దశకంలో గ్లామర్ కథానాయికగా ఓ వెలుగు వెలిగారు. నటిగానే కాకుండా మంచి గాయనిగా కూడా సులక్షణకు పేరుంది. హిందీ, బెంగాలీ, మరాఠీ, ఒరియా, గుజరాతీ భాషల్లో ఆవిడ పాడారు.



సీఎం చంద్రబాబు సమక్షంలో రుణ మంజూరు పత్రాలను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు అందజేస్తున్న ఎన్ఏబీఎఫ్ఐడీ అధికారులు

అమరావతి నిర్మాణాలకు కొత్త జోష్

» 7,500 కోట్ల రుణం మంజూరు చేసిన ఎన్ఏబీఎఫ్ఐడీ

తుళ్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణాలకు కొత్త ఊపు తీసుకొచ్చేలా నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ) రూ.7,500 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అమరావతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రుణ మంజూరు పత్రాలను బ్యాంకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ శామ్యూల్ జోసెఫ్, ప్రాజెక్ట్ ఫైనాన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కే.దినేశ్‌లు.. ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు అందజేశారు. కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కూడా పాల్గొన్నారు. ప్రజారాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ రుణం ఉపయోగపడుతుందని కన్నబాబు తెలిపారు.

సీఎం ప్రోగ్రాంకు దూరంగా ఉండండి

» ఎన్జీ రంగా వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌కు షాక్

గుంటూరు సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మికి అధికారులు ఝలక్ ఇచ్చారు. ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలకు సీఎం చంద్రబాబు శుక్రవారం యూనివర్సిటీకి వచ్చిన సమయంలో ఆ కార్యక్రమానికి దూరంగా ఉండాలని ఆదేశించారు. దీంతో వీసీ అనుకూల వర్గం పూర్తిగా డీలా పడింది. మధ్యాహ్నం వరకు ఆమె వర్సిటీలోనే ఉన్నారు. ఆ సమయంలో కొందరు జిల్లా అధికారులు ఇన్‌చార్జి వీసీకి, రిజిస్ట్రార్‌కు ఫోన్‌చేసి సీఎం ఉన్నంతసేపూ ఆ కార్యక్రమానికి దూరంగా ఉండాలని చెప్పారు. అధికారుల సూచనతో వారిద్దరూ వర్సిటీ నుంచి వెళ్లిపోయారు. శారదా జయలక్ష్మిని వైసీపీ ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీగా నియమించింది. అప్పటి నుంచి ఆమె అనేక అక్రమాలకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిపై వర్సిటీ అధికారులు కొందరు గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో వారిపై కోపం పెంచుకున్న ఇన్‌చార్జి వీసీ అప్పటి వరకు విధుల్లో ఉన్న రిజిస్ట్రార్‌తో పాటు మరికొందరు అధికారులను రాత్రికి రాత్రి మార్చివేశారు. తనపై ఫిర్యాదు చేసిన గిరిజన ప్రొఫెసర్‌పై ఒక కమిటీ వేసి వేధింపులకు గురిచేశారు. దీంతో బాధితుడు గుండెనొప్పి వచ్చి ఆస్పత్రిలో చేరారు. తనను వేధించిన వీసీ, రిజిస్ట్రార్, కమిటీ సభ్యులపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే సీఎం కార్యక్రమానికి వీసీని, రిజిస్ట్రార్‌ను దూరంగా ఉండాలని జిల్లా అధికారులు ఆదేశించినట్లు సమాచారం.

వీఆర్ఏలను ఆదుకోండి

» సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు ప్రాణవాయువైన గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ) ఆర్థిక ఇబ్బందులపై తక్షణమే సీఎం చంద్రబాబు స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మనిషి పుట్టుక నుంచి మరణం వరకు రెవెన్యూ శాఖలో వీఆర్ఏల పాత్ర కీలకం. బ్రిటీషు కాలం నుంచి నేటి వరకు పోలీసులతో సమానంగా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ వీఆర్ఏలు ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్నారు. అయినా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పెరిగే ధరలకు అనుగుణంగా మూడు సంవత్సరాలకు ఒక్కసారైనా వేతనాలు, డీఏ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. సుమారు ఎనిమిది సంవత్సరాలుగా వేతనంలో ఎలాంటి మార్పులేదు. ప్రభుత్వం వీఆర్ఏలతో వెట్టిచాకిరి చేయిస్తూ వేతనం మాత్రం పార్ట్‌టైం ఉద్యోగులకు ఇస్తున్నట్టు ఇవ్వడం బాధాకరం. తక్షణమే సీఎం చంద్రబాబు స్పందించి పేస్కేల్ మంజూరు చేసి, వారిని రెగ్యులర్ చేయాలి' అని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

అంతా విధ్వంసమే

» క్రెడిట్ చోరీ చేయడానికేముంది?: మంత్రి పార్థసారథి

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో దోపిడీ, విధ్వంసం తప్ప ఏమన్నా ఉందా? అందులో నుంచి మేము క్రెడిట్ చోరీ చేయాలా?' అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొంథా తుఫాను సమయంలో అన్ని వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ చంద్రబాబు ప్రభుత్వం సత్వర స్పందన చూపిందని అన్నారు. ప్రజలను అన్ని రకాలుగా మోసం చేయబట్టే వైసీపీ 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయిందన్నారు.

ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్

» ఎగుమతుల కేంద్రంగా ఆంధ్ర

» విశాఖలో రేపు, ఎల్లుండి రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్

» 34 దేశాల నుంచి పలు కంపెనీల ప్రతినిధులు రాక

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఉత్పత్తులకు ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ అవకాశాలను కల్పించడంతోపాటు ఏపీని ఎగుమతుల కేంద్రంగా నిలపడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను ప్రపంచ దేశాల కొనుగోలుదారుల ముందు ప్రదర్శించి, ఎగుమతుల సామర్థ్యాన్ని సుస్థిరం చేసుకుని, అంతర్జాతీయంగా వాణిజ్య సంబంధాలను మెరుగుపరచడానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని కీలక రంగాల్లోని ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను అన్వేషించడానికి, ఎగుమతుల్లో పోటీతత్వాన్ని పెంచడానికి ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన కొనుగోలుదారులను రాష్ట్రానికి రప్పించి, మన పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు ఒక మార్గాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో 9, 10 తేదీల్లో విశాఖపట్నం వేదికగా 'ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కన్వెన్షన్-2025' పేరుతో రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్ (ఆర్బీఎస్ఎం)ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ 'ర్యాంప్' పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సును విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ హోటల్లో ఏర్పాట్లు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో పాల్గొనేందుకు శ్రీలంక, జింబాబ్వే, ఉగాండా, కోస్టారికా, రష్యా, టాంజానియా, నేపాల్, ఈజిప్టు, జపాన్, ఘనా, న్యూజిల్యాండ్, హంగేరి, కెన్యా, టోగో.. ఇలా 34 దేశాల నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి వివిధ రంగాల్లోని ఉత్పత్తులను ఈ సదస్సులో ప్రదర్శించనున్నారు. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదై, రాష్ట్రం నుంచి ఎగుమతులకు సిద్ధమైన ఎంఎస్ఎంఈలు ఈ సదస్సులో పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. ఈ సదస్సులో కొనుగోలుదారులు, అమ్మకందారుల మధ్య పరస్పర చర్చలు, క్యూరేటెడ్ బీ2బీ సమావేశాలు, ప్రత్యక్ష వాణిజ్య సంబంధాలను సులభతరం చేయడానికి ఆయా రంగాల వారీగా కేంద్రీకృత నెట్‌వర్కింగ్ సెషన్లు ఉంటాయని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. రాష్ట్రానికి భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య పెట్టుబడుల సదస్సుకు ముందు నిర్వహిస్తున్న ఈ 'రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్'ను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు.

స్పీడ్ పెంచండి

పెట్టుబడుల ప్రతిపాదనలకు తక్షణ ఆమోదం.. త్వరితగతిన ప్రోత్సాహకాలు, సదుపాయాల కల్పన

» ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుపై దృష్టిసారించండి

» భవిష్యత్తులో ఈ రంగంలో విస్తృత అవకాశాలు

» రాష్ట్రంలో మూడు మెగాసిటీల అభివృద్ధి

» తిరుపతి, అమరావతి నగరాలూ అభివృద్ధి

» విశాఖలో భూ లభ్యత ఉండేలా చూడాలి

» అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

» సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల మండలి సమావేశం



రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారులు

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడుల జోరు పెంచడానికి వెంటనే అనుమతులు ఇవ్వడంతో పాటు ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల కల్పనలో వేగాన్ని పెంచాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. విద్యుత్తు, రహదారులు, నీరు వంటి మౌలిక సదుపాయాలను త్వరితగతిన సమకూర్చాలన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పరిశ్రమలు పెడతామంటూ గత ప్రభుత్వంలో భూములు పొంది, ఇప్పటికీ ఉత్పత్తులు చేపట్టని పరిశ్రమలకు అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని సూచించారు. "రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృథా కాకుండా తక్షణం ఆమోదం తెలియజేయాలి. క్షేత్రస్థాయిలో పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతులు త్వరితగతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలి. ప్రభుత్వం ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలి. గత పాలకులు పరిశ్రమలకు భూములు కేటాయించినా, ఇప్పటికీ ఉత్పత్తులు ప్రారంభం కాని పరిశ్రమల సమాచారం ఇవ్వండి. భూములు తీసుకుని ప్రగతి దిశగా సాగని పరిశ్రమలకు అనుమతులు రద్దు చేయండి. ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. చిప్, సెమీ కండక్టర్, డ్రోన్ వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో సుమారు 15 పారిశ్రామిక జోన్లు ఏర్పాటు చేసుకుని క్లస్టర్ వారీ విధానంలో పారిశ్రామిక విధానాన్ని రూపొందించండి. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. ఇలాంటి వాటి గురించి ప్రమోట్ చేయాలి. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు కొంచెం ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఇవ్వాలి. దీనివల్ల పెట్టుబడులు చేజారవు. కేంద్రం నుం చి రావాల్సిన ప్రోత్సాహకాలపై సంప్రదింపులు జరుపుదాం. పరిశ్రమలకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర తీసుకుంటున్న చర్యలు అమలయ్యేలా చూడాలి" అని చంద్రబాబు ఆదేశించారు.

మెగా సిటీలు, మాస్టర్ ప్లాన్‌లు

రాష్ట్రంలో మూడు మెగాసిటీలు అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ విశాఖ మెగా సిటీగా అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుపతి, అమరావతి నగరాలను మెగా సిటీలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అమరావతికి ఇప్పటికే మాస్టర్‌ప్లాన్ ఉందని.. విశాఖ, తిరుపతికి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. ఈ మెగా సిటీల్లో టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు సానుకూలంగా ఉండేలా చూడాలన్నారు. టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మునిసిపల్ శాఖలు ఈ మేరకు సమన్వయం చేసుకుని ఈ మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. మెగా సిటీలకు టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల విశాఖకు మరిన్ని కంపెనీలు, పరిశ్రమలు రానున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులో విశాఖకు వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు భూ లభ్యత ఉండేలా చూసుకోవాలన్నారు. టూరిజం అభివృద్ధికి ఆతిథ్య రంగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటవుతున్నాయని చెప్పారు. ఈ మూడు కారిడార్లకు ముగ్గురు సీనియర్ అధికారులను నియమిస్తామన్నారు. బీచ్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు.

ఘనంగా పెట్టుబడుల సదస్సు

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న అంతర్జాతీయ భాగస్వామ్య పెట్టుబడుల సదస్సును విజయవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. తనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ సంస్థలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించానని చెప్పారు. విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని ప్రత్యేకంగా కోరానని చెప్పారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు దేశాల పారిశ్రామికవేత్తలు సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, భరత్, నారాయణ, వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్దనరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

1,04,694 కోట్ల పెట్టుబడులు

» 87,166 ఉద్యోగాలు

» 29 ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

» సీఎం చంద్రబాబు అధ్యక్షతన మండలి సమావేశం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాల్లో పరిశ్రమల స్థాపనకు వచ్చిన 29 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రూ.1,04,694 కోట్ల పెట్టుబడులతో 87,186 మందికి ఉద్యోగాలు కల్పిస్తామంటూ వచ్చిన ప్రతిపాదనలను ఈ నెల 4న సీఎస్ కె.విజయానంద్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీసీ) ఆమోదించింది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఎస్ఐపీసీ ఆమోదించిన 29 ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించిన ఎస్ఐపీబీ వాటిని ఆమోదించింది. ఆహార శుద్ధి విభాగంలో రూ.744 కోట్లతో అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ స్థాపించే పరిశ్రమకు అనుమతి లభించింది. ఐటీ శాఖ రూ.32,952 కోట్లతో 64,352 మందికి ఉపాధి కల్పించే 12 ప్రతిపాదనలను ఎస్ఐపీబీ ఆమోదించింది. వాటిలో తిరుపతిలో ఎపిటోమ్ కాంపొనెంట్స్ ప్రైవేట్, కుప్పంలో ఎస్‌పీఎస్పీఎల్ అడ్వాన్స్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రెయాన్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్, శ్రీసిటీలో ఎసీఐసీ వెంచర్స్ ఎల్ఎల్పీ, కర్నూలులో ఇండిచిప్ సెమికండక్టర్స్ లిమిటెడ్, విశాఖలో ఫ్లూఎన్ట్‌గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్, కె.రహేజా కార్పొరేషన్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, మెస్సర్స్ క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు ఉన్నాయి.

ఇంధన శాఖ...

రూ.9,700 కోట్లతో రెండు ప్రతిపాదనలను చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చిట్టింవలసలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ స్థాపించే పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాన్ని 1,800 మెగావాట్లకు పెంచేందుకు, కర్నూలులో ఎస్ఏఈఎల్ సోలార్-పీ12 సంస్థ 250 మెగావాట్ల ఏసీ, 334 మెగావాట్ల డీసీ ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఏపీ టూరిజం అథారిటీ రూ.208 కోట్లతో రెండు ప్రతిపాదనలు చేసింది. కృష్ణా జిల్లా, మచిలీపట్నం మండలంలో ఫైరా బే వ్యూ రిసార్ట్స్‌కు, విజయవాడలో విశ్వనాథ్ స్పోర్ట్స్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎస్ఐపీబీ పచ్చ జెండా ఊపింది.

పరిశ్రమల శాఖ...

రూ.57,738కోట్లతో 23,520 మందికి ఉపాధి హామీతో 6 ప్రతిపాదనలు చేసింది. పల్నాడులో చెట్టినాడు సిమెంట్స్, అనంతపురంలో సుగ్న స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరంలో సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్యాక్టరీ, నాయుడుపేటలో వేల్సన్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ సెజ్, కాకినాడలో ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్, కుప్పంలో హ్వాసంగ్ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పెట్టే బాలాజీ యాక్షన్ తెసా ప్రాజెక్టుకు ఎస్ఐపీబీ ఆమోదముద్ర వేసింది. రూ.3,053 కోట్లతో 3,792మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఏపీఐఐసీ చేసిన 4 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. వాటిలో నెల్లూరులో బిర్లానూ లిమిటెడ్, కర్నూలులో సగాచీ ఇండస్ట్రీస్, అనకాపల్లిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అనకాపల్లిలో డోజ్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. రూ.12కోట్లతో 1,500 మందికి ఉపాధి కల్పించే ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కును కృష్ణా జిల్లాలో శ్రీ వేద ఇన్నోవేషన్ పార్కు ఏర్పాటు చేస్తుందంటూ చేసిన ప్రతిపాదనకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

పల్లె పండుగ 2.0

(మొదటి పేజీ తరువాయి)



గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జియో రూరల్ రోడ్డు మేనేజ్‌మెంట్ సిస్టం(జీఆర్ఆర్ఎంఎస్)ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్ఏఎస్‌సీఐ) నిధులతో పల్లె పండగ 2.0 ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్, పల్లెపండుగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. నిధులు అందుబాటులో ఉన్నా... పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అడవి తల్లిబాట, జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తక్షణం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ రహదారులన్నింటినీ జీఆర్ఆర్ఎంఎస్‌కు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని రహదారులకు మెరుగుపరుచుకునేలా ఈ సాంకేతిక ఉండాలని చెప్పారు. దీన్ని త్వరితగతిన అభివృద్ధి చేయాలని, 48 గంటల్లో అందుకు సంబంధించి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం కావాలని స్పష్టం చేశారు. అడవితల్లి బాటను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకొని ఈ సిస్టమ్‌కు అనుసంధానం చేయాలని పవన్ సూచించారు.

అడవి తల్లిబాటపై అలసత్వం వద్దు

'గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లి బాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనబడటం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలి. కేంద్రం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతో పాటు, ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సాయం మొత్తం కలిపి రూ.1చ158 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించాం. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలి. రూ.2,123కోట్ల సాస్కి నిధులతో పల్లెల్లో 4,007 కి.మీ మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలి. ఈ నెల 17 తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించి జల్‌జీవన్ మిషన్ పనుల్లో పురోగతిని, ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలన చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం ద్వారా వచ్చే మార్చి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కోటి మందికి ప్రాపర్టీ కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పంచాయతీరాజ్ శాఖ, సర్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయం సేకరిస్తాం. ఈ సర్వే తర్వాత ఎవరి భూములు వారికి అప్పగిస్తూ రాజముద్రతో కూడిన ప్రాపర్టీ కార్డులు అందిస్తాం' అని పవన్ పేర్కొన్నారు. ఈ సమీక్షలో గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సర్వే కార్యదర్శి కూర్మనాథ్,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్ ఇన్‌చీఫ్ బాలూనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ గాయత్రి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు తిరుపతికి పవన్

తిరుపతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం తిరుపతి రానున్నారు. ఉదయం 8 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. రేణిగుంట మండలంలోని మామండూరు ఎకో టూరిజం పార్కు సందర్శిస్తారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే గడుపుతారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జలపాతంతో కూడిన మామండూరు ఎకో టూరిజం పార్కు అభివృద్ధిపై సంబంధిత శాఖ అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తారు. అక్కడ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆపై తిరుపతి చేరుకుని మంగళంలోని ఎర్రచందనం గోదామును పరిశీలిస్తారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్ చేరుకుని అధికారులతో సమావేశమవుతారు. మొక్కల పెంపకం మొదలుకుని ఎకో టూరిజం అభివృద్ధి, ఏనుగుల సమస్య, ఎర్రచందనం అక్రమ రవాణా, అభయారణ్యాల పరిధిలోనూ అలాగే సముద్ర, పులికాట్ తీర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుగా ఉన్న అటవీ శాఖ ఆంక్షలు వంటి అంశాలపై సమావేశంలో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

పోర్టల్‌లో రోడ్ల వివరాలు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల సమాచారం త్వరలోనే పౌరులకు అందుబాటులోకి రానుంది. ఈ రోడ్ల స్థితిగతులను తెలుసుకునేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సరికొత్త పోర్టల్‌ను ప్రారంభించనుంది. రోడ్ల పూర్తి డేటాను జియో రూరల్ రోడ్స్ యాప్ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సేకరించారు. దానిని జియో రూరల్ రోడ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(జీఆర్ఆర్ఎంఎస్) పోర్టల్‌కు అనుసంధానించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో గ్రామాల మధ్య కనెక్టివిటీ ఉన్న రోడ్లు రాష్ట్రంలో 31,332 ఉన్నాయని గుర్తించారు. 67వేల కి.మీ. పొడవైన ఈ రోడ్ల వివరాలన్నీ ఇక వెబ్‌లో అందుబాటులోకి రానున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి ఆ రోడ్ల స్థితిగతులను స్థానిక ఇంజనీర్లు అప్‌డేట్ చేస్తారు. వాటి ఫొటోలను వెబ్‌లో ఉంచుతారు. దీంతో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు వెబ్‌సైట్ ద్వారా ఏయే రోడ్లు ఎలా ఉన్నాయో పరిశీలించే చూసుకునే అవకాశం కలుగుతుంది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) ద్వారా గతంలో కొన్ని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పీఎంజీఎస్‌వై రోడ్లన్నింటికీ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆయా రోడ్లకు డిస్ట్రిక్ట్ రూరల్ రోడ్స్ పంచాయతీ రాజ్ (డీఆర్ఆర్‌పీ) కోడ్ నంబర్లు కేటాయించింది. వాటిని మినహాయిస్తూ మిగిలిన రోడ్లకు ఇప్పుడు కొత్త కోడ్ నంబర్లు కేటాయించారు. ఈ రహదారులను బ్యాడ్, ఫెయిర్, వెరీ ఫెయిర్, గుడ్, ఎక్స్‌లెంట్ అనే కేటగిరీలుగా విభజిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో రోడ్లు నిర్మించిన ప్రాంతంలో నేల స్వభావం, తారు, సిమెంట్, డబ్ల్యూబీఎం, గ్రావెల్, ఎర్త్ రోడ్ల వివరాలు కూడా వెబ్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. ఇకపై ఒక్క క్లిక్‌తోనే ఈ సమాచారం మొత్తం అందుబాటులోకి రానుంది.

పోర్టల్ ఆధారంగానే పనులు

సాస్కి పేరుతో 50 ఏళ్ల పాటు తిరిగి చెల్లించే విధానంలో రాష్ట్రాలకు కేంద్రం వడ్డీ రహిత రుణాలను అందిస్తోంది. ఆర్ అండ్‌బీ, టూరిజం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులను వినియోగించుకోవచ్చు. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రోడ్ల నిర్మాణాలకు కేంద్రం నుంచి రూ.2వేల కోట్లు సమీకరించనున్నారు. పోర్టల్‌లో సమాచారం ఆధారంగా తొలుత బాగా దెబ్బతిన్న రహదారులకు ప్రాధాన్యం ఇచ్చి పనులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఈ పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

సీఎం చంద్రబాబుకు నేడు 'తిరువూరు' నివేదిక

» టీడీపీ కేంద్ర కార్యాలయానికి రానున్న చంద్రబాబు

» ఉదయం 11 నుంచి సాయంత్రం 7 వరకు ఇక్కడే

» సంస్థాగత అంశాలపై నేతలతో చర్చలు

» పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులను ప్రకటించే చాన్సు

» లోకేశ్ ఆగ్రహంతో 173 నియోజకవర్గాల్లో గ్రీవెన్స్

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయానికి వస్తున్నారు. తిరువూరు పంచాయితీకి సంబంధించిన నివేదికను క్రమశిక్షణ కమిటీ ఆయనకు సమర్పించనుంది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై చేసిన ఆరోపణలు, ప్రత్యారోపణలు, అనంతర పరిణామాలపై క్రమశిక్షణ కమిటీ సమగ్ర నివేదికను సిద్ధం చేసింది. తిరువూరు సీటు కోసం చిన్నికి రూ.5 కోట్లు ఇచ్చానని కొలికపూడి ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే కమిటీ ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు ఆయన తగిన ఆధారాలు చూపలేదని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. కేవలం చిన్నితో వ్యక్తిగత విభేదాలతో పార్టీని అప్రతిష్ఠ పాల్జేసేలా ఎమ్మెల్యే విమర్శలు చేశారని క్రమశిక్షణ కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది. దాని నివేదికపై చంద్రబాబు ఓ నిర్ణయం తీసుకోనున్నారు. ఆయన శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్టీ కార్యాలయంలోనే ఉంటారు. సంస్థాగత నిర్మాణంతోపాటు పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల అధ్యక్షుల నియామకంపై పార్టీ నేతలతో చర్చించి ప్రకటించే అవకాశం ఉంది. గత వారం పార్టీ కార్యాలయానికి వచ్చిన సమయంలో పార్లమెంటరీ నియోజకవర్గాల అధ్యక్షుల జాబితా సిద్ధంగా ఉందని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో ఓ గంట చర్చించి ఖరారు చేయడమే తరువాయని ఆయన తెలిపారు.

ఆ రెండు నియోజకవర్గాల్లో తప్ప..

నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ సరిగా నిర్వహించడం లేదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలకుగాను 173 నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పి.గన్నవరం, అవనిగడ్డ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం సమాచారం సేకరించింది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అందుబాటులో లేకపోతే వారి స్థానంలో ఎవరు అందుబాటులో ఉన్నారనే విషయాలను కూడా కేంద్ర కార్యాలయ వర్గాలు సేకరించాయి.

టీడీపీ కమిటీల ప్రమాణస్వీకారం

ఈ నెల 11, 12, 13 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోని మండల, వార్డు, గ్రామ కమిటీలతోపాటు క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు.

కోస్తా, సీమలో పెరగనున్న చలి

» జి.మాడుగులలో 15.1 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. దక్షిణ కోస్తాలో కొద్ది ప్రాంతాలకు తప్ప మిగిలిన ప్రాంతాలకు బంగాళాఖాతం నుంచి తేమ గాలుల రాక నిలిచిపోయింది. దీంతో వాయువ్య భారతం నుంచి పొడి గాలులు మధ్యభారతం, ఒడిశా మీదుగా కోస్తా వరకూ వీస్తున్నాయి. ఈ ప్రభావంతో శుక్రవారం ఉదయం ఉత్తర కోస్తా, తెలంగాణకు ఆనుకుని కోస్తాలో పలుచోట్ల చలి పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 15.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల పొడి వాతావరణం నెలకొనగా, కొద్దిచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న రెండు, మూడు రోజులు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, మిగిలిన చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. వాయువ్య భారతం నుంచి వీస్తున్న గాలులతో కోస్తా, రాయలసీమల్లో చలి ప్రభావం ఉంటుందని పేర్కొంది.

భాస్కర్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

- నెల్లూరు జైలుకు తరలింపు
- అతని సోదరుడు ఓబుల్ రెడ్డిపైనా కేసు
- భాస్కర్‌రెడ్డి అరెస్టు సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్‌పై దౌర్జన్యం
- కోర్టుకు హాజరు.. రిమాండ్ విధింపు


భాస్కర్‌రెడ్డి


ఓబుల్‌రెడ్డి

విజయవాడ/పెనమలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులు, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ తదితరులపై సోషల్ మీడియా అనుచిత పోస్టుల కేసులో అరెస్టయిన మాలపాటి భాస్కర్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. రాత్రి 10 గంటల వరకు ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి ఆయనకు ఈనెల 21వ తేదీ వరకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు భాస్కర్‌రెడ్డిని నెల్లూరు జైలుకు తరలించారు. గురువారం భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు.. స్థానిక స్టేషన్లో కాకుండా మరో చోట విచారించారు. తర్వాత పెనమలూరు స్టేషనుకు తరలించి ఎఫ్ఐఆర్‌ను పూర్తి చేశారు. రిమాండ్ నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం ఎస్కార్టు మధ్య విజయవాడ కోర్టుకు తీసుకెళ్లారు.

అవనిగడ్డ జైలుకు భాస్కర్‌రెడ్డి సోదరుడు

కానూరు వంద అడుగుల రోడ్డులోని కామినేని ఆస్పత్రి వద్ద భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొన్న సమయంలో భాస్కర్‌రెడ్డితో పాటు ఉన్న అతని సోదరుడు ఓబుల్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. వారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ఓ మహిళా పోలీసుపై చేయిచేసుకున్నాడు. దీంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత ఓబుల్‌రెడ్డిని విజయవాడలోని ఆరవ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. అతనికి జడ్జి 14 రోజుల రిమాండు విధించారు. అనంతరం పోలీసులు ఆయన్ను అవనిగడ్డ సబ్‌జైలుకు తరలించారు.

అక్కడా.. అదే నీచం..!

- బ్రిటన్‌లోనూ భాస్కర్‌రెడ్డి 'చెత్త' పనులు
- ఆయన షాపులో మైనర్లకు ఎలక్ట్రానిక్ సిగరెట్ల విక్రయం
- నిబంధనల ఉల్లంఘనపై కేసు నమోదు
- భారీ జరిమానా విధించిన అక్కడి కోర్టు
- బీబీసీ సహా అంతర్జాతీయ మీడియాలో కథనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మహిళలంటే కనీసం గౌరవం లేకుండా, అడ్డగోలు పోస్టుల ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడే వైసీపీ సోషల్ మీడియాకు చెందిన ఎన్ఆర్ఐ మాలపాటి భాస్కర్‌రెడ్డికి చెత్త చరిత్ర ఉంది! లండన్‌లో ఉంటూ ఏపీలోని మహిళలు, గిట్టని రాజకీయ పార్టీల నేతలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టే ఆయన.. అక్కడ కూడా చట్టవిరుద్ధ పనులు చేస్తున్నట్లు తేలింది. బీబీసీ, ట్రేడింగ్ స్టాండర్డ్స్ వంటి అంతర్జాతీయ మీడియాలోనూ ఆయన పనులపై కథనాలు వచ్చాయి. లండన్‌లోని టాన్‌టన్‌లో భాస్కర్‌రెడ్డి 'రెడ్డీ న్యూస్' పేరిట ఒక దుకాణం నడుపుతున్నాడు. ఆ షాపులో అక్కడి నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు ఎలక్ట్రానిక్ సిగరెట్లు విక్రయించారు. దీనిపై కేసు నమోదు కావడంతో పాటు భారీగా జరిమానా కూడా విధించారు. భాస్కర్‌రెడ్డి షాపులో సకలం అమ్ముతారు. అయితే బ్రిటన్‌లో ఏ వస్తువు ఎవరికి విక్రయించాలి? 18 ఏళ్ల లోపు వారికి ఏ వస్తువులు అమ్మకూడదు? అనే దానిపై నిర్దిష్ట ప్రమాణాలు ఉంటాయి. వాటిని అక్కడి షాపుల నిర్వాహకులు కచ్చితంగా అమలు చేయాలి. నిబంధనల ఉల్లంఘన జరిగితే కోర్టు కేసులు, భారీ జరిమానాలు, ఇంకా అరెస్టులు కూడా ఉంటాయి. బ్రిటన్‌లోని ది చిల్డ్రన్ అండ్ ప్యామిలీస్ యాక్ట్-2014 ప్రకారం పిల్లలకు సిగరెట్లు అమ్మకూడదు. అలాంటిది భాస్కర్‌రెడ్డి షాపులో చిన్నారులకు ఎలక్ట్రానిక్ సిగరెట్లు విక్రయించడాన్ని స్వయంగా అక్కడి ట్రేడ్ ప్రమాణాల అధికారులు గుర్తించారు. చిన్న పిల్లలకు సిగరెట్లు ఎందుకు అమ్మారని షాపులో విక్రయించిన వ్యక్తిని నిలదీయగా.. తాను ఇక్కడి ఉద్యోగిని కాదని, కేవలం సహాయం చేశానని తప్పించుకో చూశారు. కానీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేయగా.. అతడు సహాయకుడు కాదని, ఆ షాపులో పనిచేసే ఉద్యోగి అని గుర్తించారు. గతేడాది అక్టోబరులో కేసు నమోదు చేశారు. ఈ కేసులో షాపు యజమాని భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆయన ఓ పట్టాన సరైన సమాధానాలు చెప్పలేదు. ఇక అక్కడి పద్ధతిలో విచారిస్తే అన్ని విషయాలు చెప్పారట! తన షాపులో పనిచేసే సిబ్బందికి ట్రేడింగ్ ప్రమాణాలపై శిక్షణ ఇవ్వలేదని, అందుకే మైనర్లకు ఎలక్ట్రానిక్ సిగరెట్లు విక్రయించినట్లు అంగీకరించాడు. దీంతో అక్కడి కోర్టు ఆయనకు 2,326 బ్రిటన్ పౌండ్ల (దాదాపు రూ.2.70 లక్షల పైనే) జరిమానా విధించింది. లండన్‌లో చట్టవిరుద్ధ పనులకు పాల్పడే భాస్కర్‌రెడ్డి.. వీపీఎన్ టెక్నాలజీతో ఎక్స్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఏపీలోని మహిళలు, నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతుంటారు. గూగుల్‌తో పాటు మైక్రోసాఫ్ట్ ఎడ్జ్, ఇతర వెబ్ బ్రౌజర్లలో మాలపాటి భాస్కర్‌రెడ్డి పేరుపై శోధిస్తే చాలు.. టాన్‌టన్‌లో ఆయన వ్యవహారంపై వార్తలు వస్తున్నాయి.

డ్రగ్స్ కేసులున్న వారితో వైసీపీ విద్యార్థి విభాగం: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'గడచిన ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గంజాయి, డ్రగ్స్ పట్టుకున్నా వాటి మూలాలు ఏపీలోనే ఉండేవి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు డ్రగ్స్, గంజాయి వ్యాపారం చేశారు' అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ విద్యార్థి నాయకుడు పి.కొండారెడ్డి డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. 48 గంటలు గడిచినా అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. దీన్ని బట్టి జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారని అనుకోవాల్సి ఉంటుంది. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఉన్న వారితో వైసీపీ తన విద్యార్థి విభాగాలను నడుపుతోంది. వైసీపీ పాలనలో గంజాయి విక్రయాల్లో ఏపీ నంబర్ వన్ స్థానంలో నిలిచింది' అని బ్రహ్మం ఆరోపించారు.



కాకినాడ గాంధీనగర్‌లో 'వందేమాతరం మార్గ్' బోర్డును ఆవిష్కరించిన మాధవ్, బీజేపీ నేతలు


కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతరం గీతాలాపనలో విద్యార్థులు

- రాష్ట్రవ్యాప్తంగా '150' ఏళ్ల గీతరచన వేడుక
- స్ఫూర్తినింపిన వందేమాతర గేయాలాపన
- కాకినాడలో ఘనంగా స్వరాజ్యం, స్వదేశీ, సమైక్యత సంబరం
- ఒక వీధికి 'వందేమాతరం మార్గ్'గా పేరు

వందే.. మాతరం!

విశాఖపట్నం, కాకినాడ, అనంతపురం, కర్నూలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీత రచన జరిగి 150 ఏళ్లయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వందేమాతర గీతాలాపన కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. స్వరాజ్యం, స్వదేశీ, సమైక్యత నినాదంతో కాకినాడలో సాయంత్రం 4 గంటలకు 'వందేమాతరం 150ఏళ్ల సంబరాలు వేడుకగా సాగాయి. బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర శతాబ్దంన్నర కాలంగా దేశ ప్రజల్లో స్ఫూర్తిని రగిలిస్తూనే ఉందన్నారు. 1905లో బ్రిటిష్‌వారు చేపట్టిన ఒక విభజన (బెంగాల్)దేశాన్ని ఐక్యం చేసిందని అన్నారు. 1923 కాకినాడ గాంధీనగర్ పార్కులో స్థానికుడైన బులుసు సాంబమూర్తి, కొండా వెంకటపంతులు వంటి నేతల ప్రోద్బలంతో ఆలిండియా కాంగ్రెస్ సభ జరిగిందని, ఆ సభకు మౌలానా మహ్మద్ అలీ అధ్యక్షత వహించారని, ఈ సమావేశంలో ముందు వందేమాతరం గీతాన్ని విష్ణు దిగంబర్ ఫులస్కర్ ఆలపిస్తుండగా ఆయన్ను మహ్మద్ అలీ అడ్డుకుని సభావేదిక నుంచి దించేశారన్నారు. అలాంటి వ్యక్తి పేరును కాకినాడ గాంధీనగర్ పార్కు ఎదురుగా ఉన్న వీధికి పెట్టడం చాలా విచారకరమని, ఇకపై ఆ పేరును తొలగించి వందేమాతరం మార్గ్‌గా మారుస్తున్నామని ప్రకటించారు. అనంతరం ఆత్మనిర్భర్‌లో భాగంగా స్వదేశీ ఉత్పత్తులనే వాడతామని, ఇతర దేశాల వస్తువులు వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు రాధామోహన్ దాస్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఒక దేశ ద్రోహి పేరు కాకినాడలో ఓ వీధికి పెట్టడం విచారకరమన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పంతాడ సతీశ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. విశాఖ జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు వందేమాతరం పదం ఆకారంలో కూర్చుని తమ జాతీయ భావాన్ని చాటుకున్నారు. విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీ గోపీనాథ్ జట్టి, ఉమెన్స్ కళాశాల, ఏయూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని వందేమాతర గేయాన్ని ఆలపించారు. అనంతపురంలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడ, సాంస్కృతిక పోటీల సందర్భంగా.. వేదికపై సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు వందేమాతర గీతాలాపన చేశారు.కర్నూలు కొండారెడ్డి బురుజువద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి కలెక్టర్ సిరి వందేమాతర గీతాలాపన చేశారు.

'వందేమాతరం' స్ఫూర్తి శాశ్వతం: గవర్నర్

వందేమాతర గీతం స్ఫూర్తి శాశ్వతమైందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. వందేమాతరం గీతాన్ని రచించి, స్వరపరిచిన గొప్ప దేశభక్తుడు, దార్శనిక రచయిత బంకిం చంద్ర ఛటర్జీ అని కొనియాడుతూ, ఘన నివాళులర్పించారు. దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పాఠ్య పుస్తకాల్లో 'వందేమాతరం' మాయం

- ప్రతి ఏడాదీ పదో తరగతి వరకూ ముద్రణ.. ఈ ఏడాది తొలగింపు


వందేమాతరం గేయం లేని నూతన పాఠ్య పుస్తకం

తెనాలి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రతిఒక్కరిలోనూ స్వరాజ్య కాంక్షను రగిలించింది వందేమాతరం గీతం. ఈ పాట పుట్టి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశమంతా సంబరాలు జరుపుకొంటోంది. ఇలాంటి స్ఫూర్తిదాయక సమయంలో రాష్ట్రంలోని పాఠ్యపుస్తకాల్లో 'వందేమాతరం' గేయం కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. పాఠశాల విద్యార్థులు రోజూ ఉదయం ప్రార్థనా సమయంలో దీన్ని ఆలపించాలనే ఉద్దేశంతో ఈ గేయాన్ని పాఠ్యపుస్తకాల్లో ముద్రించేవారు. తొలి పేజీల్లోనే రాజ్యాంగం పీఠికతో పాటు వందేమాతరం, మా తెలుగుతల్లి, జాతీయ గీతం, ప్రతిజ్ఞ ఉండేవి. అయితే గతేడాది వరకూ పదోతరగతి వరకూ అన్ని పాఠ్యపుస్తకాల్లో ఉన్న ఈ గేయం.. ఈ ఏడాది కొత్తగా ముద్రించిన పుస్తకాల్లో మాత్రం మాయమైంది. దీంతోపాటు మా తెలుగుతల్లి గేయాన్ని కూడా తొలగించడం విమర్శలకు కారణమైంది. కొత్త పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగ పీఠిక, జాతీయ గీతం, ప్రతిజ్ఞ మాత్రమే ఉన్నాయి.

వి.కావేరి బస్సు యజమాని అరెస్టు

- బెయిల్ మంజూరు చేసిన స్పెషల్ మొబైల్ కోర్టు
- పోలీసుల చేతికి చేరిన విచారణ కమిటీ నివేదిక
- సీటింగ్ బస్‌గా రిజిస్ట్రేషన్.. స్లీపర్ బస్‌గా రోడ్డుపైకి
- అత్యవసర ద్వారానికి అడ్డంగా స్లీపర్ సీటు
- బస్సులో కనిపించని అగ్నిమాపక యంత్ర పరికరాలు
- నిబంధనల అతిక్రమణ నిజమేనని నివేదికలో వెల్లడి

కర్నూలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన వి.కావేరి ట్రావెల్ బస్సు ప్రమాదం కేసులో బస్సు యజమాని వేమూరి వినోద్‌కుమార్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు కోర్టు బెయిలు మంజూరు చేసినట్టు పోలీసులు తెలిపారు. మరోవైపు... బస్సు ప్రమాద ఘటనపై రోడ్డు రవాణాశాఖ కర్నూలు ఉప కమిషనర్ శాంతకుమారి, ఆర్టీవో చౌహాన్, ఎంవీఐలు సుధాకర్‌రెడ్డి, నాగరాజు నాయక్ సహా నలుగురు సభ్యులతో నియమించిన విచారణ కమిటీ సమగ్ర దర్యాప్తు అనంతరం నివేదిక అందించింది. ట్రావెల్ బస్సు యాజమాన్యం రోడ్డు రవాణా శాఖ నిబంధనలు అతిక్రమించినట్లు కమిటీ నివేదికలో నిగ్గు తేల్చింది.

నివేదికలో కీలక అంశాలివీ..

- వి.కావేరి బస్సును 2018లో తెలంగాణలో రిజిస్ట్రేషన్ చేయగా 53 ఏసీ సీటర్ బస్సుగా అనుమతి ఇచ్చారు. తర్వాత దాన్ని 43 స్లీపర్ బెర్తులుగా ఆల్టేషన్ చేయించి 2023లో డామన్ డయ్యూలో, మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్‌లో 43 సీట్ల బస్సుగా ఒడిశాలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఏసీ సీటింగ్ బస్సుగా రిజిస్ట్రేషన్ చేయించి ఏసీ స్లీపర్ బస్సుగా రోడ్డుపై తిప్పుతూ రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించారు.
- అత్యవసర ద్వారానికి (ఎమర్జెన్సీ డోర్) అడ్డంగా స్లీపర్ సీట్ ఏర్పాటు చేయడం వల్లే ప్రమాద సమయంలో ఆ డోర్ తెరుచుకోలేదు.
- నిబంధనలకు విరుద్ధంగా ఓ గ్యాస్ సిలిండర్, 236కు పైగా సెల్‌ఫోన్లు రవాణా చేయడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.
- బస్సులో తప్పనిసరిగా ఉండాల్సిన రెండు అగ్నిమాపక యంత్రాలు లేవు.

పూచీకత్తుతో బెయిలు మంజూరు

వి.కావేరి బస్సు యజమాని తరఫున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయాధికారిణి బెయిల్ మంజూరు చేస్తూ రూ.10వేలు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించారని కర్నూలు రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రబాబు తెలిపారు. కీలకమైన ఎఫ్ఎస్ఎల్, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖల నివేదికలు తమకు అందాయని, త్వరలోనే దర్యాప్తు నివేదికను న్యాయస్థానానికి అందజేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వి.కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు గతనెల 24న అర్ధరాత్రి 3గంటల సమయంలో కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో ప్రమాదానికి గురై 19 మంది సజీవ దహనమైన సంగతి తెలిసిందే.


బనకచర్ల మా పరిధిలోది కాదు

- తెలంగాణకు పీపీఏ స్పష్టీకరణ
- నేడు పోలవరానికి అతుల్ జైన్ బృందం
- కీలక పనులు స్వయంగా పరిశీలన

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం తమ పరిధిలోకి రాదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చైర్మన్ అతుల్‌జైన్ తెలంగాణకు తేల్చిచెప్పారు. ఈ పథకానికి అనుమతులు ఇచ్చేందుకు గానీ, తిరస్కరించేందుకు గానీ తమకు అధికారం లేదన్నారు. పరిధిలో లేని ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తే తామేమీ మాట్లాడలేమన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీపీఏ సమీక్షా సమావేశం జరిగింది. అతుల్ జైన్‌తో పాటు అథారిటీ అధికారులు, రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు. పోలవరం నిర్మాణంతో ముర్రేడు, కిన్నెరసానితోపాటు భద్రాచలం పట్టణం మునిగిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ ఈ సందర్భంగా తెలిపింది. అయితే తొలి దశలో 41.15 మీటర్ల కాంటూరులోనే నిర్మిస్తున్నందున తెలంగాణ ముంపునకు గురయ్యే అవకాశాలు లేవని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. ఈ విషయంలో పీపీఏ ఎలాంటి ఆదేశాలిచ్చినా పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. దరిమిలా.. పోలవరం నిర్మాణం వల్ల తెలంగాణ భూభాగంలో ఏర్పడే ముంపుపై అధ్యయనం చేసేందుకు, సర్వే చేపట్టడానికి కమిటీ వేస్తామని అతుల్ జైన్ ప్రకటించారు.

ముసాయిదా ఎంవోయూలో మార్పులు

పోలవరం నిర్మాణం పూర్తి చేసేందుకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే పూర్తిగా భరిస్తోంది. ప్రాజెక్టును రాష్ట్రప్రభుత్వం నిర్మిస్తుంటే.. పనుల పర్యవేక్షణ బాధ్యతలన్నీ పీపీఏ చూస్తోంది. దీనిపై 2014లోనే పీపీఏకి, రాష్ట్ర జల వనరుల శాఖకు మధ్య అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదరాల్సి ఉంది. కానీ వాయిదా వేసుకుంటూ వచ్చారు. ప్రాజెక్టును గరిష్ఠంగా 45.72 మీటర్ల కాంటూరులో 194.6 టీఎంసీల నీటి నిల్వతో నిర్మించాలన్నది లక్ష్యం. దీనికి అనుగుణంగానే పీపీఏ ముసాయిదా ఎంవోయూను సిద్ధం చేసింది. అయితే.. అందులో కొన్ని మార్పు చేర్పులను రాష్ట్రప్రభుత్వం సూచించింది. 2019-24 మధ్యకాలంలో ప్రాజెక్టులోని కీలక నిర్మాణాలు, కట్టడాలు ధ్వంసమైన సంగతి తెలిసిందే. డయాఫ్రం వాల్ దెబ్బతింది. గైడ్ బండ్ కుంగిపోయింది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీకి గురైంది. వీటిని ఇప్పుడు పునర్నిర్మించాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయం పెరిగింది.



సాంకేతిక సమస్యలతోనే జాప్యం!

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేసిన వెంటనే..వాటిని ప్రత్యేక ఖాతాలోకి జమ చేస్తుండాలని రాష్ట్రానికి అతుల్ జైన్ స్పష్టం చేశారు. కీలక నిర్మాణాల పనులపై పీపీఏ సంతృప్తి వ్యక్తం చేసింది. డయాఫ్రం వాల్‌ను వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర నిధి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినందునే భూసేకరణ, సహాయ పునరావాసానికి నిధులు వ్యయం చేయడంలో కాస్త జాప్యం జరిగిందని పీపీఏకి వివరణ ఇచ్చారు. కాగా.. అతుల్ జైన్ బృందం శనివారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనుంది. అక్కడ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలిస్తుంది.

'బనకచర్ల'లో భారీ మార్పులు!

(మొదటి పేజీ తరువాయి)

టెండర్లు (ఆర్ఎఫ్‌సీ) పిలిచింది. ఆ వెంటనే తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వ్యతిరేకత మొదలైంది. గోదావరికి వరద సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసుకుంటామని పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. ముఖ్యంగా తెలంగాణ, ఏపీ నేతల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. దీంతో వరద జలాల లభ్యతపై కేంద్ర జలసంఘంతో కలిసి అధ్యయనం తేల్చాలని సాంకేతిక మదింపు కమిటీ ఏపీకి సూచించింది. వాస్తవానికి ఇంత భారీ ప్రాజెక్టు చేపట్టడం ఆచరణ సాధ్యం కాదని సాగునీటి రంగ నిపుణులు కూడా స్పష్టంచేశారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి మళ్లించగానే... కృష్ణా జలాల్లో 80 టీఎంసీలను ఎగువ రాష్ట్రాలకు అప్పగించాల్సి వస్తుందని గుర్తుచేశారు. దీనికంటే.. ప్రకాశం బ్యారేజీలోకి నేరుగా గోదావరి జలాలను ఎత్తిపోయకుండా ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఇబ్రహీంపట్నం సమీపంలోని దాములూరు వద్ద ఓ అక్విడెక్టును నిర్మించాలని సూచించారు. పోలవరం కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించి.. హరిశ్చంద్రపురం వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించారు. ప్రత్యామ్నాయాలపై పెద్దఎత్తున కసరత్తు చేస్తున్న జలవనరుల శాఖ.. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టేందుకు రూ.49,550 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తోంది. ఇందులో 50 శాతం..విదేశీ రుణం.. కేంద్ర నిధులు 20 శాతం అంటే రూ.9,910 కోట్లు.. రాష్ట్రం వాటా పది శాతం (రూ.5,000 కోట్లు), ప్రైవేటు వాటా 20 శాతం (రూ.9,910 కోట్లు). ప్రాజెక్టు తొలి దశలో రూ13,800 కోట్లు, రెండో దశలో 35,750 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. పాత పీఎఫ్‌సీని రద్దుచేసి..నల్లమలసాగర్ వరకు డీపీఆర్ రూపొందించేందుకు ఆసక్తికనబరిచే సంస్థల కోసం మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు.

ప్రాజెక్టు నిర్మాణమిలా..: పోలవరం-నల్లమల సాగర్ తొలిదశలో గోదావరి వరదనీటిని తాడిపూడి వరద కాలువద్వారా పోలవరం కుడి ప్రధాన కాలువలోకి పంపి.. ప్రకాశం బ్యారేజీకి ఎగువన దాములూరు (ఎన్టీఆర్‌జిల్లా)దాకా (175కిలోమీటర్ల మేర) తీసుకెళ్లి.. అక్కడి నుంచి హరిశ్చంద్రపురం వద్ద నాగార్జున సాగర్ కుడికాలువలోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి నల్లమల్లసాగర్‌కు తీసుకెళ్లేందుకు 29 కిలోమీటర్ల మేర మూడుటన్నెళ్లను తవ్వుతారు. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నారు.

లోక్‌అదాలత్‌లో రాజీ చేయించిన పెద్దలెవరు?

- దేవుడి సొమ్ము అపహరించాలని ఎందుకనుకున్నావు?
- 'పరకామణి' కేసులో రవికుమార్‌ను విచారించిన సీఐడీ
- నేడూ విచారణకు రావాలని ఆదేశించిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'దేవుడి సొమ్ము అపహరించాలని ఎందుకనుకున్నావు? ఇంత పెద్దం నేరం చేసినా లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయించిన పెద్దలెవరు?' అంటూ తిరుమల శ్రీవారి పరకామణి కేసులో నిందితుడు రవికుమార్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలతో ఈ కేసు దర్యాప్తునకు రంగంలోకి దిగిన సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని 20మంది అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి శుక్రవారం నుంచి విచారణలో వేగం పెంచారు. రవికుమార్, ఆయన భార్య రమ్య, కుమార్తె ప్రనూషను శుక్రవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి పిలిపించారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం వరకు రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ గంగాధర రావు, లీగల్ టీమ్ లక్ష్మణరావు తదితరులు సుదీర్ఘంగా విచారించారు. మొదట రవికుమార్ భార్య, కుమార్తె విచారణకు హాజరుకాగా.. కాసేపటికి ఆయన్ను కూడా లోపలకు పిలిపించారు. ఈ ముగ్గురినీ వేర్వేరుగా విచారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వ్యక్తిగత వివరాలు, కుటుంబం, బంధువులు, మిత్రుల గురించి వివరాలు తెలుసుకున్నారు. 'పెద్దజియ్యర్ మఠంలో ఉద్యోగంలో ఎప్పుడు చేరావు? అక్కడ్నుంచి పరకామణిలో చేరడానికి సహకరించిన వారెవరు? ఎప్పటి నుంచి టీటీడీ అధికారులు పరకామణిలో విధులు కేటాయించారు? చోరీ ఘటనలో ఇంకెవరైనా ఉన్నారా? మీకు, మీ కుటుంబ సభ్యులకు సంబంధించి స్థిర, చరాస్తులు ఎక్కడెక్కడ.. ఎవరి పేర్లపై ఉన్నాయి' అని అధికారులు ఆరా తీశారు. తన ఆస్తులన్నీ రాయించుకున్నారని రవికుమార్ చెప్పినట్లు తెలిసింది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంటున్న వారికి కుటుంబం ఎలా గడుస్తోందని ప్రశ్నించారు. ఈ చోరీ కేసు వెనుక టీటీడీ, మఠం, పోలీసు అధికారులు ఎవరున్నారో తెలుసుకునే దిశగా విచారణ చేసినట్లు సమాచారం. వారిని అత్యంత భద్రత మధ్య తిరుపతిలో ఉంచినట్లు తెలిసింది. శనివారం మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. కాగా, కొంతమంది టీటీడీ అధికారులను కూడా శనివారం విచారించే అవకాశాలున్నాయి. అతిథి గృహం బయట మీడియా ప్రతినిధులు వేచి ఉండటంతో రవికుమార్ కుటుంబీకులకు మాస్క్ వేసి వెనుక నుంచి పంపించేశారు.

దొంగను దాతను చేశారు: భానుప్రకాశ్

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారికి భక్తులు సమర్పించిన డాలర్లను పరకామణిలో చోరీ చేసిన దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం మాట్లాడారు. 'పరకామణిలో డాలర్లను కాజేసిన దొంగను దాతగా చేశారు. దొంగతనాన్ని కానుకగా మార్చారు. పరకామణిలో పాపపు పనులు చేసిన వాళ్లంతా ఇప్పుడు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారు. దొంగలను తీసుకెళ్లి లోక్ అదాలత్‌లో ఎలా రాజీ చేస్తారు? శ్రీనివాసుడు ఉగ్ర నరసింహుడయ్యాడు. ఖజానాను దోచుకున్న వారిని శిక్షిస్తాడు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. ఆయనకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ఆరోజు తీర్మానాలు చేసి, సంతకాలు చేసింది భూమన కాదా? పరకామణిలో చోరీ చాలా సున్నితమైన అంశం. వైసీపీ నేతల అబద్ధాలను భక్తులు నమ్మవద్దు.' అని భానుప్రకాశ్‌రెడ్డి కోరారు.

మద్యం కుంభకోణం నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి విజయవాడ, గుంటూరు జిల్లా జైళ్లలో ఉన్న ఖైదీలకు ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. వారికి 21వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. ఈ వాయిదాకు బెయిల్‌పై బయట ఉన్న నిందితులు ఎంపీ మిథున్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనంజయ్‌రెడ్డి, పైలా దిలీప్ హాజరయ్యారు. మరో నిందితుడు బాలాజీగోవిందప్ప తాను హాజరుకాలేనని పేర్కొంటూ మెమో దాఖలు చేశారు. సిట్ అధికారులు ఆరోపిస్తున్నట్టుగా తనకు ఏ డిస్టిలరీతో సంబంధం లేదని సజ్జల శ్రీధర్‌రెడ్డి న్యాయాధికారికి వివరించగా.. దీనిపై మెమో దాఖలు చేయాలని ఆయన ఆదేశించారు.

వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరికి నోటీసులు

కర్నూలు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి కర్నూలు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బస్సు ప్రమాద ఘటనపై దుష్ప్రచారం చేసిన 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాడేపల్లిలో ఉన్న శ్రీహరికి పోలీసులు శుక్రవారం నోటీసులు జారీ చేసి మూడురోజుల్లోగా విచారణకు హాజరు కావాలని తెలిపారు.



వంకాయ, టమాటా కాదు

» అచ్చంగా.. 'పచ్చి మిరపే'!

ఈ ఫొటోలో టమాటాలు, వంకాయల మాదిరిగా కనిపిస్తున్నవి.. అచ్చంగా మిరపకాయలే!. సాధారణంగా మిరప కాయలు తొలుత పచ్చగా.. తర్వాత ఎరుపు వర్ణంలోకి మారుతాయి. అయితే, విచిత్రంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడులోని ఓ మిరప చేనేలో ఐదు రకాల రంగుల్లో మిరపకాయలు కాశాయి. ముత్యాల రజిత, రమేశ్‌లకు చెందిన పొలంలో కూలీలు శుక్రవారం పచ్చి మిరపకాయలు కోస్తుండగా ఇవి కనిపించాయి. రెండు మొక్కలకు ఐదు రంగులలో కాయలు కాశాయని రమేశ్ తెలిపారు. ఇవి వంకాయ, ఎరుపు, పసుపు, ఊదా, తెలుపు రంగులలో ఉన్నాయన్నారు. తొలుత వాటిని వంకాయలు, టమాటాలు అనుకున్నామని.. కానీ.. అవి మిరపకాయలేనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

- జగ్గయ్యపేట రూరల్-ఆంధ్రజ్యోతి



మొక్క, నాటిన వారి పేరు, జియోట్యాగింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆనం నారాయణరెడ్డి, పక్కన మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ తదితరులు

మొక్కలూ దత్తతకు...!

ఒక్కో మొక్కను ఒక్కో విద్యార్థికి దత్తత ఇచ్చారు. ఆ మొక్కలను జియోట్యాగింగ్ చేశారు. ఇకపై ఆయా మొక్కల సంరక్షణ బాధ్యత సదరు విద్యార్థులకే అప్పగించారు. ఇలా మొత్తం ఐదు వేల మొక్కలను ఒక్క గంటలో నాటేశారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో శుక్రవారం నగరపాలక సంస్థ ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా... స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. నగరం పచ్చగుండాలని కాంక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఆలయాల్లో మరింతగా డిజిటల్ సేవలు

» ప్రధాన ఆలయాల్లో 100 కియోస్క్‌లు

» దర్శనం, ప్రసాదం టికెట్లు వాటిల్లోనే

» ఉచితంగా కరూర్ వైశ్యా బ్యాంక్ సేవలు

» దేవదాయ శాఖ ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో డిజిటల్ సేవలను పెంచాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. "డిజిటల్ టెంపుల్స్ - స్మార్ట్ ఎండోమెంట్" పేరుతో డిజిటల్ మౌలికసదుపాయాలు కల్పించనుంది. ఇందుకు కరూర్ వైశ్యా బ్యాంక్ సహాయం తీసుకోనుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) కింద డిజిటల్ సేవలకు అవసరమైన కియోస్క్‌ను ఉచితంగా ఇచ్చేందుకు ఆ బ్యాంకు ముందుకువచ్చింది. ఈ మేరకు వచ్చిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కియోస్క్‌లు సరఫరా, అమర్చడం, నిర్వహణ మొత్తం కరూర్ వైశ్యా బ్యాంక్‌దే బాధ్యత అని, ఆలయాలపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కియోస్క్‌ల్లో దర్శనం, ప్రసాదం టికెట్లు, డొనేషన్లు, ఈ-హుండీ సేవలను అందిస్తారు. వీటికి రశీదులు కూడా కియోస్క్‌ల్లో అందుతాయి. మొత్తంగా 100 కియోస్క్‌లను ఆ బ్యాంకు ఉచితంగా దేవదాయ శాఖకు అందిస్తుంది. అందులో 56 రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవాలయాల్లో అమర్చుతారు. మిగిలిన వాటిని 15 డిప్యూటీ కమిషనర్ కేడర్ ఆలయాల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఈ కియోస్క్‌ల ద్వారా భక్తులకు క్యాష్ లెస్ సేవలను అందించాలనే ఉద్దేశంతో పాటు పరిపాలనా సౌలభ్యం పెంచడం, ఆలయాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగేందుకు అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో కమిషనర్ పేర్కొన్నారు. ఇకపై దేవాలయాల్లో జరిగే చెల్లింపులు ఈ కియోస్క్‌ల ద్వారానే చేయాలని స్పష్టం చేశారు. దీని కోసం ఆలయాల పేరుతో కరూర్ వైశ్యా బ్యాంక్ ఖాతాలు తెరవాలని ఈవోలను ఆదేశించారు.

అన్నదాతకు అండ

(మొదటి పేజీ తరువాయి)

మంచి ఫలితాలు రాబడతామని చెప్పారు. రైతులు కూడా పురుగుమందులు విక్రయించే దుకాణాల యజమానుల మాటలు వినకుండా అవసరమైతేనే వాటిని వినియోగించాలని కోరారు. ఇప్పుడు డ్రోన్లు వచ్చాయని, వాటితో పంటలపై సర్వే చేయించి ఎక్కడైతే పురుగు సోకిందో అంత వరకే పురుగుమందులు పరిమిత మోతాదులో పిచికారి చేసేలా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. ఈ వేడుకలకు సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మనిషికి తరచుగా ఆరోగ్య పరీక్షలు ఎలా అవసరమో, అలానే భూమికి కూడా సూక్ష్మపోషకాల స్థితిని తెలుసుకొనేందుకు భూసార పరీక్షలు అవసరమని అన్నారు. పరీక్షలలో లోపాలు బయట పడతాయని, వాటిని సరి చేసుకుంటే సారవంతమైన భూమి సేద్యానికి అందుబాటులోకి వస్తుందని సూచించారు.

పంజాబ్ నుంచి రోజూ రెండు రైళ్లలో క్యాన్సర్ రోగులు ఢిల్లీకి

ఒకప్పుడు పంజాబ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశానికి ధాన్యాగారాలుగా ఉండేవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ రెండుచోట్ల నుంచే బియ్యం ఎగుమతి జరిగేవని తెలిపారు. "నేడు ప్రజల ఆహారపు అలవాట్లు మారిపోయాయి. ప్రొటీన్స్, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉన్న ఆహారాన్ని కోరుకుంటున్నారు. అన్నం తినడం చాలావరకు తగ్గించేశారు. ఇంకోవైపు పంజాబ్ నుంచి నేడు నిత్యం రెండు రైళ్ల క్యాన్సర్ రోగులతో ఢిల్లీకి వైద్య చికిత్సల కోసం వెళుతున్నాయి. ఈ విషయాన్ని అందరూ గమనించాలి" అని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా ప్రజల ఆహారపు అలవాట్లకు తగిన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అందుకే తమ ప్రభుత్వం రాయలసీమని ఉద్యాన హబ్, కోస్తాంధ్రని ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేయనుందన్నారు. అలానే వాణిజ్య పంటల సాగుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

వైసీపీ హయాంలో సాగు తిరోగమనం

"రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతుకు స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా ఇబ్బందులున్నాయి. రైతులంతా టెక్నాలజీని అందిపుచ్చుకోవడంపై దృష్టిసారించాలి. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి. ఖర్చులు తగ్గించి ఉత్పత్తి పెంచగలిగితేనే రైతుకు ఆదాయం పెరుగుతుంది. దీనిపై శాస్త్రవేత్తలు, ఎన్‌జీ రంగా శిష్యులు పరిశోధనలు చేయాలి. రైతులను అన్నివిధాలుగా బాగు చేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తలసరి ఆదాయం, జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా టీడీపీ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉంటుంది. 2014-19లో జీఎస్‌డీపీలో 16.65 శాతం పెరిగింది. ఆ తర్వాత వైసీపీ హయాంలో 10 శాతం తగ్గిపోయే పరిస్థితికి వచ్చింది. 2024-25లో మళ్లీ 15.45 శాతానికి పెంచాం. జీఎస్‌డీపీ పెరిగితేనే రైతుకు ఆదాయం పెరుగుతుంది. 2023-24 ఖరీఫ్, రబీలో 48 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.6 వేల కోట్లు మాత్రమే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం మిగతా మొత్తాన్ని బకాయిలు పెట్టింది. రైతులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. మేము వస్తూనే రూ.1674 కోట్ల బకాయిలు చెల్లించాం. 2024-25లో 55 లక్షలా 79 వేల టన్నుల ధాన్యాన్ని రూ.12,857 కోట్లకు కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు 24 గంటల్లో నగదు చెల్లింపు చేశాం. ఆర్థిక సమస్యలున్నా రైతులకు ఇబ్బంది రాకూడదని వ్యవసాయ ఉత్పత్తులు సేకరించిన 24 గంటల్లోనే నేరుగా బ్యాంకు అకౌంట్లలో నగదు జమ చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

పంటల బీమాపై దుష్ప్రచారం నమ్మొద్దు

"వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.7,500 ఇస్తే, ఇప్పుడు రూ.14 వేలు చేశాం. కేంద్రం రూ.6 వేలు ఇస్తున్నది. రెండూ కలిపి రూ.20 వేలు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద ఇటీవలే రూ.3,174 కోట్లు ఇచ్చాం. మరోవైపు ఇటీవల వరదలు వస్తే ఎక్కువగా కౌలు రైతులు నష్టపోయారు. నేరుగా ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కౌలురైతులకే ఇచ్చాం. వరదలు, విపత్తులు వచ్చినప్పుడు రైతులను ఆదుకుంటున్నాం. గతంలో హెక్టారుకు రూ.20 వేల నష్టపరిహారం ఇస్తే, దానిని వైసీపీ ప్రభుత్వం రూ.15 వేలకు తగ్గించింది. ఇప్పుడు మేము రూ.25 వేలకు పెంచాం. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పంటల బీమా కట్టలేదు. పార్లమెంట్‌లో ఒకసారి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ విషయంపై మాట్లాడుతూ.. పంటల బీమా కవరేజీలో మూడేళ్ల రాష్ట్ర వాటా ఎగ్గొట్టిందని చెప్పారు. మేము వస్తూనే పంటల బీమా 95శాతం కట్టాం. మిగిలిన 5శాతం 12లోపు చెల్లిస్తాం. ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా బీమా ఇప్పించే బాధ్యత తీసుకొంటాం. రైతులకు గిట్టుబాటు ధర పడిపోయినప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ఇందుకోసం మామిడికి రూ.249 కోట్లు, పొగాకుకు రూ.273 కోట్లు, కోకోకు రూ.14 కోట్లు, కాఫీకి ఎకరానికి రూ.5 వేలు, మిర్చికి రూ.130 కోట్లు, టమోటాకు రూ.12 కోట్లు, ఉల్లికి హెక్టారుకు రూ.50 వేల చొప్పున రూ.100 కోట్లు కేటాయించాం. రాయలసీమలో గతంలో డ్రిప్ ఇరిగేషన్ ఆపేస్తే ఈ రోజున మళ్లీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, సాధారణ రైతులకు 50 నుంచి 90 శాతం రాయితీ ఇస్తున్నాం" అని వివరించారు.

పావలా వడ్డీకే రుణాలు

"కౌలు రైతులు ఒక్కోసారి ఎక్కువ పొలం తీసుకొని అప్పులు చేసి వాటిని తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంత వ్యవసాయం చేయగలుగుతారో అంతే భూమిని కౌలుకు తీసుకోవాలి. ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు. ఆత్మహత్యలు చేసుకోవడం పరిష్కారం కాదు. ప్రతీ విషయంలో అండగా ఉంటాం. రైతులకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చేస్తున్నాం. ప్రభుత్వం తీసుకొన్న అన్ని జాగ్రత్తల వల్ల చెరువులు, రిజర్వాయర్లన్నింటిని 95 శాతం నింపాం. రాష్ట్రంలో 1100 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండగా, 1000 టీఎంసీల నీరు నేడు నిల్వ ఉంది. గత వైసీపీ హయాంలో రిజర్వాయర్ల గేట్లు కూడా రిపేర్లు చేసేవారుకాదు. ఈ రోజున ముందుజాగ్రత్తగా నిధులు ఖర్చు పెట్టి రిపేర్లు చేస్తున్నాం. ఇటీవల మొంథా తుఫాను వచ్చినపుడు టెక్నాలజీని కచ్చితత్వంతో వినియోగించి ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించాం" అని చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు, శాస్త్రవేత్తలు, ట్రస్టీ రామినేని కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాపై ఎన్‌జీ రంగా ప్రభావం

"రైతు గౌరవం... దేశ గౌరవం. రైతు అభివృద్ధి... దేశ అభివృద్ధి అని ఆచార్య ఎన్‌జీ రంగా తన జీవితాంతం చెబుతుండేవారు. ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు పార్లమెంట్ లోపల, బయట చేశారు. అవన్నీ నాపై ప్రభావం చూపాయి. నేను పీహెచ్‌డీ చేసేటప్పుడు రంగా ప్రసంగాలను స్ఫూర్తిగా తీసుకొన్నాను. 150 ఏళ్ల క్రితం వందేమాతరం గీతం రచించిన రోజు నవంబరు 7. ఆ సంవత్సరం కాకపోయినా అదే రోజున ఎన్‌జీ రంగా పుట్టినరోజు. ఇది యాదృచ్ఛికమైనా ఒక చరిత్ర. స్వాతంత్ర్య సమరయోధుల్లో అగ్రస్థానంలో ఆచార్య ఎన్‌జీ రంగా నిలుస్తారు. ఆయన గుంటూరులోని ఏసీ కళాశాల నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు విద్యను అభ్యసించి ఆర్థిక శాస్త్రంలో పట్టా పుచ్చుకొన్నారు. రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 33 ఏళ్ల వయసులోనే రైతుల ఉద్యమాన్ని నడిపించిన ధైర్యశాలి. 17వ రాజ్యాంగ సవరణను గట్టిగా వ్యతిరేకించి రైతు ప్రయోజనాలను కాపాడిన మహనీయుడు. రంగా ఒత్తిడికి పార్లమెంట్‌లో నెహ్రూనే తలొగ్గేవారు. ఆయన పార్లమెంట్‌లో ఉంటే రైతు హాయిగా నిద్రపోయేవాడన్న నానుడి ఉండేది. అనేక పుస్తకాలు రచించారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా సేవలందించి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్‌జీ రంగా, ఆయన సతీమణి భారతిదేవి ఆదర్శంగా నిలిచారు. తాము పిల్లలను కంటే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి బలహీనపడుతుందేమోనని పిల్లల్ని కూడా కనలేదు. ఆ తర్వాత నాగేశ్వరరావు అనే వ్యక్తిని దత్తత తీసుకొన్నారు. ఆయన, నేను ఒకేసారి మంత్రుల మయ్యాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి

» సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

హైదరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల కేసులో విచారణ నిమిత్తం ప్రత్యక్ష హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలంటూ ప్రధాన నిందితుడు ఏపీ మాజీ సీఎం జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. ప్రత్యక్షంగా హాజరుకావాలంటూ జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. కావాలంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని తెలిపారు. యూరప్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత నవంబర్ 14 లోపు ప్రత్యక్షంగా తమ ఎదుట హాజరుకావాలని ఇటీవల సీబీఐ కోర్టు జగన్‌కు ఆదేశాలు జారీచేసింది. ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తప్పనిసరి అనుకుంటే స్వయంగా వస్తానని పేర్కొన్నారు. తాను స్వయంగా వస్తే భద్రత ఏర్పాట్లు భారంగా మారుతాయని తెలిపారు. జడ్జి అందుబాటులో లేకపోవడంతో ఈ పిటిషన్ వచ్చేవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

నిమ్మగడ్డపై కోర్టు ధిక్కరణ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వాన్‌పిక్ అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న నిమ్మగడ్డ ప్రసాద్‌పై రాకియా సంస్థ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఒక రాష్ట్ర ప్రభుత్వం అయిన రాస్ అల్ ఖైమాకు చెందిన రాస్ అల్‌ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా) ఓ ఆర్థిక వివాదం విషయంలో ఆయనపై ఈ దావా వేసింది. నిధులు దుర్వినియోగం చేసినందుకు నష్టపరిహారంగా రాకియాకు నిమ్మగడ్డ ప్రసాద్ రూ.600 కోట్లు చెల్లించాలని యూఏఈ కోర్టు డిక్రీ జారీచేసింది. ఈ డిక్రీని అమలు చేయించుకోవడంలో భాగంగా రాకియా హైదరాబాద్‌లోని వాణిజ్య కోర్టులో ఎగ్జిక్యూటివ్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేసింది. అయితే ఇంత సొమ్ము చెల్లించడానికి తన వద్ద ఆస్తులు లేవని ఒక పక్క చెబుతున్న నిమ్మగడ్డ... మరోవైపు ఆయనకు చెందిన ఐక్వెస్ట్ అనే కంపెనీ తన ఆస్తులను అక్రమంగా బదిలీ చేస్తున్నారని రాకియా ఆరోపించింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని పేర్కొంటూ తెలంగాణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం జూలై 1న తీర్పు రిజర్వు చేసింది. వాణిజ్య కోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

బ్యాంకాక్‌లో కొలువని వెళ్తే.. బందీలుగా చేసి 'సైబర్' ఊబిలోకి!

» మయన్మార్ సైబర్ గ్యాంగ్‌ల అరాచకాలు.. ఢిల్లీకి చేరిన బాధితులు

» స్వస్థలాలకు తరలించేందుకు అధికారుల ఏర్పాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్‌లో కొలువు.. రూ.80 వేలకు పైగా జీతం, ఉచిత వసతి అంటూ తెలుగు రాష్ట్రాలకు చెందిన యువతకు మాయమాటలు చెప్పి మయన్మార్ రప్పించుకున్న కేటుగాళ్లు.. వారిని సైబర్ నేరాల ఊబిలోకి దింపారు. బందీలుగా చేసి టార్గెట్లు పూర్తి చేయకపోతే శిక్షలు కూడా వేసేవారు.. శుక్రవారం ఢిల్లీలో బాధితులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా అక్కడి గ్యాంగ్‌ల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. మయన్మార్‌లోని మయవాడీ ప్రాంతంలో కేకే పార్క్ సైబర్ గ్యాంగ్‌లకు చిక్కిన భారత్‌కు చెందిన 270 మంది యువతీయువకులను కేంద్ర విదేశాంగ శాఖ గురువారం ఢిల్లీకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో ఏపీకి చెందిన ఇద్దరు యువతులు సహా 11 మంది, తెలంగాణకు చెందిన 11 మంది ఉన్నారు. బ్యాంకాక్‌లో ఉద్యోగమంటూ ఈ సైబర్ గ్యాంగ్‌లు ఆకర్షిస్తాయని.. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి విమాన టికెట్లు పంపి చెన్నై నుంచి హాంకాంగ్ చేరుకున్నాక.. సైబర్ గ్యాంగ్‌ల ముఠా సభ్యులు వారిని మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దులో గల మయవాడీ ప్రాంతానికి తరలించేవారన్నారు. గ్రేటర్ నోయిడాలో కేంద్ర విదేశాంగ శాఖ అధికారులు బాధితులను ఆయా రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. తెలంగాణ వారిని శుక్రవారం రాత్రి స్వరాష్ట్రానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా, ఏపీకి చెందిన బాధితులను శనివారం ఉదయం పంపనున్నారు.

కిసాన్ డ్రోన్.. సాగు ఖర్చు డౌన్

» ఉత్పాదకత పెంపులోనూ సహాయకారి

» రైతుకు అందించడంపై వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం

» కూటమి పాలనలో అధిక ప్రాధాన్యం

» తొలివిడత 875 గ్రూపులకు పంపిణీ

» వెయ్యి డ్రోన్లు అందించాలన్నది లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



డ్రోన్ సాంకేతికత వ్యవసాయ రంగంలో కొత్త శకానికి నాంది పలికింది. రైతులకు ఖర్చులు తగ్గించి, ఉత్పాదకతను పెంచడంలో ఓ మేరకు సహాయకారిగా మారింది. గత ప్రభుత్వం ఈ అత్యాధునిక సాంకేతికతను రైతులకు అందివ్వడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం తొలి దశలో 870 కిసాన్ డ్రోన్లను రాష్ట్రానికి కేటాయించగా... వాటిని పంపిణీ చేయకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసింది. టెక్నాలజీకి ప్రాధాన్యమిచ్చే సీఎం చంద్రబాబు రైతు బృందాలకు డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) పథకాన్ని సద్వినియోగం చేసుకుంది. రూ.10 లక్షల విలువ చేసే కిసాన్ డ్రోన్‌కు కేవలం 20% చెల్లిస్తే 80% సబ్సిడీతో రైతు బృందాలకు అందిస్తోంది. 2024-25లో 875 డ్రోన్లు పంపిణీ చేసింది. గరిష్ఠంగా పల్నాడు జిల్లాకు 61, కనిష్ఠంగా అల్లూరి, విశాఖ జిల్లాలకు ఒక్కొక్కటి ఇచ్చారు. 2025-26లో 1,000 డ్రోన్లు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. ఇందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో సబ్సిడీ కింద రూ.80 కోట్లు కేటాయించారు. ఐదుగురు సభ్యులు ఉన్న రైతు బృందానికి డ్రోన్ కేటాయిస్తారు. దాని నిర్వహణకు శిక్షణ పొందిన పైలట్‌నూ సమకూరుస్తారు. దీని వలన రైతుకు లాభంతో పాటు యువతకు జీవనోపాధి లభిస్తుంది. రైతు బృందం కేవలం తమ పొలాలకే కాకుండా తోటి రైతులకు డ్రోన్ సేవలు అందించవచ్చు. దీని ద్వారా ఒకటి, రెండు నెలల్లోనే డ్రోన్ కొనడానికి పెట్టిన 20 శాతం పెట్టుబడిని తిరిగి పొందుతున్నారు. గత ఖరీఫ్‌లో లక్ష ఎకరాల్లో వివిధ పంటలపై పురుగు మందుల పిచికారికి వీటిని ఉపయోగించారు. ప్రస్తుత రబీలో 5 లక్షల ఎకరాలకు ఈ సేవలు విస్తృతం చేయాలని వ్యవసాయ శాఖ రైతు బృందాలకు నిర్దేశించింది. ఈక్రమంలో మరిన్ని డ్రోన్లు కోసం రైతుల నుంచి అభ్యర్థనలు వెల్లువెత్తుతున్నాయి.


యాంత్రీకరణ తప్పనిసరి

అంతర్జాతీయంగా ఆహార ఉత్పత్తులకు గణనీయమైన డిమాండ్ ఉంటోంది. అయితే ఓవైపు కూలీల డిమాండ్, మరోవైపు విపత్తులు... సాగు ఖర్చులు పెరిగి రైతులను కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి సాంకేతికతను జోడించడం అవశ్యంగా మారింది. యాంత్రీకరణ తప్పనిసరి అవుతోంది. ఈ క్రమంలోనే అందుబాటులోకి వచ్చిన డ్రోన్ సాంకేతికత... ఉత్పత్తి స్థిరీకరణ, ఇన్‌పుట్ వ్యయం తగ్గింపు అంశాల్లో రైతుకు చేదోడుగా మారింది. పురుగు మందుల పిచికారికి ఇప్పటి వరకు రైతులు, కూలీలు చేతి పంపులు, ఇంజన్ స్ప్రేయర్లు వాడుతున్నారు. వాటి బదులు డ్రోన్లు వాడడం వల్ల పని తొందరగా అవుతుంది.

రంగా వర్సిటీలో పరిశోధనలు

వ్యవసాయ డ్రోన్లపై పరిశోధనలను 2018 నుంచి గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చేస్తోంది. పురుగు మందులను డ్రోన్లతో వాడడాన్ని విస్తృతం చేయడంపై వర్సిటీ దృష్టి పెట్టింది. సాంప్రదాయ పద్ధతులతో పోల్చితే డ్రోన్ ఆధారిత పిచికారితో పురుగుమందుల వినియోగాన్ని 25 శాతం తగ్గించవచ్చని రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు నిరూపించారు. వేర్వేరు పంటల్లో డ్రోన్ స్ప్రేయింగ్ కోసం ప్రామాణిక విధానాలపై మార్గదర్శకాలనూ తయారు చేశారు. కిసాన్ డ్రోన్లును సురక్షితంగా వాడడానికి ఒక ప్రత్యేక కేంద్రాన్ని... ఆంధ్రప్రదేశ్ సెన్సార్ అండ్ స్మార్ట్ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ (ఏపీఎస్ఏఆర్ఏ) ను ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్ రిమోట్ పైలట్ కోర్సు(ఏపీఆర్‌సీ) పేరుతో కిసాన్ డ్రోన్ల నిర్వహణకు 12 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రంగా వర్సిటీ నిర్వహిస్తోంది. డ్రోన్లు నిర్వహణను సురక్షితం చేయడానికి పంపిణీకి ముందు వర్సిటీ శాస్త్రవేత్త పర్యవేక్షణలో సమగ్ర (విమాన) పరీక్షలను నిర్వహించిన తర్వాతే వ్యవసాయ శాఖ రైతులకు కిసాన్ డ్రోన్లు పంపిణీ చేసింది. ఈ డ్రోన్లను వ్యవసాయ శాఖతో పాటు సరఫరా కంపెనీ డ్రోగో డ్రోన్స్ సాంకేతిక విభాగం పర్యవేక్షిస్తోంది. ఇటీవల మొంథా తుఫాన్ సహాయ చర్యల్లో కిసాన్ డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీటిని అందించిన డ్రోగో డ్రోన్స్ సీఈవో యశ్వంత్‌కు ప్రభుత్వం అవార్డు కూడా ఇచ్చింది.


డ్రోన్‌తో సమయం, ఖర్చు ఆదా అవుతోంది



మొదట్లో డ్రోన్‌తో పురుగు మందులు స్ప్రే చేయడమంటే రైతులు ఆశ్చర్యపోయారు. అవగాహన కల్పించాక ఇప్పుడు మా మండలంలో చాలామంది మా డ్రోన్‌ను వాడుకుంటున్నారు. స్ప్రేయర్లతో రోజుకు రెండెకరాలే చేయగలరు. డ్రోన్‌తో 25ఎకరాల వరకూ చేయవచ్చు. మ్యాన్యువల్‌గా ఎకరానికి 100 లీటర్లు నీళ్లువాడితే... డ్రోన్‌తో 20-25 లీటర్లు సరిపోతుంది. ఎకరానికి రూ.350తీసుకుంటాం. ఒకటిన్నర ఎకరానికి మందు కొట్టాలంటే కూలీలకు రూ.700 ఇవ్వాలి. అదే సొమ్ముతో డ్రోన్‌తో 2ఎకరాలకు పని అయిపోతుంది.

- ఎస్ శివదత్తు, యువ రైతు, పోలవరం, ఏలూరు జిల్లా

సబ్సిడీ వల్లే తక్కువ చార్జి చేస్తున్నాం



వ్యవసాయ శాఖ ఇచ్చిన కిసాన్ డ్రోన్‌ను మా విఘ్నేశ్వర గ్రూపులోని రైతులందరం వినియోగిస్తున్నాం. ఎవరైనా రైతులు అడిగితే అద్దెకు ఇస్తున్నాం. సీఎం చంద్రబాబు సబ్సిడీపై డ్రోన్లు ఇవ్వడం వల్లే తక్కువ చార్జి చేస్తున్నాం. డ్రోన్‌కు 80% సబ్సిడీ అంటే చిన్న విషయం కాదు! మాకు లేబర్ కొరత ఉన్నందున డ్రోన్ వాడకం వల్ల కూలీల డిమాండ్ తగ్గింది. డ్రోన్‌తో పని తేలిగ్గా అవుతోంది. చేతి పంపులతో పురుగు మందు పిచికారి చేస్తే మనుషులకు ఆరోగ్య సమస్యలు వస్తాయి. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల ఆరోగ్యానికి ఇబ్బంది లేదు.

- పీ జస్వంత్‌రెడ్డి, యువ రైతు, పెనుబర్తి, నెల్లూరు జిల్లా

కార్యకర్తలు నడిపించే పార్టీ టీడీపీయే

» వారి సంక్షేమానికి 135 కోట్లు ఖర్చుచేశాం

» బాబు అనుభవంతో ఏపీని సమర్థంగా నడిపిస్తున్నారు

» వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

» కల్యాణదుర్గంలో కార్యకర్తలకు మంత్రి లోకేశ్ పిలుపు

» నియోజకవర్గ కార్యకర్తలు, నేతల భేటీకి హాజరు



అనంతపురంలో మంత్రి లోకేశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

అనంతపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రాన్ని సమర్థంగా ముందుకు నడిపిస్తున్నారని ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో టీడీపీ నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు నడిపించే పార్టీ ఒక్క టీడీపీయేనన్నారు. వారి సంక్షేమం కోసం ఇప్పటికే రూ.135 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. జగన్ ఏనాడూ సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని, కనీసం వారికి చేయి కూడా అందించడని విమర్శించారు. సొంత కార్యకర్త కారు కిందపడి చనిపోతే పక్కన పడేసి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. 'మీకు నేను ఎంత చేసినా తక్కువే. ఐదేళ్లు వైసీపీపై పోరాడారు. అందుకే జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు నేను గానీ.. సీఎం గానీ ముందుగా కార్యకర్తలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటున్నాం' అని చెప్పారు. చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని అలసట వీడి ముందడుగు వేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. ఆయన రేయింబవళ్లూ కష్టపడతారని అన్నారు. ఇటీవల తాను ప్రధానిని చూసి ఆశ్చర్యపోయానని, 75 ఏళ్ల వయసులోనూ ఆయన ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయన్నారు.' అని తెలిపారు. 'నాకు అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు లేరు. స్వర్గీయ ఎన్టీఆర్ నాకు కోటి మంది టీడీపీ కుటుంబ సభ్యులను ఇచ్చారు. పసుపు జెండాను చూసినా, రంగును చూసినా మనకు ఎమోషనే... కార్యకర్తలను చూసి ఉత్సాహం తెచ్చుకున్న వ్యక్తి మీ లోకేశ్ అని మంత్రి చెప్పారు. 'తెలుగుదేశం పార్టీ అంటే అనంతపురం... అనంతపురం అంటే తెలుగుదేశం పార్టీ. మా కుటుంబాన్ని మీరు దీవించారు. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణను అక్కున చేర్చుకుని గెలిపించారు. మొన్నటి ఎన్నికల్లో సూపర్ మెజారిటీ ఇచ్చారు' అని వ్యాఖ్యానించారు.

ఆగస్టు నాటికి వెలిగొండ ద్వారా నీళ్లు: నిమ్మల

పెద్ద దోర్నాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా జీవనాడి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి 2026 ఆగస్టు నాటికి కృష్ణా జలాలను అందించే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా వెలిగొండ ప్రాజెక్టులోని కీలకమైన ఫీడర్ కెనాల్ దెబ్బతిన్నది. మంత్రి నిమ్మల, ఇరిగేషన్ నిపుణుల బృందం, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలసి శుక్రవారం మండలంలోని కొత్తూరు వద్ద ఫీడర్ కెనాల్‌ను, రెండవ సొరంగంలో చేరిన వరద నీరు తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'ప్రాజెక్టులో చాలా పనులు పెండింగులో ఉంటే ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేశామంటూ గత ప్రభుత్వ పెద్దలు అబద్ధాల వల్లెవేశారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన వారికి ప్రజలను మోసం చేయడం ఓ లెక్కా..! యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అధికారులతో చర్చలు జరిపాం' అని నిమ్మల తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.